టిసిపార్డ్
TSIPARD

స్థానిక పాలన
గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 7 సంచిక: 9

అక్టోబర్, 2015



ఎడిటర్
**అనిత రామచంద్రన్**, ఐ.ఏ.ఎస్.
కమీషనర్, అపార్డ్

ఎడిటోరియల్ బోర్డు
**కె. యాదయ్య**
**డా॥ కె. ఆసయ్య**
**ఎ. నాగేశ్వరరావు**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
**సెంటర్ ఫర్ మీడియా పబ్లికేషన్స్, టిసిపార్డ్**
**కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్



ప్రచురణ
**టిసిపార్డ్**
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
తెలంగాణ, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : editorsthanikapalana@gmail.com
Website: www.tsipard.gov.in



ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి గాని, టిసిపార్డ్‌కి గాని చెందినవిగా భావించనక్కరలేదు.


# విషయ సూచిక


సంపాదకీయం ........ 4

పల్లె సమగ్ర సేవా కేంద్రాలు ........ 5

గ్రామజ్యోతి స్ఫూర్తితో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించిన సిరిసిల్ల నియోజకవర్గం ........ 8

వందశాతం మరుగుదొడ్లు నిర్మించి- మహిళల ఆత్మగౌరవం పెంపొందించిన 'చిన్నబోనాల' గ్రామం- కరీంనగర్ జిల్లా ........ 10

ఇంటింటికీ-ఇంకుడు గుంతలు - మాదాపూర్ - కరీంనగర్ జిల్లా ........ 12

గామజ్యోతి ద్వారా మరో ఆదర్శ గ్రామ పంచాయతీ - కొండన్నపల్లి ........ 14

గ్రామజ్యోతి స్ఫూర్తితో ఆదర్శగ్రామంగా అడుగులు వేస్తున్న 'మన్మథ్' గ్రామం ........ 16

గాంధీజీ కలల స్ఫూర్తికి అనుగుణంగా గ్రామజ్యోతి ఆశయాలు ........ 18

ఆ గ్రామంలో . . . అభివృద్ధి జ్యోతి ........ 21

గ్రామజ్యోతిలో భాగంగా ఇంకుడుగుంతల నిర్మాణం ఆదర్శంగా నిలిచిన శ్రీరాంనగర్ ........ 22

గ్రామజ్యోతి అఖండజ్యోతి ........ 26

గ్రామజ్యోతి స్ఫూర్తితో గ్రామానికో శ్రీమంతుడు ........ 27

గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్య దిశగా గ్రామపంచాయతీలు ........ 30

ఇబ్రహీంపూర్ ఆదర్శ గ్రామ పంచాయతీ ........ 34

గ్రామజ్యోతి స్ఫూర్తితో గుడుంబాను తరిమికొడుతున్న వరంగల్ జిల్లా ........ 37

వరంగల్ జిల్లా లక్నెపల్లిలో గ్రామజ్యోతి ........ 39

గ్రామజ్యోతి స్ఫూర్తితో ప్రగతిపథంలో 'పీపుల్ పహాడ్' ........ 41

గ్రామ స్వరాజ్య స్ఫూర్తితో గ్రామజ్యోతి ........ 43

హాజిపల్లి అందరికీ నచ్చింది... ఈ పల్లెను ప్రపంచమే మెచ్చింది ........ 46

ఆదర్శగ్రామంగా గంట్లవెల్లి గ్రామం ........ 51

తెలంగాణ రాష్ట్రంలో 'గ్రామజ్యోతి' కార్యక్రమం అమలు -పూర్వాపరాలు ........ 55

ఈ పల్లెలను చూసి నేర్చుకుందాం ........ 57

72 గంటల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం గ్రామంగా నవాబ్‌పేట్ ........ 59

పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు ........ 61

గ్రామజ్యోతి స్ఫూర్తితో గ్రామాలకు సమాచార సాంకేతికత అనుసంధానం ........ 63

సమిష్టిగా పనిచేద్దాం ........ 66

# ప్రజలు తమ గ్రామాభివృద్ధి కోసం తాము వేసుకునే ప్రణాళిక గ్రామజ్యోతి

ఏ కార్యక్రమం అమలు చేయాలన్నా ఒక ప్రణాళికబద్ధంగా అమలు చేసినట్లయితే నిర్దేశించిన లక్ష్యాలను సాధించవచ్చును. అందుకే తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మరియు గ్రామీణాభివృద్ధి శాఖలు గ్రామాల అభివృద్ధి కోసం నిర్ధిష్ట కార్యక్రమాలను గ్రామజ్యోతి పేరుతో ప్రతి గ్రామంలో అమలు చేయడం జరుగుతుంది. ఈ భాగస్వామ్య ప్రణాళికల తయారీలో ప్రధాన లబ్ధిదారుల భాగస్వామ్యాన్ని గ్రామసభ సమావేశాల ద్వారా వీలు కల్పించడం జరుగుతుంది. గతంలో గ్రామాభివృద్ధిలో పేదవారి భాగస్వామ్యం సరిగా లేకపోవడంతో అభివృద్ధి సక్రమంగా, తగినంతగా జరగలేదు. కనుక ప్రజా భాగస్వామ్యంతో గ్రామ ప్రణాళికను తయారు చేయడానికి గ్రామజ్యోతి కార్యక్రమంలో అధిక ప్రాధాన్యత ఉంది.

కార్యక్రమ ఇతర ఉద్దేశాలు సంబంధిత ఉద్యోగులకు అవగాహన పెంచడం, వారినైపుణ్యాలను గ్రామ సమస్యలను పరిష్కరించటంలో ఉపయోగించే దిశగా ప్రోత్సహించటం. భాగస్వామ్య ప్రణాళిక రచనా పద్ధతులలో మంచి అవగాహన కల్గించి, సంబంధిత గ్రామస్తులకు మార్గదర్శకత్వం చూపే మంచి సలహాదారులను తయారు చేయడం. భాగస్వామ్య ప్రణాళిక అమలు వివిధ దశల్లో కావలసిన సామాజిక చైతన్యం, పర్యవేక్షణలను పెంపొందించి ఎప్పటికప్పుడు మూల్యాంకనం చేసుకొని ముందుకుపోవడం.

నేడు ఎన్నికైన లక్షలాది ప్రజాప్రతినిధులకు (అందులో సగమున్న మహిళా ప్రతినిధులతో సహా) వారిని స్థానిక భాగస్వామిక గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారు చేసి అమలు చేయటంలో మూల్యాంకనం చేయడంలో అవగాహనా సామర్థ్యాలను పెంచాలి. జిల్లా, మండల, గ్రామస్థాయిలో సర్పంచులకు, పంచాయితీ కమిటీ సభ్యులతో పాటు, ప్రభుత్వోద్యోగులకు అవగాహన పెంచి గ్రామాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయునట్లు మార్గదర్శకం చేయాలి.

ప్రణాళికా రచనలో పై నుండి వచ్చే ప్రణాళికలు అమలు చేయటం కంటే క్రింది స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో తయారైన ప్రణాళికల ఫలితాలు బాగా ఉంటాయనేది ప్రపంచ వ్యాప్తంగా నిరూపించబడింది. వికేంద్రీకృత ప్రణాళిక పద్ధతిలో ప్రజలను భాగస్వాముల్ని చేయటం చాలా ముఖ్యం. ప్రజలు ఎప్పుడు మంచి మార్పు కోరుకుంటారు. ఆ మార్పుకు తగిన విధంగా వివిధ దశల్లో సమన్వయం చేయడం, అమలు చేసుకోవటం నోడల్ అధికారులు, మార్పు నిర్దేశకులది ప్రధాన పాత్ర కనుక కార్యాచరణ కమిటీలు వేయటం, సిబ్బంది శిక్షణ, పారదర్శకత, ఆటంకాలు ముందుగా ఊహించుట, సమయానుసారం నిధుల వినియోగం అనే అంశాలు చాలా ముఖ్యం.

73వ రాజ్యాంగ సవరణ నిర్దేశన ప్రకారం గ్రామసభ ఒక శక్తివంతమైన ఆయుధం. ఇందులో ప్రచార సాధనాలు, వార్తా పత్రికలు, రేడియో, టెలివిజన్ కూడా సహకరించి చైతన్యం పెరగటంలో తమ వంతు కృషి చేసి, అభివృద్ధి ఫలాలు గ్రామస్థులకు అందేలా చేయాలి. నిజమైన అభివృద్ధి జరిగేందుకు సహకరించాలి.

ఈ విషయంలో కేరళ, కర్నాటక, రాష్ట్రాలలో పంచాయతీ వ్యవస్థలు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ముందున్నాయి. మన తెలంగాణ కూడా ఆ పంథాలో నడచి గ్రామజ్యోతి కార్యక్రమం ద్వారా ప్రజలను గ్రామాభివృద్ధిలో భాగస్వాములను చేసి వివిధ కీలక రంగాలలో గ్రామాభివృద్ధిని సాధించే ప్రక్రియను ప్రారంభించింది.

ప్రజలందరూ గ్రామజ్యోతిలో భాగస్వాములై గ్రామాభివృద్ధిని, తద్వారా తమ అభివృద్ధిని సాధించటానికి ప్రగతిపథంలో పయనిస్తారని ఆశిద్దాం.

( అనిత రామచంద్రన్ )



# పల్లె సమగ్ర సేవా కేంద్రాలు

**తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లోని పౌరులకు వారి ముంగిటిలో ఆర్థికమైన మరియు పౌర సేవలను ఒకే చోట అందించటానికి ఉద్దేశించిన ఒక వినూత్న ప్రయత్నమే పల్లె సమగ్ర సేవా కేంద్రాలు. ఇలాంటిది భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా మన రాష్ట్రంలో అన్ని పౌర సేవలను ఒకే చోట అందించడమనేది చాలా అద్భుతమైన ప్రయత్నం.**

సమాచార సాంకేతిక పరిజ్ఞానంతో ప్రవేశపెట్టిన పల్లె సమగ్ర సేవా కేంద్రాల ఆవిష్కరణతో పంచాయితీల ముఖ చిత్రాలు మారే అద్భుత అవకాశం ఏర్పడింది.

**ప్రజల సాధికారతకు**

**పాలనలో పారదర్శకతకు**

**జవాబుదారి ఏలుబడికి**

పల్లెల్లో ప్రపంచ విజ్ఞాన సర్వస్వాన్ని అనుసంధానించడానికి సర్వ సమగ్రంగా పల్లె సమగ్ర సేవా కేంద్రాలు ఆవిష్కారమయ్యాయి.

గ్రామీణ భారతాన్ని, భావితరాన్ని, భాగ్యరేఖలుగా భాగ్య ప్రదాతలుగా తీర్చిదిద్దే కేంద్రాలుగా పల్లె సమగ్ర సేవా కేంద్రాలు అవతరిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

ప్రభుత్వ సేవలను ఏలాంటి అవాంతరాలు లేకుండా అందించడమే కాకుండా ప్రజల సమయం మరియు ధనం ఆదా చేయడం కూడా దీనిని ప్రారంభించటంలో ముఖ్య ఉద్దేశం. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సేవలను ప్రారంభించటం వలన గ్రామీణ ప్రాంతాల పేదలకు ముఖ్యంగా నిరుపేదలకు సాంకేతిక సేవలకు గల దూరాన్ని తగ్గించే వారిధిగా పని చేయడమే కాక గ్రామ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చి వేస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఈ ప్రయత్నం వలన అందించే పారదర్శకమైన సేవలు గ్రామీణ ప్రాంతాల్లో ఒక నూతన శకానికి తెర తీస్తుంది.

బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించే దిశగా గాంధీజయంతి రోజున తెలంగాణ రాష్ట్రం మరో మైలురాయిని అధిగమించింది. సమాచార సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను, గ్రామ గ్రామాన పల్లె సమగ్ర సేవా కేంద్రాల ద్వారా అందించబోతోంది. ప్రస్తుతం పరిమిత సేవలను అందించే ఈ కేంద్రాలు భవిష్యత్తులో దాదాపు మూడు వందలకు పైగా అనేక రకాలయిన సేవలు అందించనుంది.

**ఐ.టి. సేవలతో అభివృద్ధికి బాట**
**అక్రమాలకు అడ్డుకట్ట**

*గ్రామపంచాయతీలలో స్థాపించే ఈ పల్లె సమగ్ర సేవా కేంద్రాలు ప్రజలకు అందించు సేవలు:*

- భీమా సేవలు
- బ్యాంకింగ్ సేవలు
- వివిధ రకాల చెల్లింపులు
- ఇంటి పన్నులు
- లైసెన్సుల జారీ
- స్త్రీ నిధి అందించే ఆర్థిక సేవలు
- మీ సేవ కేంద్రాల ద్వార అందించే సేవలు
- ఇ-పంచాయతీ సేవలు
- ఫిర్యాదుల పరిష్కారాలు
- ఫీజుల చెల్లింపులు



- వేలం పాటల విధానం
- కోర్టు కేసులు
- ధృవపత్రాలలో పేరు మార్పిడి సదుపాయం
- ఎన్.ఓ.సి.లు (నిరభ్యంతర పత్రాలు)
- నల్లా కనెక్షన్లు
- భవన నిర్మాణం మరియు ఇతర అనుమతులు
- ఆస్తుల విలువ నిర్ధారణ పత్రాలు
- వివాహ నమోదు పత్రాలు
- ఇంటి యాజమాన్య హక్కు పత్రాలు అందించే సౌకర్యాలు
- జనన మరణ ధృవపత్రాల జారీ
- ఇతర ప్రభుత్వ సేవలు మొదలగు కీలకమైన సేవలను అందిస్తున్నాయి.

ప్రాథమికంగా ఈ కేంద్రాలు ప్రస్తుతం బ్యాంకులకు అనుసంధానంగా వ్యాపార భాగస్వామిగా పనిచేస్తున్న స్త్రీనిధి కేంద్రాలు. గ్రామీణ వ్యాపార వ్యవస్థాపక కేంద్రాలుగా పనిచేస్తున్న చోట ప్రారంభించబడతాయి.

హైదరాబాదు స్టేట్ బ్యాంకు మరియు ఆంధ్రా బ్యాంకులతో స్త్రీ నిధి కేంద్రాలు ప్రస్తుతం బ్యాంకులకు వ్యాపార భాగస్వామిగా ఒప్పందం కుదుర్చుకొన్నాయి. ఇవి స్వయంసమృద్ధి సాధించాలి. ఈ కేంద్రాలు స్వయంసమృద్ధి సాధించడానికి బ్యాంకు కార్యకలాపాలు, పెన్షను చెల్లింపులు మరియు ఉపాధి హామీ కూలీ చెల్లింపులు ఈ కేంద్రాల ద్వారా జరగడం చాలా అవసరం. గ్రామస్థాయి వ్యాపార కేంద్రాలుగా ఇవి నెలకు దాదాపుగా రూ.5000 పొందగలిగే అవకాశం ఉంది.

### గ్రామస్థాయి పారిశ్రామిక ప్రతినిధులు

గ్రామస్థాయి పారిశ్రామిక ప్రతినిధులుగా మహిళలు ఉంటారు. వారు కృతనిశ్చయంతో పారదర్శకంగా, అంకిత భావంతో పనిచేయ వలసి ఉంటుంది. ఆర్థికపరమైన ఒడుదుడుకులు ఎదురైనప్పటికీ లాభాలు చేకూరుతాయనే సంకల్పంతో పల్లె సమగ్ర సేవా కేంద్రాన్ని నిర్వహించగలిగే సత్తా వారు కలిగి ఉండాలి.

గ్రామస్థాయి పారిశ్రామిక ప్రతినిధుల్ని గ్రామ సమాఖ్యలు (స్వయం సహాయక బృందాలు) మరియు స్త్రీ నిధి బ్యాంకు అధికారులు నిర్ణయిస్తారు. గ్రామస్థాయి పారిశ్రామిక ప్రతినిధులుగా నిర్ణయించాలంటే కనీసం ఇంటర్మీడియెట్ విద్యార్హత కలిగి ఉండాలి. దీనిలో గ్రామపంచాయితీల్లో ఉన్న దళిత మరియు గిరిజన మహిళలకు ప్రాధాన్యత ఉంటుంది. అన్ని రకాలైన సేవలను అందించటంలో గ్రామస్థాయి పారిశ్రామిక ప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలి. వీరికి సమాచార, సాంకేతిక (ఐ.టి.) మరియు ఇతర సాంకేతికపరమైన అంశాలపై విస్తృతస్థాయిలో శిక్షణలు ఇవ్వడం జరుగుతుంది.

పల్లె సమగ్ర సేవా కేంద్రాలను గ్రామాలలో వారు స్థాపించే బాధ్యత పూర్తిగా పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ తీసుకుంటారు. పల్లె సమగ్ర సేవాకేంద్రాలు తప్పనిసరిగా గ్రామపంచాయితీ ఆవరణలోనే ఉండాలి. పల్లె సమగ్ర కేంద్రానికి అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు మరియు ఇతర అనుసంధానమైన పరికరాలు గ్రామపంచాయితీ అందుబాటులో ఉంచాలి. అనంతరం నెమ్మదిగా ఒక్కొక్కటి అవసరమైన పరికరాలు/ ఇతర వస్తువులను పల్లె సమగ్ర సేవా కేంద్రాలు సమకూర్చుకోవాల్సి వుంటుంది. పల్లె సమగ్ర సేవా కేంద్రాల సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు తగిన కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ను మరింత అభివృద్ధి చేయవలసి వుంటుంది.



అంతేకాక గ్రామ పారిశ్రామిక ప్రతినిధులకు ఎప్పటికప్పుడు వారి నైపుణ్యానికి పెంపొందించేందుకు తగిన కంప్యూటర్ శిక్షణ కూడా ఇవ్వవలసి ఉంటుంది.

స్త్రీ నిధి కేంద్రాలు దాదాపు 1010 చోట్ల బ్యాంకులతో ఒప్పందాలు కుదుర్చుకొని ఉన్నాయి. ఈ కేంద్రాలు అన్నింటిని రాబోయే 3 నుండి 6 నెలలలోగా ప్రభుత్వ మరియు సెర్ప్ సంస్థ సహకారంతో పల్లె సమగ్ర సేవా కేంద్రాలుగా మార్చబడతాయి.

ముఖ్యంగా మీ-సేవా కేంద్రాలు మరియు ఇ-పంచాయతీల సేవలకు 2 మెగాబైట్ల సామర్థ్యం గల అంతర్జాల సేవలు అవసరమవుతాయి. అలాంటి సేవలు ప్రస్తుతం చాలా పంచాయతీల్లో అందుబాటులో లేవు. కేబుల్ ఆపరేటర్లు అందించే అంతర్జాల సేవలను, వి-శాట్ సేవలు ద్వారా అలాంటి గ్రామపంచాయతీలలో సముచిత ధరలలోఅంతర్జాల సేవలు అందించే వారిని గుర్తించి వారిని అంతర్జాల సేవలు అందించంచమని కోరడమైనది.

భారతదేశాన్ని డిజిటల్ ఇండియాగా చేయటానికి ప్రధాని గారు పిలుపును ఇచ్చిన నేపథ్యంలో, రానున్న కాలంలో బ్రాడ్ బాండ్ సేవలు అన్ని పంచాయతీల్లో అందుబాటులోనికి రానున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని బ్రాడ్ బాండ్ సేవలు అందుబాటులో ఉన్న, స్త్రీ నిధి కేంద్రాలు పని చేస్తున్న పంచాయతీలను గుర్తించి వాటిలో పల్లె సమగ్ర సేవా కేంద్రాలను అక్టోబరు 2 వ తేదీన ప్రారంభించడమైనది. జిల్లాల వారిగా ప్రారంభించబడిన పల్లె సమగ్ర సేవాకేంద్రాల సంఖ్య ఈ క్రింద విధంగా ఉన్నాయి.

| | జిల్లా | పల్లె సమగ్రసేవా కేంద్రాల సంఖ్య |
|---|---|---|
| 1. | ఆదిలాబాదు | 6 |
| 2. | కరీంనగర్ | 23 |
| 3. | ఖమ్మం | 13 |
| 4. | మహబూబ్‌నగర్ | 11 |
| 5. | మెదక్ | 15 |
| 6. | నిజామాబాద్ | 10 |
| 7. | నల్గొండ | 5 |
| 8. | రంగారెడ్డి | 6 |
| 9. | వరంగల్ | 11 |
| | **మొత్తం** | **100** |

## ప్రజల ముంగిట పౌరసేవలు

పల్లె సమగ్ర సేవా కేంద్రాలు ఏర్పాటుకు తగిన వసతి ఉన్న గ్రామపంచాయతీ భవనంలోనే కేంద్రం ఏర్పాటు చేయబడుతుంది. ఒక వేల గ్రామపంచాయతీలలో తగిన వసతి అందుబాటులో లేని చోట గ్రామ పంచాయతీ గుర్తించిన ప్రైవేటు భవనాలలో ఏర్పాటు చేయబడుతుంది. స్త్రీ నిధి సహాయంతో పల్లె సమగ్ర సేవాకేంద్రాలు అందించే సేవల గురించి మరియు వాటి వ్యాపార లావాదేవీల గురించి ప్రచార బాధ్యతలు గ్రామస్థాయిలోని వ్యవస్థాపకులపై ఉంటాయి.

పల్లె సమగ్ర సేవా కేంద్రాలకు కావలసిన పరికరాలు సమకూర్చ బడతాయి. గ్రామ పంచాయతీల్లో ఉన్న కంప్యూటర్లను అవసరమైన చోట ఈ కేంద్రాలకు వాడుకోవచ్చును. ఇంకా అవసరమైన చోట పరికరాల కొనుగోలుకు స్త్రీ నిధి ద్వారా పరపతి సౌకర్యం కల్పించ బడుతుంది. పల్లె సమగ్రసేవా కేంద్రాలు అందించే సేవలకు అపారమైన అవకాశాలు ఉన్నాయి.

కేవలం పట్టణ, జిల్లా, మండల కేంద్రాలకు పరిమితమైన ఈ-సేవ, మీ-సేవ కేంద్రాల సేవలు, పల్లె సమగ్ర సేవా కేంద్రాల ఏర్పాటుతో పల్లె పల్లెకు విస్తరించబడ్డాయి.

104 కేంద్రాలలో బ్రాడ్ బ్యాండ్ ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించి పంచాయితీ కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. పల్లె సమగ్ర సేవా కేంద్రాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పంచాయితీకి ఒక ఫేస్‌బుక్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది. అంతేకాకుండా గ్రామీణ స్థాయిలో ఇంటింటికి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించి, ప్రతి పౌరున్ని డిజిటల్ అక్షరాస్యున్ని చేయాలనే సంకల్పంతో ఉంది. ఈ క్రమంలో ఇప్పటికే మన భాగ్యనగర వాసులకు వైఫై సేవలు అందించి, వివిధ కార్యక్రమాలు ప్రజలు అందుబాటులోకి తీసుకురావడం జరిగింది.

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ప్రభుత్వ శాఖల సేవలు ఒకే గొడుగు క్రిందకు తీసుకువచ్చి పౌరులకు సౌకర్యవంతమయిన సేవలు అందించడానికి పూనుకున్నది.

*- కె. యాదయ్య, సంయుక్త సంచాలకులు (పరిపాలన), టి.సిపార్డ్*



# గ్రామజ్యోతి స్ఫూర్తితో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించిన సిరిసిల్ల నియోజకవర్గం

**ఆరోగ్యమే మహాభాగ్యం. అందరికీ ఆరోగ్యం.. ఆనందం. ప్రకృతి, పర్యావరణం, పారిశుద్ధ్యం నిర్వహణకు ప్రాధాన్యత ఇచ్చి బహిరంగ మల విసర్జన లేని గ్రామాలుగా ఇంటింటికి వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణాలు చేసి మహిళల ఆత్మగౌరవానికి, అంటువ్యాధుల నివారణకు విశేష కృషి 100% ప్రగతి సాధించిన సిరిసిల్లా నియోజక వర్గం అందరికి ఆదర్శం.**

తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లాలో సిరిసిల్లా నియోజకవర్గంలో నాల్గు మండలాలు, ఒక మున్సిపాలిటి (సిరిసిల్లా)లతో 'స్వచ్ఛ సిరి సిల్లా' సాధించటానికి పిఆర్&ఆర్‌డి శాఖ మంత్రి శ్రీ రామారావు (ఎం.ఎల్.ఏ) ఆగష్టు 17న సంకల్పం చేసి 100% ఐఎస్ఎల్ నిర్మాణాలు చేశారు. పూజ్య బాపుజీ కలలను నిజం చేయటానికి తెలంగాణలో నిరంతరం కృషి చేస్తున్నారు.

*సిరిసిల్లా నియోజకవర్గంలో నీరు, పారిశుధ్య కమిటీల ద్వారా సర్వే చేసి గుర్తించిన ఐఎస్ఎల్ - పూర్తి చేయబడిన వాటి వివరాలు:*

| మండలాలు | గుర్తించిన ఐఎస్ఎల్ | పూర్తిచేయబడిన ఐఎస్ఎల్స్ |
|---|---|---|
| సిరిసిల్లా | 2834 | 2834 |
| ముస్తాబాద్ | 2485 | 2485 |
| గంభీరావుపేట్ | 3542 | 3542 |
| ఎల్లారెడ్డిపేట్ | 4441 | 4441 |
| **మొత్తం** | **13,302** | **13,302** |

సిరిసిల్లా నియోజక వర్గంలో 4 మండలలో మొత్తం గ్రామ పంచాయతీల సంఖ్య 92, మొత్తం కుటుంబాలు 72,267, గ్రామజ్యోతి సర్వేలో 58,965 కుటుంబాలకు ఐఎస్ఎల్ కల్గియున్నారు. మిగిలిన 13,302 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం (ఐఎస్ఎల్) అక్టోబర్ 2, 2015 నాటికి 100% నిర్మించి ప్రగతి పథంలో నిలిచారు.

100% వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు సాధించటానికి 'స్వచ్ఛ సిరిసిల్లా' లో చేసిన వినూత్న ప్రయోగాలు, వ్యూహాలు, ప్రణాళికలు, ప్రచార వివరాలు, పర్యవేక్షణ జరిపిన తీరు తెన్నులు ఈ క్రింది విధంగా కలవు.

మొదట నియోజక వర్గంలో నాల్గు మండలాల ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, విడబ్ల్యూఎస్‌సి సభ్యులతో సమాలోచన, సమావేశం ఏర్పాటు చేసి అందరికి అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈ సమావేశంలో బహిరంగ మలవిసర్జన లేని గ్రామాలుగా (ఓడిఎఫ్) తీర్చిదిద్దటానికి ప్రతి మండలంలో ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వ ఉద్యోగులకు, విడబ్ల్యూఎస్‌సి సభ్యులకు ఎస్‌ఈ, ఆర్‌డబ్ల్యూఎస్, జడ్‌పిపి–ట్రైనింగ్ సెల్ ద్వారా అవగాహన, ప్రతి గ్రామంలో అవగాహన, ప్రణాళిక తయారీ, కార్యాచరణ ప్రణాళిక, అమలు, పర్యవేక్షణ ప్రజల భాగస్వామ్యంతో క్షేత్రస్థాయిలో సపోర్ట్‌కు విధి విధానాలు రూపొందించారు.

గ్రామజ్యోతిలో ఏర్పాటు చేసిన విడబ్ల్యూఎస్‌సి ఛైర్మన్, కన్వీనర్ సభ్యులు భారత్ నిర్మాణ్ వాలంటీర్స్, ఐఎస్ఎల్ లేని గృహాలను ప్రత్యక్షంగా సందర్శించి వారే ఎంపిక దరఖాస్తులు స్వీకరణ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ జతపరిచి గ్రామసభలు నిర్వహించి తుది ఐఎస్ఎల్ లబ్ధిదారుల జాబితా సిద్ధపరిచి ఎస్‌ఈ, ఆర్‌డబ్ల్యూఎస్ వారికి పంపి 7 రోజుల లోపు మంజూరీ పొందటం జరిగినది.

మంజూరీ అయిన మరుగుదొడ్లు– ప్రతి గ్రామంలో కనీసం 10 మంది స్వచ్ఛదూత్‌లను ఎంపిక చేసి, దత్తత గృహాల జాబిత వారికి ఇచ్చి లబ్ధిదారులకు సాంకేతిక మెళకువలు, ప్రభుత్వం నిబంధనలు, ఆన్ జాబ్ సపోర్ట్ ఇస్తూ వేగవంతంగా ప్రగతి సాధించటానికి విశేషకృషి చేశారు.

స్వచ్ఛదూత్‌లుగా– ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి సిబ్బంది, విఒ/

ఎస్‌హెచ్‌జి లు హోదాలకు, బేషాజాలకు పోకుండా త్రికరణశుద్ధిగా నిరంతర పర్యవేక్షణ చేసి ఎవరికి ఏమి సమస్య ఉందో క్షేత్రస్థాయిలోకి వెళ్ళి సమస్యలు (ఇటుకలు, ఇసుక, సిమెంట్, మేస్త్రీలు) పరిష్కారం అయ్యే వరకు పట్టు వదలకుండా 100% నిర్మాణాలు, వినియోగం జరిగే వరకు ప్రేరణ కల్గించారు.

నిర్మాణం వేగవంతంగా సాంకేతిక మెలకువలు పాటించేలా ప్రతి మండలంలో కనీసం 20-50 మంది మిషన్ మేస్త్రీలకు శిక్షణ ఇవ్వటం జరిగింది. తక్కువ ధరలో నిర్మాణ విధానాలు, కావలసిన మెటీరీయల్ లభ్యత, వివరాలు వారికి వివరించి ధర ఒక ఐఎస్ఎల్‌కు రూ. 2000 -2800 లోపుకు నిర్మించేలా ఒప్పించటం జరిగింది. తాపీ మేస్త్రీల సంఘ బాధ్యులకు కూడా అవగాహన కల్పించి నిరుపేదలకు మరింత తక్కువ ధరకు నిర్మించేందుకు సహాయం కోరటం జరిగింది.

## ఐఎస్ఎల్ నిర్మాణ మెటీరియల్ సమకూర్పు

ప్రతి గ్రామంలో ఐఎస్ఎల్ డిమాండ్‌కు సరిపడే ఇటుకలు, సిమెంట్ బ్యాగులు, డోర్స్, పైకప్పు రేకులు, ఇసుక అనుమతులు, పోలీసు వారి సహాయం, బేషిన్, పిట్ డ్రాప్ కిట్స్ లబ్ధిదారులకు అందుబాటులో ఉంచటం జరిగింది.

చాలా గ్రామాలలో ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ వారు ఉచితంగా కనీసం 20-30 ట్రిప్పులు విరాళంగా పోశారు. చాలా గ్రామాలకు ఇటుకలు సరిపోలేదు. అనుబంధ గ్రామాలు అయిన చిన్నబోనాల, జగిత్యాల, వేములవాడ, ఇల్లంతకుంట మొదలగు మండలాల నుండి రవాణా చేయడం జరిగింది. ఒక సిరిసిల్లా మండలంలోనే సుమారు 34 లక్షల సిమెంట్ ఇటుకలు వినియోగించారు.

ప్రతి సిమెంట్‌రింగ్‌కు 270 మించకుండా కాంట్రాక్టర్స్‌ను కట్టడి చేశారు. ఐఎస్ఎల్ కిట్స్ అనిల్ ట్రేడర్స్ ద్వారా 1762.00 ఒక్క ఆర్డర్‌పై తెప్పించి కాస్ట్ కంట్రోల్ చాలా చేశారు. సిమెంట్ 225 బస్తాలు కంపిల ద్వారా తీసుకున్నారు.

ముందుగా తయారు చేసిన ప్రణాళిక ప్రకారం చక్కటి కార్యాచరణ ప్రణాళికతో నిరంతర పర్యవేక్షణ-ప్రతిరోజు గ్రామ పంచాయితీలో రివ్యూ-ప్రగతి నివేదికల పరిశీలన చేసి ఎన్ని ఐఎస్ఎల్ పూర్తి అయ్యాయి. ఐఎస్ఎల్ నిర్మాణం కాని వాటికి కారణాలు/ అంతరములు ఏమిటి/ చర్చించి అదే రోజు పరిష్కారం చేసేలా ఒక యుద్ధ వాతావరణంతో ఆన్ జాబ్ సపోర్ట్‌తో వెంట వెంటనే గ్రామస్థాయి, క్లస్టర్‌స్థాయి, నోడల్ అధికారులతో, మండల సానిటేషన్ అధికారులతో (ఎంపిడివోస్) మార్పు ఏజెంట్స్‌తో, ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్ కన్సల్‌టెంట్లు రమేష్, రాఘవులతో పాటు డిటిఎం కె. సురేందర్‌లతో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు.

ఐఎస్ఎల్ నిర్మించుకోలేని నిరుపేదలకు విడబ్ల్యూఎస్‌సిల ద్వారా ఎంఓవి అగ్రిమెంట్స్ చేసి, తీర్మానాలు చేసి -మాట ఇచ్చి 100% నిర్మాణాలు చేసి వినియోగించుకొనేటట్లు చేసి 'మాట' నిలుపుకుని అందరు గౌరవించబడ్డారు. ఆత్మ సంతృప్తి చెందిన తీరు చాలా అద్భుతం.

నిర్మించే క్రమంతో వచ్చిన సమస్యలు- ప్రజల భాగస్వామ్యంతో ప్రజాప్రతినిధులు, ఉద్యోగుల సమన్వయంతో పరిష్కరించారు.

స్థలం లేని వారికి - గ్రామంలో ప్రభుత్వ భూమి, విరాళంగా స్థలం సేకరణ చేసి కమ్యూనిటి లాట్రిన్స్ నిర్మించారు. వినియోగిస్తున్నారు.

***గ్రామాలు :*** గంభీరావుపేట, సిరిసిల్లా, తంగళ్ళపల్లి, గర్భనపల్లిలోని నిర్మించటం జరిగింది. 100% వినియోగిస్తున్నారు.

అత్యధిక నీరు నిల్వ ప్రాంతాలు-రెండు ఇంకుడు గుంతలు నిర్మించటం సాధ్యపడలేదు. ఒక మీటరుకి నీరు రావటం సమస్యగా మారింది. ఇక్కడ మిని సెప్టిక్ ట్యాంక్ నిర్మించి ఇవ్వటం జరిగింది. ఇవి ముష్టిపల్లి, లింగన్నపేట్, గోపాల్ రావుపేట్ మొదలైనవి. ఇక్కడ మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు రోజు రెండు గ్రామాలు పాదయాత్ర చేసి ప్రగతి సమీక్షలు చేశారు.

అన్నదమ్ముల మధ్య భూ తగాదాలు/ వాస్తు సమస్యలు కౌన్సిలింగ్ చేసి, అనుమానాలు నివృత్తి చేసి నిర్మించారు.

కొన్ని ఇంటిలోపల ఐఎస్ఎల్ నిర్మాణం చేసి ఆదర్శంగా నిలిచారు.

బీకోడుర్ గ్రామంలో 4 ఐఎస్ఎల్ వృద్ధులకు విడబ్ల్యూఎస్‌సి వారు బాధ్యతతో నిర్మించి ఇచ్చారు.

ఎక్కడ చేయని 'అద్భుతం' 50 మంది మేస్త్రీలు 24 గంటలలో 50 ఐఎస్ఎల్ లను 8 గ్రామాలలో సంపూర్ణంగా నిర్మించి తమ ప్రతిభ చాటారు. ***గ్రామాలు:*** 1 నామాపూర్ 2 పోతంగల్ 3 బీకోడూర్ 4.గంభీరావ్‌పేట్ 5 లింగన్నపేట 6 సూరారం 7. సముద్రలింగపూర్ 8. జిల్లెల్ల లలో ఒక పారిశుద్ధ్య ఉద్యమస్ఫూర్తి అందించారు. అనుకుంటే ఏదైనా సాధించవచ్చు అని నిరూపించారు.

## ఐఎస్ఎల్ ఓడిఎఫ్ గ్రామాలలో బిల్లుల చెల్లింపులు/ వినియోగించిన తీరు

ఓడిఎఫ్ గ్రామాలలో శాంక్షన్ అయిన ఐఎస్ఎల్ మొత్తంలో రూ.12,000 ఎంపిడివోల ద్వారా విడబ్ల్యూఎస్‌సి సంయుక్త ఖాతాకు 50% జమచేసి వాటితో మెటీరియల్ స్టాక్ పాయింట్స్ ఏర్పాటు చేసి వినియోగించారు. ఇప్పటి వరకు ప్రతిమండలానికి రూ. 1.5 చొప్పున రూ. 6 కోట్లు ఖర్చు చేయటం జరిగింది. మిగిలిన 50% నిధులకు ఎఈ.ఆర్‌డబ్ల్యూఎస్ ల ద్వారా చెల్లింపులు తుది దశలో ఉన్నాయి.

పైన పేర్కొన్న వ్యూహాలతో సిరిసిల్లా నియోజకవర్గంలో నీరు - పారిశుద్ధ్య కమిటీల ద్వారా ప్రేరణ, ప్రజా సమీకరణ, సమాచార పంపిణీ, అమలు పర్యవేక్షణ నిరంతరం చేయటం విడబ్ల్యూఎస్‌సి వారు ముఖ్యంగా అంకిత భావంతో ప్రజాప్రతినిధులు తమ విధులు, బాధ్యతలు లబ్ధిదారుల ఎంపిక నుండి నిర్మాణం పూర్తి వరకు కార్యాచరణ ప్రణాళికలు ఖచ్చితంగా అమలు చేసి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపారు.

అనతి కాలంలోనే ప్రభుత్వ ప్రోత్సాహకం, అవార్డులు, కోసం రెట్టింపు ఉత్సాహంతో కృషి చేస్తున్నారు. 'స్వచ్ఛ సిరిసిల్లా' స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలోని 8695 గ్రామాల్లో అనాగరికత వీడి ఓడిఎఫ్ గ్రామాలుగా మార్చేందుకు మన అందరం సామాజిక బాధ్యతగా, సమిష్టి కృషి చేసి పరిశుభ్ర, సంపూర్ణ పారిశుద్ధ్య తెలంగాణ రాష్ట్రానికై కృషి చేద్దాం...

# వందశాతం మరుగుదొడ్లు నిర్మించి- మహిళల ఆత్మగౌరవం పెంపొందించిన 'చిన్నబోనాల' గ్రామం- కరీంనగర్ జిల్లా

**కరీంనగర్ జిల్లా కేంద్రం నుండి 52 కి.మీ, సిరిసిల్లా మండల కేంద్రం నుండి 4 కి.మీ. దూరంలో 'చిన్న బోనాల' గ్రామం ఉంది. ఈ గ్రామానికి తూర్పున-ముష్టిపల్లి, పడమర-గుట్టలు, ఉత్తారాన-దక్షిణాన పెద్ద -బోనాల గ్రామాలు ఉన్నాయి.**




ఈ గ్రామంలో మొత్తం ఓటర్లు 1229, పురుషులు-616, స్త్రీలు 613. మొత్తం జనాభా 1969. మొత్తం నివాస గృహాలు 396, ఎస్.సి 8%, ఎస్.టి. 7% బిసి: 79% ఓసి: 6% ఉన్నారు. మహిళ స్వశక్తి సంఘాలు 37 (ఎస్‌హెచ్‌జి) సభ్యులు 427 నూరుశాతం ఎస్‌హెచ్‌జిలో ఉన్నారు. ఒక సమైఖ్య సంఘం – సరస్వతీ విఓ కలదు. శ్రమశక్తి సంఘాలు 21.

చిన్న బోనాల గ్రామసర్పంచ్ మదునాల లావణ్య. ఈ గ్రామాన్ని మహిళ ఎంపిపి శ్రీ దడికెల కమలబాయి దత్తత తీసుకున్నారు. జడ్‌పిటిసి పూరమణి మంజుల, జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ శ్రీ తుల ఉమ, జిల్లా కలెక్టర్ శ్రీ నీతూప్రసాద్, జాయింట్ కలెక్టర్ పౌసమిబసు పిడి.డిఆర్‌డిఏ-అరుణశ్రీ ఇలా మహిళ ప్రజాప్రతినిధులు మరియు మహిళ అధికారులు సమన్వయంతో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించటంలో – మహిళ ఆత్మగౌరవం పెంపుకు, సమాజ సాధికారత సాధించటానికి తీవ్రమైన కృషి చేశారు.

గ్రామజ్యోతిలో ఏర్పాటు చేసిన నీరు-పారిశుద్ధ్య కార్యాచరణ కమిటి (విడబ్లూఎస్‌సి), ద్వారా నూరు సమస్యలు పరిష్కరించి 100% వ్యక్తిగత (ఐఎస్‌సి) మరుగుదొడ్లు నిర్మించారు.

జిల్లాలోని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ కన్సల్‌టెంట్స్- రమేశ్, రాఘవులు మరియు జిల్లా ప్రజాపరిషత్ డి.టియంలు కోట. సురేందర్, సంతోష్‌లు వి.డబ్లూ.ఎస్.సి. కమిటి సభ్యులకు ప్రజాప్రతినిధులకు జిల్లా, మండల స్థాయి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.




వి.డబ్లూ.ఎస్.సి. గ్రామస్థాయిలో ఐఎస్‌ఎల్ లేని నిరుపేదలకు గ్రామజ్యోతిలో సర్వే చేశారు. పాఠశాలల్లో, అంగన్‌వాడి కేంద్రాల్లో 100% మరుగుదొడ్లు నిర్మించారు.

***ఇవికాక వి.డబ్లూ.ఎన్.సి. మరియు ఎం.పి.పి. కొన్ని ప్రత్యేక పనులు చేశారు. అవి :***

- గ్రామంలోని మహిళలను సమీకరణ చేసి, ఎస్.హెచ్‌జి, విఓ, మాతాశిశు (ఎ.డబ్ల్యూ) కమిటీతో కలిసి తల్లుల్లో మాతా శిశు ఆరోగ్యం గురించి అవగాహన కలిగించారు.
- గతంలో గ్రామంలో ఉన్న వ్యక్తిగత పారిశుద్ధ్యం (ఉదా: భోజనం ముందు, ఐ.ఎస్.ఎల్ వినియోగం తరువాత సబ్బుతో చేతులు కడుగుట, పాన్, గుట్కాలు మొదలైనవి) పై




అట్లే గృహంలో పారిశుద్ధ్యంతోపాటు వంట వ్యర్థాలు, చెత్తను రోడ్లపై వేయకుండా వర్మికంపోస్టుగా చేయటం, పేరిట కుప్పల నిర్వహణలపై అవగాహన పలుమార్లు కల్పించి వారిలో 'మార్పు' సాధించారు.

★ గతంలో ఉన్న జాప్యాలు నివారించి మరుగుదొడ్ల ప్రోత్సాహకంపై 7 రోజుల లోపు సాంక్షన్ పని పూర్తయిన 5 రోజుల్లో చెల్లింపులు చేస్తున్నారు.

★ చినబోనాలలో మొత్తం 396 మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిగా చేశారు.

★ మెటిరియల్ – సిమెంట్ రూ. 225 కి గ్రామంలో స్టాక్‌పాయింట్ పెట్టారు. సిమెంట్ రింగులు ప్రక్క గ్రామంలో తయారీ చేయిస్తూ రూ. 250 లకు రింగులపై క్యాప్ రూ. 350, చాంబర్ రూ 150, డోర్స్, బేసిన్, ఫిట్‌ట్రాప్, రేకులు సెట్ సుమారు రూ. 1762 లకు లబ్ధిదారులకు అందుబాటులోకి తెచ్చారు.

★ గ్రామంలోని ట్రాక్టర్స్ అసోసియేషన్ వారు విరాళంగా 20 ఇసుక ట్రిప్పులు తమ విరాళంగా ఇచ్చారు. యువకులు శ్రమదానం చేశారు.

★ ఈసారి మేషన్స్‌కు నైపుణ్యాల పెంపుదల–సాంకేతిక కొలతలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఒకరోజులో 1 ఐఎస్ఎల్ పూర్తి చేసేట్టు శిక్షణ ఇచ్చి ఉత్తమ ఫలితాలు రాబట్టడం జరిగింది.

★ గ్రామంలో ప్రతిరోజు మన తల్లులు, అక్క చెల్లెలు– బహిరంగ మల విసర్జనకు దారిన వెళ్ళినపుడు సిగ్గుతో రోజు చచ్చిపోతున్నారు.. కాలేజి అమ్మాయిల హస్టల్ నుండి గ్రామానికి వస్తే అవమానంతో కృంగిపోతున్నారు వికలాంగులు, గర్భిణీలు ఎంతో నరకం అనుభవిస్తున్నారు. ప్రత్యక్ష అనుభవాలు తెల్పి వారిలో 'మార్పు"లకు శ్రీకారం చుట్టారు.

★ ఈ గ్రామంలో రోల్‌మోడల్‌గా నిలిచి యుద్ధంలో మరణించిన అమర జవాన్ శ్రీ కెప్టెన్ విజయ రఘునందన్ రావు గారి సామాజిక సేవా దృక్పథం, (ఉదా: గ్రామంలో మొదట విద్యుత్ వెలుగులు నింపి, గ్రామంలో యువతలో చైతన్యం నింపారు.) స్ఫూర్తితో ముందుకు వెళ్ళటం జరుగుతోంది.

★ బహిరంగ మల విసర్జన నిర్మూలన దిశగా (ఓడిఎఫ్) వున్న గ్రామమైనందున 50% సాంక్షన్ అయిన ఐఎస్ఎల్ కు ముందుగా నిధులు వారి అకౌంట్‌లో జమచేసి మరింత ప్రోత్సాహం అందిస్తున్నారు.

★ కొంతమంది వాస్తు నిపుణుల సహకారంతో మరుగుదొడ్డి నిర్మాణంపై ఉన్న అపోహలను తొలగించారు.

ఉదాహరణకు :

**మరుగుదొడ్డి నిర్మాణం–వాస్తు:**

- పొయ్యిలో గుంతలు పడరాదు.
- ఈశాన్య మూలలో ఐఎస్ఎల్ యుండరాదు.
- దర్వాజలో ఐఎస్ఎల్ పడరాదు.
- చేతిబావిలో పడరాదు.
- ఎనకర్రలో గుంటలు రాకూడదు.



ఇవి ప్రజలకు వివరిస్తూ వారిలో నమ్మకం కల్గిస్తూ 100 రోజుల్లో నిర్మాణం పూర్తి చేయగలిగారు.

★ ప్రతిరోజు మార్పు అధికారులు, వి.డబ్ల్యు.ఎస్.సి., స్వచ్ఛధూత్, ప్రత్యేకంగా మహిళ ప్రతినిధులు– ప్రేరణ కల్గిస్తూ, మెటిరియల్ అందిస్తూ, రింగులు, ఇటుకలు, లోకల్‌గా తయారీకి చేయూతనందిస్తూ, అసలు కట్టుకోలేని అనాథలు అయిన సందేవేని రాజవ్వ (సింగిల్ ఉమన్) టెడ్లె. ఎల్లయ్య (నిస్సహాయ పిఓపి) లకు వి.డబ్ల్యు.ఎస్.సి. పూర్తి చేయూత నందించి ఐఎస్ఎల్ నిర్మించి వినియోగించుకోనేలా చేసి మానవత్వం చాటినారు.

★ గ్రామంలో 100% ఇంటి పన్నులు వసూలు, 12000 మొక్కలు నాటి హరితహారంగా మార్చుతున్నారు.

★ 100% బడిలో పిల్లల నమోదు చేశారు. ఐఎస్ఎల్ సౌకర్యాలు కల్పించారు. రోగనిరోధక టీకాలు క్రమం తప్పక వేయిస్తున్నారు. ఆసుపత్రిలోనే డెవలివరీలను పాటిస్తున్నారు.

★ అంగన్‌వాడి, సాక్షరభారత్ సేవలు, గురుకుల పాఠశాలలో సంపూర్ణంగా, సేవలు అందిస్తున్నారు.

★ భూగర్భ జలాల పెంపునకు ఫామ్‌పౌండ్స్–8, చెక్‌డ్యామ్స్–6, నిర్మించారు. ఇంకుడు గుంతలు గ్రామపంచాయితీ కార్యాలయంలో

ప్రారంభించారు. ఇంటి-ఇంటికి పెత్రిరామవాస్య వరకు పూర్తి చేయటానికి కార్యాచరణ ప్రణాళికతో రెడీగా ఉన్నారు.

- ఎంపిపి శ్రీ కమలబాయి గారి పర్యవేక్షణలో... ఘన, ద్రవ వ్యర్థాలను డంప్‌యార్డ్‌కు లేదా వర్మికంపోస్ట్‌కు పంపిస్తున్నారు.
- బోర్‌వెల్స్ చుట్టూ, ఓహెచ్‌ఎస్‌ఆర్, చుట్టూ పరిశుభ్రత పాటిస్తూ, నల్లా లీకేజీలు లేకుండా మహిళలు తమ ఇళ్ళల్లో ఎలా ఉంచుతారో అంత పరిశుభ్రత నిర్వహిస్తున్నారు. ఈ గ్రామంలో ప్రజల భాగస్వామ్యంతోపాటు అధికారులు హోదాలకు, భేషాలకు పోకుండా అక్క, చెళ్ళెలుగా, అన్న, తమ్ముళ్లుగా సమన్వయంతో సమిష్టి కృషితో అనేక సమస్యలు అధిగమిస్తున్నారు.
- ఉపన్యాసాలు, లేవు ఆత్మవంచనలేదు, నిజాయితీగా ఓడిఎఫ్ గ్రామంగా చేయాలని ప్రతిజ్ఞ చేశారు. సాధించారు. రోగాలు తగ్గాయి. ఆదాయం, గౌరవం పెరిగాయి.

స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ్)లో స్వచ్ఛమైన మనస్సుతో త్రికరణ శుద్ధిగా, తెలంగాణలోని తల్లుల ఆత్మగౌరవం పెంచటానికి గ్రామజ్యోతిలో ఏర్పడిన వి.డబ్ల్యు.ఎస్.సి. లు ప్రజల భాగస్వామ్యంలో అందరి సమన్వయంతో 9 జిల్లాల్లోని 438 మండలాలు, 8695 గ్రామాలలో అంకితభావంతో చేస్తూ ప్రజాప్రతినిధులు దత్తత తీసుకున్న గ్రామాలు 2564 (టిఎస్) అలాగే వివిధ శాఖలు అధికారులు 1030 (టిస్), ప్రత్యేకంగా ఈసారి పోలీసు ఆఫీసర్లు 540 (టిస్) మొత్తం తెలంగాణాలో 5,218 గ్రామాలలో బతుకమ్మ పండగనాటికి ఓడిఎఫ్ గ్రామాలు, 2016 రాబోయే పెద్ద బతుకమ్మ వరకు సంపూర్ణ పారిశుధ్యం సాధించాలని ఆకాంక్షిస్తూ...

బాపూజీ కలలను నిజం చేద్దాం... బహిరంగ మల విసర్జన అనే అనాగరికత వీడి ఆరోగ్యవంతమైన, పరిశుభ్ర తెలంగాణా నిర్మాణంలో ప్రతి ఒక్కరం భాగస్వాములై.. బంగారు తెలంగాణ సాధిద్ధాం... తెలంగాణ తల్లుల- మహిళల ఋణం తీర్చుకుందాం.

# ఇంటింటికీ-ఇంకుడు గుంతలు - మాదాపూర్-కరీంనగర్ జిల్లా



**తెలంగాణ రాష్ట్రంలో వర్షపునీరు, బావులు, చేతిపంపులు, బోరు బావులు-ప్రధాన జలవనరులు. అయితే ప్రస్తుతం వెతికి భూగర్భజలం మట్టాన్ని పెంచే ప్రయత్నంలో భాగంగా ఇంటింటికి ఇంకుడు గుంతలు 10% నిర్మించి ప్రజల 'దాహం' తీర్చుతున్న గ్రామం - మాదాపూర్ కరీంనగర్ జిల్లాలో ఉంది.**

కరీంనగర్ నుండి హైద్రాబాద్‌కు వెళ్ళే దారిలో బెజ్జంకి మండలానికి 25 కి.మీ దూరంలో ఉన్న ఒక మారుమూల గ్రామం. మాదాపూర్ గ్రామంలో 264 కుటుంబాలు, 1256 జనాభా. పురుషులు 568 స్త్రీలు: 688, ఎస్.సి. 36%, బి.సి. 34% ఓ.సి. 30% ఉన్న గ్రామం.

వర్షాలు లేక ఉపరితల జలవనరులు (వాగులు, చెరువులు, కుంటలు) ఎండిపోయి వ్యవసాయానికి బావులు, బోర్‌బావులు వినియోగించటం చేత భూగర్భజలాలు అడుగంటి పోయాయి.

త్రాగునీటి సమస్య తీవ్రమయింది. ఈ సమస్యల పరిష్కారానికి 'గ్రామజ్యోతి' కార్యక్రమంలో గ్రామసభలో సమాలోచన చేసి, సమగ్రమైన చర్చలు జరిపి ప్రజల భాగస్వామ్యంతో, ప్రజాప్రతినిధుల, ప్రభుత్వ ఉద్యోగుల అందరి సమిష్టి భాగస్వామ్యం-సమన్వయంతో ఈ క్రింది అంశాలకు ప్రాధాన్యత గుర్తించి చక్కటి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అమలు పరచి, ప్రజల అవసరాలు తీర్చి ఆదర్శంగా నిలిచారు.

### గ్రామసభలో గుర్తించిన ప్రాధాన్యతలలో కొన్ని:

1. అందరికీ త్రాగునీరు–పారిశుధ్యం.
2. ప్రతి ఇంటికి కనీసం 5 నుండి 10 మొక్కలు నాటాలి.
3. 100% మరుగుదొడ్ల నిర్మాణం.
4. ప్రతి పిల్లవాడిని బడిలో చేర్పించటం.
5. నిరుపేదల జీవనోపాధులు పెంపుదల.
6. ప్రభుత్వ పథకాలపై అవగాహన– అర్హులకు అందేలా చర్యలు.
7. స్థానిక వనరులు గరిష్ఠస్థాయిలో వినియోగం............

గ్రామజ్యోతిలో ఏర్పడిన అన్ని కమిటీల సమన్వయంతో సమస్యల కారణాలు పరిష్కార మార్గాలు చర్చ. ఎం.ఎల్.ఏ శ్రీ రసమయి బాల కిషన్, ఎం.పి.టి.సి తన్నీరు శరత్ రావు, ఎం.పి.పి. శ్రీ వి. దామోదర్, గ్రామసర్పంచ్ శ్రీ మాదుగుల రవీందర్‌రెడ్డి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఇతర గ్రామ పెద్దలు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఈ క్రింది చర్యలను చేపట్టారు.

### సాధించిన 100% ప్రగతి వివరాలు

- ✯ వర్షాల కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం మండలంలోనే మొదటి స్థానంలో 32000 మొక్కలు నాటారు. వాటికి ట్రిగార్డులు ఏర్పాటు చేశారు.
- ✯ భూగర్భజలాలు పెంచుకోవటానికి గృహ అవసరాలకు వినియోగించిన నీటిని ఇంటింటికి ఇంకుడు గుంతలు ప్రతి ఇంటికీ అంటే 264 ఇళ్ళల్లో నిర్మించారు. ప్రజల త్రాగునీరు 'దాహం' తీర్చారు.
- ✯ ప్రతి ఇంటిలో తమ తల్లుల, అక్క–చెల్లెళ్ల ఆత్మగౌరవ కాపాడటానికి 250 వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించి మిగిలిన 14 శాంక్షన్‌కు పంపి సద్దుల బతుకమ్మ నాటికి పూర్తిగా నిర్మించటానికి నిరంతర కృషి చేస్తున్నారు.
- ✯ గ్రామాభివృద్ధి– అందరి బాధ్యతగా స్వీకరించి 99% ఇంటిపన్నులు వసూలు చేశారు.






- ✯ గ్రామంలో బ్యాంకు ఋణాలు, స్వశక్తి, గ్రామైఖ్య సంఘాల ద్వారా అందరూ ఋణాలు తీసుకోవటం, ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలతో వంతులవారీగా 100% ఋణాలు చెల్లిస్తున్నారు.
- ✯ ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు, నిర్వహిస్తున్నారు. గ్రామసభల ద్వారా అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటున్నారు.
- ✯ మానవవనరులు–ముఖ్యంగా యువత, యువజన సంఘాలు (3) పెడత్రోవ పట్టకుండా సామాజిక బాధ్యతగా ప్రతి కార్యక్రమంలో తమ–తమ విశ్రాంతి సమయం కేటాయిస్తున్నారు.
- ✯ ప్రకృతి వనరులు–భూమి–నీరు–గుట్టలు, అడవులపై, వ్యవసాయ హర్టికల్చర్, శాఖల ద్వారా అభివృద్ధి, జీవనోపాధుల ప్రణాళికలు తయారీ చేస్తున్నారు.

### ఇంకుడు గుంతల నిర్మాణం క్రింది విధంగా...

గ్రామీణ ఉపాధి హామీ పథకం–4 వేల ప్రోత్సాహంతో ప్రతి ఇంటి ఆవరణలో 6 అడుగుల లోతు, 5 అడుగుల వెడల్పుతో గుంత తీస్తారు. ఇందులో 3 అడుగుల వరకు దొడ్డుకంకర (60ఎం.ఎం.) దాని సన్నకంకరలతో మధ్యలో 'సిమెంట్ గోళం' పెట్టి నాలుగువైపుల నాలుగు రంధ్రాలు చేస్తారు. చుట్టూ 40ఎంఎం కంకరతో పోస్తారు. గోలంపై మూత ఏర్పాటు చేసి గుంతను పూడ్చివేశారు. ఇంటిలో వినియోగించిన వృథానీటిని పైపుల ద్వారా ఒక 'చిన్న చాంబర్' కు కలిపి అక్కడి నుండి గోలంలోకి పైపుల ద్వారా పంపి గోళం రంధ్రాల నుండి భూగర్భంలోకి పంపి భూగర్భజలాలు పెంచుకుంటున్నారు. మురుగునీరు నిల్వలు లేక ఒక్క దోమ కూడా లేకుండా ఆరోగ్యంగా ఉంటున్నారు.

తెలంగాణలోని ప్రతి గ్రామం ప్రజల భాగస్వామ్యంతో అన్ని పంచాయతీ కమిటీల సమన్వయంతో అవసరాలు గుర్తించి గ్రామసభలో అక్కడే పరిష్కారాలు మార్పులు చర్చించి ఎవరికి ఏ ఏ బాధ్యతలు అప్పగించాలో అప్పగించి 'త్రికరణ శుద్ధిగా' బాధ్యతతో పనిచేస్తే ప్రతిగ్రామంలో గ్రామజ్యోతి వెలిగి... ప్రజలందరి ముఖాల్లో 'చిరునవ్వుల కాంతులు' వెలిగి 'బంగారు తెలంగాణ' అనతి కాలంలోనే కావాలని ఆశిస్తాం....

**– కోట సురేందర్,** *డి.టి.ఎం., కరీంనగర్*

# గ్రామజ్యోతి ద్వారా మరో ఆదర్శ గ్రామ పంచాయితీ – కొండన్నపల్లి

**70 వసంతాల భారత దేశంలో ఒకనాటి స్వాతంత్ర్య సమరసేనుల త్యాగఫలం, పల్లెసీమలు ప్రజాస్వామ్య ప్రగతి ఫలాలు పుణికి పుచ్చుకోవడానికి ఎందుకింత ఆంతర్యం. ప్రపంచ దేశాల్లోనే గొప్ప ప్రజాస్వామ్యంగా ప్రజర్విల్లుతున్న భారతదేశంలో ప్రజల భాగస్వామ్యం కొరవడుతుందా? ఈ ప్రశ్నకు సమాధానమే సమిష్టి అభివృద్ధికి ప్రజల భాగస్వాములను చేసే ఒక బహుళ ప్రయోజన కార్యక్రమంగా గ్రామజ్యోతి అవతరణ.**

తెలంగాణా ప్రభుత్వము అత్యంత ప్రతిష్టాత్మకంగా గ్రామజ్యోతి కార్యక్రమాన్ని రూపొందించినది. గ్రామ రూపు రేఖలను సంపూర్ణంగా మార్చివేసి ప్రగతి ఫలాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల చెంతకు చేర్చనున్నది. పల్లె ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచి, ఆర్థిక అసమానతలను రూపుమాపి అభివృద్ధి మార్గంలో పయనించి బంగారు పల్లెలుగా తీర్చిదిద్దటానికి ప్రభుత్వం కంకణబద్దులై సమిష్టి కృషికి మరోపేరుగా గ్రామజ్యోతి కార్యక్రమాన్ని ముందుకు తెచ్చింది.

ఆగస్టు 13న కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో 'గ్రామ జ్యోతి కార్యక్రమం– అవగాహన సదస్సు' నిర్వహించడం జరిగింది. నియోజకవర్గ స్థాయిలో ఉన్న ఆరు మండలాల అధికారుల నోడల్ ఆఫీసర్లు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలలో హాజరైన గ్రామాల ప్రజలకు, ప్రత్యేక అధికారియైన వై.వి. గణేష్, పథక సంచాలకులు, జిల్లా నీటి నిర్వహణ సంస్థ, కరీంనగర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తూ బంగారు తెలంగాణను ముద్దాడాలంటే పల్లె ప్రతీ కుటుంబ సభ్యులు విద్యా, వైద్య, ఆర్థిక అభిరుచి, శక్తి సామర్థ్యం, అంకిత భావం అత్యంత కీలక భూమిక పోషిస్తున్నది.

ప్రతీ ఒక్కరూ పుణ్య భూమికి రుణపడి తన వంతు కృషిగా భాగస్వాములు అయి సంపూర్ణ గ్రామాల అభివృద్ధికి 7 కమిటీలు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.

చొప్పదండి శాసన సభ్యులు శ్రీమతి బొడిగ శోభక్క మాట్లాడుతూ, వార్డు మెంబర్లు, సర్పంచ్‌లు, యం.పి.టి.సి.లు, యం.పి.పి.లు, మండల స్థాయి ప్రజా ప్రతినిధులకు కార్యక్రమంపై దిశా నిర్దేశం మరియు ప్రభుత్వ మార్గదర్శకాలను వివరించారు. ప్రతీ గ్రామం ఒక ఆదర్శ గ్రామ పంచాయితీగా అభివృద్ధి చెందాలన్నారు.

కరీంనగర్ నుండి ఉత్తరం వైపుకు 20 కిలోమీటర్ల దూరంలో కొండన్నపల్లి గ్రామం ఉంది. ఇది ఒక్కప్పటి తెలంగాణ సాహిత్యానికి ఆలవాలంగా ఉండాలి. చారిత్రక విహారయాత్ర స్థలం కూడా.

ప్రస్తుతం ఈ స్థలం బొమ్మలమ్మ గుట్టగా ప్రసిద్ధిగాంచినది. ఈ గ్రామ పంచాయితీ న్యాలకొండపల్లి మధిరతో కలిసి మొత్తం జనాభా 1118 ఉంటుంది.

ఆగస్టు 17న గ్రామ పంచాయితీ కార్యాలయంలో 7 కమిటీలు 7 దీపాలు వెలిగించగా సర్పంచ్ శ్రీమతి ఉప్పల అంజలి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ పంచాయితీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని 7 కమిటీ సభ్యులతో కలిసి "మాకు మేము



గ్రామాభివృద్ధిలో కంకణ బద్ధులమై పాల్గొని అత్యంత ఆత్మ విశ్వాసంతో, చిత్తశుద్ధితో సంక్షేమ మరియు అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పిస్తూ వాటిని మేం సద్వినియోగం చేసుకుంటా"మని ప్రతిజ్ఞ చేసి ముందడుగు వేశారు.

గ్రామ ప్రజలు అనుకున్నట్లుగా సంపూర్ణ పారిశుద్ధ్యంపై నడుం బిగించి బహిరంగ మల విసర్జనను అరికట్టడానికి ప్రతినబూనారు. ముందుగా వ్యక్తిగత మరుగుదొడ్లు లేని కుటుంబాలను (54) గుర్తించి వారిని ఐ.హెచ్.హెచ్.ఎల్. నిర్మించుకొని ఉపయోగించే విధంగా అవగాహన కల్పించాలి.

విచ్చలవిడిగా బహిరంగ మల విసర్జన చేసిన, వాడల్లో రోడ్లపైన చెత్తా చెదారం, తినుబండారాలు, కుళ్ళిపోయిన కూరగాయలు పడేసిన మరియు మంచినీటి వనరులను, వసతులను అపరిశుభ్రం చేసినా వారి పై రూ. 250 జరిమాన విధిస్తూ ఒక సాహసోపేతమైన నిర్ణయానికి ప్రజలు పూనుకున్నారు. మురుగు నీటి కాలువలలోని మట్టిని, చెత్త, ఇతర కుళ్ళిపోయిన వస్తువులను ఉపాధి హామీ ద్వారా నిర్మించిన డంప్‌యార్డ్‌కు తరలించే విధంగా ఒక ఆరోగ్యకరమైన వాతావరణంలో నివసించడానికి ముందుకు సాగుతున్నారు.

నూటికి నూరు శాతం లిక్కరును గ్రామ ప్రజలు బహిష్కరించినారు, 100% పన్నులు వసూలు చేసుకుంటున్నారు. బడి ఈడు పిల్లలను 100% బడిలో చేర్పించారు. కుటుంబ నియంత్రణను పాటిస్తున్నారు.

అంతేకాకుండా, మేము సైతం ఆదర్శ గ్రామ పంచాయితీగా తీర్చి దిద్దడంలో ముందు వరుసలో మా కొండన్నపల్లి గ్రామ ప్రజలు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగుతారని సర్పంచ్ శ్రీమతి ఉప్పల అంజలి అన్నారు.

## కొన్ని సామాజిక భద్రత మరియు పేదరిక నిర్మూలన కార్యక్రమాలు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కొండన్నపల్లి గ్రామ పంచాయితీలో 288 కుటుంబాలు ఉపాధికార్డులు గ్రామ పంచాయితీ సెక్రటరీ మామిడిపెల్లి మదునమయ్య ద్వారా పొందారు.

2006 నుండి 2015 ఆగస్టు వరకు 10.00 లక్షల రూపాయల సామాగ్రి కొనుగోలు రూపంలో చెల్లింపులు జరుపబడినవి. ఇది వారి శ్రామిక శక్తికి ప్రతిఫలం. సాంకేతిక సహాయకులు చంద్రమౌళి, క్షేత్ర సహాయకులు మల్లేశం సమన్వయ సహకారంతో అభివృద్ధి పనులు మరియు సకాలంలో కూలీల వేతన చెల్లింపులు జరుపబడినవి.

మహిళా సాధికారతను ఆర్థిక పరిపక్వతను ప్రోత్సహించడానికి ప్రభుత్వం 2014-15, 2015-16 కు 55.00 లక్షల రూపాయలు 24 పొదుపు సంఘాలకు ఆర్థిక రుణాలను ప్రభుత్వం మంజూరు జరుగుతుంది.



మిషన్ కాకతీయ కార్యక్రమం ద్వారా మొదటి దశలో ఉడుమన్ చెరువు పనులు చేపట్టడం జరిగింది. దీని ఆయకట్టు విస్తీర్ణం 67.21 ఎకరాలు. అంచనా విలువ 52.90 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసింది. మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు పూర్తిగా వినియోగించుకొని సాగునీటి సామర్థ్యాన్ని పెంచుకునే విధంగా రైతులు భాగస్తులవుతున్నారు.

హరితహారం కార్యక్రమంలో 32,000 మొక్కలు నాటటానికి గ్రామ ప్రజలు ముందుకు వచ్చారు. అవి రైతులకు టేకు మొక్కలు, రోడ్డుకు ఇరువైపుల మొక్కలు, ఇంటి స్థలాలలో మరియు కమ్యూనిటీ స్థలాలలో, ప్రభుత్వ సంస్థలలో పంపిణీ చేయడం మరియు నాటుకోవడం జరిగింది.


ఈ గ్రామంలో 1400 ఎకరాలు సాగుకు యోగ్యమైన భూ విస్తీర్ణం ఉంది. 80% పైగా వర్షాధార మరియు బావుల ద్వారా సాగు చేయడం జరిగింది. 500 ఎకరాలు వరిపంట, 400 ఎకరాలు ప్రత్తి పంట, 110 ఎకరాలు తోటల పెంపకం మరియు మిగతా భూమి ఆరుతడి పంటలు పండిస్తున్నారు. శాస్త్రీయ పద్ధతులు అవలంభించకపోవడం, రైతులకు అవగాహన సమాచారం లేకపోవడం మరియు సాగునీటి సౌకర్యం లేకపోవడం గ్రామ సభ ద్వారా తీర్మానించడం జరిగింది.

7 కమిటీలు గ్రామాభివృద్ధి కోసం గుర్తించిన నూతన పనుల ప్రతిపాదనలు రాబోయే 5 సంవత్సరాలకు గ్రామసభ ద్వారా ఏకగ్రీవ తీర్మానం చేసి ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేశారు.

ఒక వ్యక్తితో, ఒక కుటుంబంతో మొదలుకొని రాష్ట్రమైనా, దేశమైనా అభివృద్ధి చెందాలంటే వైద్యా-విద్యా; త్రాగు - సాగు నీరు వంటి మౌలిక వసతుల కల్పన, శ్రామిక శక్తిని వినియోగించుకొని ప్రాథమిక, ద్వితీయ, తృతీయ రంగాలలో ఆర్థికాభివృద్ధి సాధించాలంటే పొదుపు, మూలధనం, పెట్టుబడులు అత్యంత భూమిక పోషిస్తాయి.

తక్కువ వనరులు ఉండి శ్రామిక శక్తికి నైపుణ్యం తోడై సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచ దేశాలను శాసిస్తున్న జపాన్, స్విట్జర్లాండ్, ఇంగ్లాండ్ దేశాలు సుస్థిరత అభివృద్ధిని సాధించడం జరిగింది. కఠోర శ్రమ, అంకితభావంతో భాగస్వాములు అయినప్పుడు మల్లె తీగలవలె అల్లుకున్న పల్లెలై బంగారు తెలంగాణ దిశగా పయనిస్తాయని ఆశిద్దాం.

*- శ్రీనివాస్ దుర్గం* ఏ.పి.ఓ, కరీంనగర్



# గ్రామజ్యోతి స్ఫూర్తితో ఆదర్శ గ్రామంగా అడుగులువేస్తున్న 'మన్మధ్' గ్రామం

**పల్లె పల్లెలో సుఖ:సంతోషాలు వెల్లివిరిసేలా ఉండాలని తెలంగాణ ప్రభుత్వం పటిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'గ్రామజ్యోతి' కార్యక్రమం ద్వారా దేశానికి వెన్నముక లాంటి గ్రామాలలో ప్రతి మనిషికి కూడు, గూడు, గుడ్డ, నీరు, విద్యా, వైద్యం, ఆరోగ్యం, పౌష్టికాహారం, వ్యక్తిగత సామాజిక పరిశుభ్రత, జీవనోపాదుల మెరుగులదల మొదలైన అనేక అంశాల పై అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు అందరు మమేకమై గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేస్తూ, ప్రతి పల్లెలో అభివృద్ధి అనే వెలుగులు విరజిమ్మి గ్రామజ్యోతి కార్యక్రమం ద్వారా ఆదిలాబాద్ జిల్లా లోకేశ్వరం మండలం మన్మధ్ గ్రామ పంచాయితీ జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా రూపుదిద్దుకునే దిశగ వడివడిగా అడుగులేస్తున్న పల్లెసీమ.**

గ్రామ సర్పంచ్ శ్రీమతి గొడిసెర్ల వజ్ర సర్పంచ్‌గా ఎన్నికైన తరువాత ఉత్సాహంగా వార్డు సభ్యులు, గ్రామ ప్రజలతో కలిసి ముందస్తుగా గ్రామంలోని సమస్యలను తెలుసుకొని, గ్రామ సభలు నిర్వహించి గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలు మౌళిక సదుపాయాలపై దృష్టి 100% పన్ను వసూలు చేసి, జిల్లాలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భముగా ఉత్తమ సర్పంచ్‌గా ప్రభుత్వం నుండి ప్రశంసలు అందుకున్నారు. ఈ క్రింది లక్ష్యాలతో పనిచేస్తున్నారు.

1) వీధి దీపాలు లేనిచోట వెనువెంటనే అమర్చడం.

2) ఇంటింటికి నల్లాల ద్వారా త్రాగు నీటి సరఫరా.

3) అంతర్గత రోడ్డు మరమ్మత్తులు.

4) మురికి కాలువల పూడికతీత మొదలగు ప్రధాన సమస్యలను అధిగమించారు.

ప్రభుత్వం చేపట్టిన గ్రామజ్యోతి కార్యక్రమం ద్వారా గ్రామంలో మిగిలి ఉన్న అనేక సమస్యలకు పరిష్కార మార్గాలు కనబడుతున్నాయి. గ్రామజ్యోతి కార్యాచరణ కమిటీలు గ్రామ ప్రజలందరినీ భాగస్వాముల ను చేస్తూ ప్రజలందరికి మెరుగైన జీవనప్రమాణాలను అందించే దిశగా శాఖల సహకారంతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అన్ని విషయాలలో ప్రణాళికాబద్ధంగా ప్రణాళికలు రూపొందించి జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా ఎదగాలని ఆకాంక్షిస్తూ వారు గ్రామజ్యోతి కార్యక్రమం సందర్భంగా కమిటీల వారీగా ఇప్పటి వరకు చేసిన కార్యక్రమాలు ఇలా ఉన్నాయి.

**1) త్రాగునీరు, పారిశుద్ధ్యం కార్యాచరణ కమిటీ** :

ఛైర్మన్ – వజ్ర శంకర్ గౌడ్, గ్రామ సర్పంచ్

కన్వీనర్ – ఎం. సత్యనారాయణ, వి.ఆర్.ఓ.

సభ్యులు : గురువయ్య, లావణ్య, పోతన్న, వట్ల విఠల్, కె. భోజన్న

*ఈ కమిటీ చేబట్టిన కార్యక్రమాలు*

- బహిరంగా మల విసర్జన ద్వారా వచ్చే వ్యాధుల గురించి సంబంధిత అధికారుల ద్వారా ప్రజలను చైతన్య పరిచి మరుగుదొడ్ల నిర్మాణం 100% శాతం పూర్తి చేయడం జరిగింది.
- రోడ్ల మీద చెత్తను తీసివేసి, 104 చెత్త కుండీలను ఏర్పాటు చేసి, ట్రాక్టర్ ద్వారా బయట డంప్ చేయడం జరుగుతోంది.
- మురికి కాలువలను శుభ్ర పరిచడం జరుగుతోంది.
- గ్రామంలోని చట్టు ప్రక్కల గల పిచ్చి మొక్కలను తీసివేసి, పరి శుభ్రంగా ఉంచడం జరుగుతోంది.
- గ్రామంలో 12 మిని ట్యాంకులు, 2 ఓ.ఆర్.హెచ్. ట్యాంకుల నుండి త్రాగు నీరు ప్రతి ఇంటికి నల్లాల ద్వారా అందిస్తున్నారు.
- ప్రతి వారం క్లోరినేషన్ చేయడం జరుగుతోంది.
- ఈ కార్యాచరణ కమిటీ సభ్యులు, యువజన సంఘాలు, రైతులు అందరు కలిసి మహారాష్ట్రలోని టింబర్ని గ్రామపంచాయితీ వాటర్ షెడ్ కార్యక్రమాలను ఏ అమలు పరుస్తున్నారో క్షేత్రసందర్శనకు వెళ్ళడం జరిగింది.
- 100% ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకుంటామని నిర్ణయించుకున్నారు.

**2) ఆరోగ్యము, పోషణ కార్యాచరణ కమిటీ :**

ఛైర్మన్ – బి. గోదావరి, వార్డు మెంబర్

కన్వీనర్ – వెల్మల్ సరోజ, ఎ.ఎన్.ఎం.

సభ్యులు – కొత్తూర్ పద్మా, జి. గంగామణి, జి. శ్రీలత, బి. అనిత, ఎం. గంగవ్వ

*ఈ కమిటీ చేబట్టిన కార్యక్రమాలు*

- గ్రామంలో 3 అంగన్‌వాడీలు మరియు ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రం సహకారంతో గ్రామంలో గర్భిణులు, బాలింతలు, 0 నుండి 6 సంవత్సరాల బాల, బాలికలకు పౌష్టికాహారం అందిస్తున్నారు.
- వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తున్నారు.
- ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా అర్హులైన వారికి శస్త్ర చికిత్సలు చేసి కళ్ళజోళ్ళు ఇవ్వడం జరుగుతుంది.
- ప్రతి ఒక మహిళ ఆసుపత్రిలోనే ప్రసవం జరిగేటట్లు తల్లీ, బిడ్డల సంక్షేమానికి కృషి చేస్తున్నారు.
- బాలికల చదువు మరియు వయోజన విద్య, బాల్య వివాహాలు లేకుండా, బాల కార్మికులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

**3) విద్యా కార్యాచరణ కమిటీ :**

ఛైర్మన్ – బి. భోజన్న, వార్డు మెంబర్

కన్వీనర్ – ఆర్. సంటెన్న, హెచ్.ఎం.

సభ్యులు– స్వప్న, సుష్మిత, మల్కా రెడ్డి, డి. గంగాధర్, ఎస్. రాములు

*ఈ కమిటీ చేసిన కార్యక్రమాలు*

- అందరు విద్యా కమిటీ సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రతి నెలా సమావేశం నిర్వహిస్తారు.
- విద్యార్థులు గైర్హాజరు కాకుండా చూడడం.
- బాల కార్మికులచే పని చేయించటం నిలిపివేత.
- మధ్యాహ్న భోజన పర్యవేక్షణ.
- మొత్తం గ్రామంలో ప్రాథమిక పాఠశాల, సెకండరీ పాఠశాలు ఉన్నాయి. మొత్తం విద్యార్థులు బాలురు 181, బాలికలు 230 కలరు.
- ఆట స్థలం, మరుగుదొడ్డు, హరితహారం ద్వారా మొక్కలు నాటారు.
- పాఠశాలలో విద్యార్థులు కూడా కార్యచరణ కమిటీలు ఏర్పరుచుకున్నారు

  1) పరిశుభ్రత కమిటి
  2) గ్రంథాలయ కమిటీ
  3) క్రీడల కమిటీ
  4) ప్రజాపరిపాలన కమిటి
  5) విద్యార్థులకు రాజ్యాంగం, ప్రజా ప్రతినిధుల ఎన్నిక, నాయకత్వ లక్షణాలు, మొదలైన విషయాలపై అవగాహన కొరకు ఏర్పాటు చేయడం జరిగింది.
  6) సాక్షర భారత్ వాలంటీర్ల ద్వారా వయోజనులకు 100% అక్షరాస్యత కార్యక్రమం.
  7) పాఠశాలల యందు స్వచ్ఛమైన త్రాగునీటి వాటర్ ప్లాంట్స్ ఉన్నాయి.

**4) సామాజిక భద్రత, పేదరిక నిర్మూలన కార్యాచరణ కమిటీ :**

ఛైర్మన్ – కె. రాజవ్వ, వార్డు మెంబర్

కన్వీనర్ – సంగీత, ఐ.కె.పి., సి.సి.

సభ్యులు – ఎం. రుక్మవ్వ, కె. విజయ, ఎస్. చిన్నక్క, బి. సాయన్న, డి. మిర్యాల

*ఈ కమిటీ చేసిన కార్యక్రమాలు*



- అర్హులైన మహిళలందరికి స్వయం సహాయక సంఘాలలో చేర్పించడం.
- వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ఋణాలు ఇప్పించడం.
- యువతకు ఉపాధి శిక్షణ కల్పించడానికి అర్హులైన వారిని గుర్తించడం.
- అర్హులైన వారందరికి పింఛను, రేషన్ కార్డులు ఇప్పించడం.

**5) సహజ వనరుల కార్యాచరణ కమిటీ :**

ఛైర్మన్ – వజ్ర శంకర్ గౌడ్, గ్రామ సర్పంచ్

కన్వీనర్ – ఎం. సత్యనారాయణ, వి.ఆర్.ఓ.

సభ్యులు – కె. భోజన్న, ఎస్. బుచ్చవ్వ, మల్లేష్, టి. సాయన్న, ఎం. సాయన్న

*ఈ కమిటీ చేబట్టిన కార్యక్రమాలు*

- గ్రామంలోని ప్రజలందరూ తమ ఇళ్ళకు హరితహారం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటి పర్యావరణ కాపాడుతున్నారు.
- గ్రామంలో 3 సహజ చెరువులు ఉన్నాయి.
- చెరువులలో పూడికతీయడం, భూసార పరీక్షలు చేయడం, ఇంకుడు గుంతలు.
- ఉపాధి హామీపథకం ద్వారా వాటర్‌షెడ్ కార్యక్రమాల నిర్వాహణ.

❁ రోడ్లకు ఇరువైపుల చెట్లను నాటడం వాటి పరిరక్షణ,

**6) వ్యవసాయ కార్యాచరణ కమిటీ :**

చైర్మన్ – ఎస్. సాయమ్మ, ఉప సర్పంచ్

కన్వీనర్– ఎం. సత్యనారాయణ, ఎ.ఇ.ఓ.

సభ్యులు – వెంకట్ రెడ్డి, శేఖర్ రెడ్డి, ఎస్. హన్మంత్ రావు, మారెన్న, చిన్నారెడ్డి

*ఈ కమిటీ చేబట్టిన కార్యక్రమాలు*

❁ గ్రామంలో మొత్తం 1964 ఎకరాల మొత్తం వ్యవసాయ భూమి ఉంది. ఇందులో నుండి ప్రస్తుతం 1220 ఎకరాలు మాత్రమే సాగులో ఉంది.

❁ వర్షాధార పంటలనే ఎక్కువగా వేస్తారు. పత్తి, సోయా.

❁ గ్రామంలో ఉన్న పాడి మరియు పశుపోషణను ప్రోత్సహించడం.

❁ వ్యవసాయ అధికారుల ద్వారా సలహాలు తీసుకోవడం వాటిని పాటించడం.

❁ పశువులకు వ్యాధి నిరోదక టీకాలు వేయడం వాటి పోషణ పై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం.

**7) మౌళిక సదుపాయాల కార్యాచరణ కమిటీ :**

చైర్మన్ – వజ్ర శంకర్ గౌడ్, గ్రామ సర్పంచ్

కన్వీనర్ – ఎం. సత్యనారాయణ, పి.ఎస్.

సభ్యులు – శ్రీధర్, గంగాధర్, శంకర్ గౌడ్, మంజుల, సుగుణ

*ఈ కమిటీ చేబట్టిన కార్యక్రమాలు*

❁ గ్రామంలో త్రాగు నీరు, వీధి, దీపాలు, అంతర్గత రోడ్డు, మరియు ఇంటింటింకి త్రాగు నీటి సరఫర లో సమస్యలను అదిగమించడం.

## గ్రామజ్యోతి ప్రణాళికలో ప్రస్తుతం ఉన్న సమస్యలు

* మొత్తం గ్రామంలో 530 గృహాలు,
* 860 కుటుంబాలు
* పురుషులు 1143 కలరు.
* మహిళలు 1203 కలరు.
* 0 నుండి 6 సంవత్సరాల వరకు బాలురు 105



* 0 నుండి 6 సం.రాల వరకు బాలికలు 104.
* 32 మంది గర్భిణి స్త్రీలు.
* 17 మంది బాలింతలు.
* ప్రథమిక పాఠశాల, సెకండరీ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు బాలురు 181, బాలికలు 230.
* పాఠశాలల యందు గ్రామదాత రిటైర్డ్ వి.ఆర్.ఓ. గారి విరాళంతో వాటర్ ప్లాంట్స్ ఏర్పాటు చేయడం.
* గ్రామంలో మొత్తము 1964 మొత్తం వ్యవసాయ భూమి కలదు. ఇందులో నుండి ప్రస్తుతం 1220 మాత్రమే సాగులో ఉంది.



* గ్రామ పంచాయితీకి చెందిన 3 ఎకరాల వ్యవసాయ భూమిపై వచ్చే కౌలు ఆదాయం విద్యా కమిటీ ద్వారా, పాఠశాల అభివృద్ధికి అందిస్తున్నారు.
* గ్రామానికి 3 చెరువులు ఉన్నాయి.

***గ్రామ ప్రణాళిక ద్వారా గ్రామంలోని కొన్ని ప్రధాన సమస్యలకు ప్రణాళిక తయారు చేయడం జరిగింది.***


* గ్రామ పంచాయితీ భవన నిర్మాణం
* అంగన్‌వాడీ భవనాల నిర్మాణం.
* ప్రాథమిక పాఠశాల ప్రసారి గోడ నిర్మాణము.
* స్మశానవాటికలో మహిళలకు స్నానపు గదులు, ప్రహారిగోడ నిర్మాణం.
* ఆరోగ్య ఉప కేంద్రం శిధిలావస్థలో ఉంది. ఉపయోగంలోకి తేవడం.
* కొన్ని మురికి కాలువల నిర్మాణం.
* 10 మిని వాటర్ ట్యాంకులు.
* సాగు నీటి లిఫ్ట్ ఇరిగేషన్‌కి మరమ్మత్తులు.

వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో కూడా ఆదర్శ గ్రామపంచాయితీగా మన్మథ్ గ్రామాన్ని నిలపాలని ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యాచరణ కమిటీలు గ్రామాభివృద్ధి జరగాలని ఆకాంక్షిస్తున్నారు..

*– **కె. శారద,** జిల్లా శిక్షణా మేనేజర్, అదిలాబాద్*

# గాంధీజీ కలల స్ఫూర్తికి అనుగుణంగా గ్రామ జ్యోతి ఆశయాలు

**స్వాతంత్ర్యోద్యమంలో తలమునకలై ఉండినా కూడా మన జాతిపిత మహాత్మాగాంధీ వివిధ సామాజిక, ఆర్థిక సమస్యల పైన కూడా తన నిశిత దృష్టిని సారించారు. 1919 నుండి 1947 వరకు వివిధ సందర్భాలలో తన వ్యాసాల ద్వారా, ఉపన్యాసాల ద్వారా వివిధ సమస్యలను చర్చించి వాటిపై తన నిశ్చితాభిప్రాయాలను, సలహాలను తెలియజేశారు.**



వీటన్నింటిలో గ్రామీణాభ్యుదయమే గాంధీజీ ముఖ్యమైన ఉద్దేశం. ఎందుకంటే దేశానికి స్వాతంత్ర్యం అట్టడుగు నుండి మొదలవ్వాలని ఆయన ఆశగా ఉండేది. ప్రాచీన కాలంలో ఉండిన గ్రామపాలనా, పంచాయితీ వ్యవస్థ ఛాయలను బ్రిటిష్ ప్రభుత్వం తన ఆదాయ సేకరణ వ్యవస్థ ద్వారా రూపుమాపిందని అనేవారు.

***గాంధీజీ రచనలలో వెలువడిన ఆయన కలల్లోని 'గ్రామ స్వరాజ్యం 'రూపురేఖలు ఇలా ఉన్నాయి.***

- ప్రతి గ్రామం తన వ్యవహారాలను చూసుకొనే సామర్థ్యాన్ని సంతరించుకొని స్వయం సమృద్ధిగల పంచాయితీగా విలసిల్లుతుంది.
- గ్రామ పంచాయితీ సభ్యులు ప్రజలచే ఎన్నుకోబడాలి.
- ముఖ్యంగా ప్రతి గ్రామ పంచాయితీ ఈ క్రింది అంశాలను చూసుకోవాలి.
  - గ్రామంలోని పిల్లల విద్య
  - పారిశుద్ధ్యం మరియు స్వచ్ఛతా అలవాట్లు
  - ఆరోగ్య అవసరాలు, పౌష్టికాహారం
  - స్వచ్ఛమైన త్రాగునీటి సరఫరా
  - వ్యవసాయాభివృద్ధి (దిగుబడి ఎదుగుదల, భూసార రక్షణ)
  - పశుసంరక్షణ, సహకార డైరీలు
  - రహదారులు
  - గ్రామీణ గృహనిర్మాణం
  - బావులు, చెరువులు, కుంటల సక్రమ నిర్వహణ
  - దళితోద్ధరణ, వారి అవసరాలు తీరేటట్టు చూడటం.

## గ్రామీణాభివృద్ధిలో గాంధీజీ ప్రాధాన్యతా క్రమాలు

***గాంధీజీ దృక్పథంలో (అప్పట్లో) మన గ్రామాన్ని పట్టి పీడిస్తోన్న త్రిముఖ జాడ్యంలోని భాగాలు ఇవి-***

- ఆధునిక పారిశుద్ధ్య పద్ధతులనాచరించకపోవడం.
- పౌష్టికాహారలేమి
- జడత్వం, స్తబ్ధత

ముఖ్యంగా వ్యక్తిగత మరియు సామూహిక పారిశుద్ధ్యం, స్వచ్ఛతా అలవాట్లు, వ్యర్థపదార్థాల నిర్వహణ గురించి కూడా తన అభిప్రాయాలను గాంధీజీ పలుమార్లు వెల్లడించారు. గ్రామ పునర్ నిర్మాణంలో పారిశుద్ధ్య అంశం లేకపోతే గ్రామీణాభివృద్ధి ప్రయత్నాలన్నీ వృధా అని వక్కాణించారు.

## కార్యాచరణ సులభమా?

గాంధీజీ మాటల్లోనే చెప్పాలంటే, "నా యొక్క ఈ భావాలన్ని ఆచరణ యోగ్యం కావని నన్ను హేళన చేయవచ్చు. కానీ ఎట్లైతే గణిత శాస్త్రంలో యూక్లిడ్‌పాయింట్‌ను నిర్ధారించలేకున్నా దానికి ప్రముఖస్థానం ఉందో నా భావనకు కూడా ఖచ్చితమైన విలువ ఉంది. ఆదర్శగ్రామాన్ని నిర్మించేపని చాలా కష్టమని నాకు తెలుసు. కాని అది అసాధ్యం కాదు ఒక వ్యక్తి ఒక ఆదర్శ గ్రామాన్ని నిర్మించగలిగితే అది దేశమంతటికీ ఒక నమూనాగా నిలబడుతుంది. దీర్ఘకాల జాడ్యాలను (అజ్ఞానం, అవగాహనా లేమి, మూర్ఖవిశ్వాసాలను) ఎదుర్కొనటంలో ఎన్నో కష్టాలను, అవరోధాలను ఎదుర్కోవలసి వస్తుంది. కాని మనం రోగి వ్యాధిని చూసి పారిపోకుండా నిలబడే నర్సుల్లాగా వ్యవహరించాలి."

*సమగ్ర గ్రామ సేవకులు - గాంధీజీ దృష్టిలో సమగ్ర గ్రామ సేవకులు*

- మొదట గ్రామాన్ని సర్వే చేయాలి
- గ్రామంలో ఉండేవారందరి గురించి తెలిసికోవాలి.
- వారి నమ్మకాన్ని చూరగొనాలి.
- తమను తామే అభివృద్ధి చేసికొనే మార్గాన్ని చూపించాలి.
- అవసరమైన సామగ్రి లభ్యత విషయంలో తగు సూచనలిచ్చి, సహాయపడాలి.
- అవసరం మేరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి.
- పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యత నివ్వాలి. స్వాతంత్ర్యముకంటే పారిశుధ్యమే ముఖ్యం.

*కనుక దీన్ని బట్టి మనకర్థమయ్యేదేమిటంటే గాంధీజీ దృష్టిలో...*

- మన గ్రామాలలో కీలక రంగాలలో పంచాయితీల ద్వారా అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనివ్వాలి.
- ఈ అభివృద్ధి ప్రణాళిక బద్ధంగా ఉండాలి.
- అంకితభావంతో పనిచేసే గ్రామ సేవకుల ద్వారా గ్రామీణ ప్రజల అవగాహనను పెంచి గ్రామాభివృద్ధికి వారిని సమాయతపరచి కార్యోన్ముఖులను చేయాలి.
- గ్రామాభివృద్ధికి అవసరమైన రీతిలో నైపుణ్యాన్ని పెంచడానికి శిక్షణను కూడా నిర్వహించాలి.
- తన కలలు నెరవేరి గ్రామాభివృద్ధి జయప్రదంగా జరిగితే ఫలితాలు ఈ విధంగా ఉంటాయని కూడా గాంధీజీ తన రచనలలో పేర్కొన్నారు.
- గ్రామాల్లో శుభ్రమైన వీధులు
- గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యం-పారిశుధ్య సూత్రాలు పాటించే ప్రజలు
- నిరక్షరాస్యులు లేని గ్రామాలు
- అందరికీ పని లభ్యత
- అందరికీ పౌష్టికాహార లభ్యత
- శుభ్రమైన నీటి వనరులతో అందరికీ స్వచ్ఛమైన త్రాగునీరు లభ్యత
- వ్యవసాయాభివృద్ధితో గ్రామానికి అవసరమైన ధాన్యాలు, కూరగాయలు, పండ్ల స్థానిక ఉత్పత్తి
- అందరికీ గృహాల లభ్యత
- పిల్లలందరికీ ప్రైమరీ, సెకండరీ విద్య లభ్యత
- ఆరోగ్య సేవల లభ్యత, దోమల వ్యాప్తి నివారణ
- తరతమ బేధాలు వైషమ్యాలు లేక సంఘీభావముతో తమ అవసరాలు తామే నిర్ణయించుకొని తామే వాటిని పొంది సక్రమంగా నిర్వహించుకొని తమ సామూహిక ఆదాయాన్ని పెంచుకొనే పంచాయితీలు / గ్రామ సమాజాలు.

తెలంగాణా ప్రభుత్వం ఆగస్ట్ 2015లో ప్రవేశపెట్టిన ప్రతిష్ఠాత్మక గ్రామజ్యోతి కార్యక్రమం చాలా వరకు గాంధీజీ ఆశయాలను ప్రతిబింబిస్తోంది. వర్తమాన పరిస్థితులకు, అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం వాటిని మరింత విస్తృత పరచింది కూడా, క్షేత్రస్థాయిలో కార్యచరణకు దిగటానికి కావలసిన మార్గదర్శకాలు ఇచ్చింది.

| గాంధీజీ సూచనలు | గ్రామజ్యోతి |
|---|---|
| 1. ప్రణాళికాబద్ధ అభివృద్ధి ఉండాలి | గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక (GPDP) |
| 2. గ్రామీణాభివృద్ధికై పంచాయితీలు దృష్టి సారించాల్సిన వివిధ అంశాలు | గ్రామజ్యోతిలోని కీలక అంశాలలో ఇవన్నీ ఇమిడి ఉన్నాయి. (Key focus areas) |
| 3. గ్రామ సేవకులు ప్రజలను తమతోపాటు కలుపుకొని వారి నమ్మకాన్ని చూరగొనాలి. సర్వే చేయాలి. శిక్షణ నివ్వాలి. తమ అవసరాలను తామే గుర్తించేటట్టుగా చేసి కార్యోన్ముఖులయేటట్టుగా పంచాయితీలకు ప్రజలకు మార్గదర్శకత్వం వహించాలి. | 1. ప్రజా సమీకరణ (Public Mobilisation)<br>2. అవగాహన సామర్థ్యాల పెంపుదల (Sensitization & & Capacity Building)<br>3. గ్రామ సభ (Grama Sabha)<br>4. క్షేత్ర స్థాయి పరిస్థితి మదింపు, పరిశీలన (Situation Analysis)<br>5. గ్రామ పంచాయితీ దార్శనికత(Vision of GP)<br>6. ప్రాధాన్యీకరణ (Prioritisation)<br>7. గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక (GPDP)<br>8. ఒక్కోకీలక అంశానికి ఒక్కో పంచాయితీ స్థాయి కమిటీ ఏర్పాటు (GP Level Functional Committees) |

ఇంకా 70% ప్రజలు గ్రామాల్లోనే నివస్తున్నారు. గ్రామాభివృద్ధే దేశాభివృద్ధికి దారి తీస్తుంది. కావున ఇంతటి ప్రాముఖ్యత కలిగిన గ్రామజ్యోతి కార్యక్రమంతో సంబంధమున్న వారందరూ తమ వంతు పాత్రను సక్రమంగా నిర్వర్తించి కార్యక్రమ విజయానికి తద్వారా సమగ్ర గ్రామాభివృద్ధికి తోడ్పడగలరని ఆశిద్దాం.

***- ఏ.నాగేశ్వర రావు,*** *సెంటర్ హెడ్,*
*సి.డబ్ల్యు.ఎస్, టిసిపార్డ్*

**నిజామాబాద్ కేంద్రం నుండి 58 కిలోమీటర్ల దూరంలో గల మారుమూల ప్రాంతమైన ధర్పల్లి (మం॥), ఎల్లారెడ్డి పల్లి గ్రామం.**

ప్రభుత్వం తీసుకున్న 'గ్రామజ్యోతి' పథకాన్ని ఈ గ్రామ ప్రజలు రెండు దశాబ్దాల క్రితం నుండి అమలు చేస్తూ, మరియు ఇటీవల ఆగష్టు 17న రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామజ్యోతి గ్రామాభివృద్ధి పథకం ఆ గ్రామ ప్రజలకు నూతనోత్సాహాన్నిచ్చింది.

నేటి వరకు గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటూ, జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. సమిష్టిగా అందరూ కలిసి నిర్ణయాలు తీసుకొని ఆదర్శంగా నిలుస్తున్న గ్రామం ఎల్లారెడ్డిపల్లి. ఇది ధర్పల్లి మండలంలో ఉంది. కలిసికట్టు నిర్ణయాలు ఎలాంటి ఫలితాలు వస్తాయో చెప్పడానికి ఓ ఉదాహరణగా నిలిచింది.

వరంగల్ జిల్లా గంగదేవిపల్లిలా తయారు కావడానికి అన్ని అర్హతలన్న ఈ గ్రామానికి నూతనంగా ప్రవేశపెట్టిన 'గ్రామజ్యోతి పథకం' గ్రామాభివృద్ధికి అన్ని విధాల తోడ్పడుతుంది.




# ఆ గ్రామంలో... అభివృద్ధి జ్యోతి

ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో సుమారు 3,200 వేల జనాభా ఉంటుంది. అందులో సుమారు 2,400 వరకు ఓటర్లు ఉంటారు. గ్రామంలో అక్షరాస్యత 80 డిగ్రీలు ఉంటుంది. 45 మహిళా సంఘాలున్నాయి. గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో గత 20 ఏళ్ల క్రితం గ్రామపెద్దలు ఒక నిర్ణయం తీసుకున్నారు. గ్రామాభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామాభివృద్ధియే ధ్యేయంగా ఈ కమిటీ పనిచేస్తుంది. ఈ గ్రామంలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చింది.

100% శాతం ఇంటిపన్నులు చెల్లిస్తుంటారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రతి ఇంటికి మరుగుదొడ్డిని (వ్యక్తిగత) నిర్మించుకొని రెండు నెలల క్రితం మంత్రి కె.టి.ఆర్ చేతుల మీదుగా జాతీయ గ్రామీణ నిర్మల్ పురస్కార అవార్డు సర్పంచ్ శేఖర్ అందుకున్నారు.

గ్రామజ్యోతిలో భాగంగా, గ్రామాభివృద్ధి కమిటీలో భాగమైన పాఠశాల అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసి ఆంగ్ల మాధ్యమ విద్యను ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రతీ ఒకరు తమ పిల్లలను ఆ పాఠశాలలో చదివించేలా తీర్మానం చేశారు. పాఠశాల నిర్వహణ కోసం ప్రతి ఏడాది విద్యార్థుల నుంచి కొద్దిగా సొమ్ము జమచేసి ఉపాధ్యాయులకు పాఠశాల నిర్వహణకు ఖర్చు చేస్తుంటారు. గ్రామంలో రక్షిత మంచినీటి కోసం నీటి శుద్ధయంత్రాన్ని ఏర్పాటు చేసి తక్కువ ధరకే మంచినీటి సరఫరా రక్షిత మంచినీటి కమిటీ బాధ్యత వహిస్తుంది. తక్కువ ధరకే టెలివిజన్ ప్రసారాలు మరియు గ్రామంలో రైతు కమిటీ ఏర్పాటు చేసి రైతులకు కావలసిన అవసరాలు కమిటీ సమకూరుస్తుంది.

పర్యావరణం పరిశుభ్రతలో భాగంగా కమిటీల ఆధ్వర్యంలో తీర్మానం చేసి, పాఠశాలలో మరియు రోడ్లకిరువైపుల మరి యు గ్రామపంచాయతీకి సంబంధించిన ఖాళీ స్థలంలో మొక్కలు నాటి ప్రజలకు ఉచితంగా మొక్కలను పంపిణీచేసి వారికి మొక్కలను సంరక్షించే బాధ్యతను అప్పగించారు. ఈ సంవత్సరం మట్టి గణపతిని కమిటీ ఏర్పాటు చేసి, జల కాలుష్యాం, వాతావరణ కాలుష్యం కాకుండా చేశారు.

గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో గ్రామంలోని యువకులు ముందుకు వచ్చి 'ఫ్రెండ్స్ యువజన సంఘం' ఆధ్వర్యంలో సుమారు లక్ష రూపాయల ఖర్చు చేసి బస్‌స్టాప్ భవనం ఏర్పాటు చేశారు.

గ్రామంలోని ప్రతి ఒకరు గ్రామాభివృద్ధి కమిటీ ఆధీనంలో పని చేస్తుంటారు. గ్రామాలు ఏ సమస్య వచ్చిన శాంతియుతంగా పరిష్కరిస్తారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకొని ఆరుబయట మల మూత్ర విసర్జన నిషేధించారు. జాతీయ ఉత్తమ గ్రామంగా నిర్మల్ పురస్కార్ అవార్డు అందుకొని సమగ్రాభివృద్ధికి అడుగులు వేస్తున్నారు.

***– డి. అశోక్,*** *డిటిఎమ్, నిజామాబాద్ జిల్లా*

# గ్రామజ్యోతిలో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణంలో ఆదర్శంగా నిలిచిన 'శ్రీరాంనగర్'

**హైదరాబాద్‌నకు అతి సమీపంలో గల మొయినాబాద్ మండలంలోని శ్రీరాంనగర్ గ్రామ పంచాయితీ ఇది. ఇందులో 1822 మంది జనాభాగల చిన్న గ్రామం. ఈ గ్రామంలో 440 ఇళ్ళు కలవు. మౌలిక వసతులు అరకొరగానే ఉన్నాయి. గ్రామాభివృద్ధిలో ప్రజల పాత్ర అంతంతగానే ఉంది. పట్టణానికి సమీపంగా ఉండటం వలన ప్రతివారు ఏదో ఒక పని నిమిత్తం పల్లెను విడిచి పట్టణానికి చేరుకుంటారు.**

గ్రామంలో 2,3 వరుసలలో మరియు దగ్గర దగ్గరగా ఇళ్ళ నిర్మాణం చేసుకొన్నారు చిన్న చిన్న సందులలో గ్రామం ఉంది. మురుగు కాల్వల నిర్మాణం లేదు. పూర్వం పెంట గుంతలు ఉండేవి అవి ఇళ్ళ నిర్మాణం కోసం స్థలం లేక ఉమ్మడి కుటుంబాల నుండి వేరుపడి వ్యక్తిగత కుటుంబాలు ఏర్పడి అట్టి పెంట గుంతలను ఇంటి నిర్మాణం కోసం ఉపయోగించారు. చెత్త చెదారం వేయటానికి స్థలం లేక రోడ్లకి ఇరువైపుల వేయసాగారు. ఆరుబయట మలమూత్ర విసర్జనలు చేసేవారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత లోపించింది.



అవగాహన, ప్రణాళికలు లేక వ్యవసాయంలో పాతకాలపు పద్ధతులే వాడారు. ఒక్కపొలం దున్నటంలో ట్రాక్టరు, విత్తనాలలో హైబ్రిడ్‌వి తప్ప వేరే అభివృద్ధి అంతంత మాత్రంగానే అందేవి.

పై సమస్యల పరిష్కారానికి వ్యవసాయాధికారిని, మండల అభివృద్ధి, వికాస అధికారులను, డాక్టరులను ఇతర సంబంధించిన అధికారుల చుట్టూ తిరిగి కలిసి వచ్చారు. ఫలితాల నిధులు అంతంత మాత్రంగానే గ్రామానికి అందేవి.

ఈ సందర్భంగా తెలంగాణా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రామజ్యోతి కార్యక్రమంలో భాగంగా 17-8-2015 నుండి 25-8-2015 వరకు ఈ గ్రామంలో అమలు జరిగింది. ఎంపిడిఓ నోడల్ ఆఫీసర్‌గా ఉండి, సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి నేతృత్వంలో గ్రామజ్యోతి అమలు జరిపి ప్రజల భాగస్వామ్యం పెంచటానికి 7 కార్యాచరణ కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ఉత్సాహ వంతులైన యువకులను, మహిళా సంఘాల ప్రతినిధులను, గ్రామస్తులను సభ్యులుగా చేర్చుకున్నారు.

ఇట్టి కమిటీలకు ఎంపిడిఓ 2 రోజులు కార్యాచరణ కమిటీల లక్ష్యం. ఆవశ్యకత కమిటీ ఆచరించే కార్యక్రమాలు 35 మంది కమిటీ సభ్యులకు ఆచరణా పద్ధతులను సవివరంగా వివరించినారు.

1. త్రాగునీరు- గ్రామపారిశుద్ధ్యం కమిటి.
2. ఆరోగ్యం మరియు పోషకాహారం.
3. విద్యా కార్యాచరణ.
4. సామాజిక భద్రత మరియు పేదరిక నిర్మూలన.
5. వ్యవసాయం.
6. సహజవనరుల యాజమాన్యం.
7. మౌలిక వసతులు.

ఈ 7 కమిటీల కల 5 గురికి 7x5 = 35 మందికి అవగాహన కల్పించి నైపుణ్యం పెంచడమైంది.

### పారిశుద్ధ్యం - త్రాగునీరు కార్యాచరణ కమిటీ

గ్రామములో కమిటీలవారు 25-8-2015న గ్రామసభ నిర్వహించి అందులో కమిటీల వారీగా తీర్మానాలు చేసుకొని

పారిశుద్ధ్యం కమిటీ ఒక ప్రణాళిక వేసుకొని గ్రామంలో గల పాత ఇళ్ళను మరియు సగం నిర్మించి వదిలేసిన ఇళ్ళను కూల్చివేసి పరిశుభ్రం చేశారు. ఇందులో ప్రతి ఇంటి నుండి ఒక సభ్యులు వచ్చారు. గ్రామంలోని పాత ఇళ్ళను కూల్చి లెవల్ చేశారు.



గ్రామంలో పిచ్చిమొక్కలు, చెత్తను తీసివేసి, మురుగు కాల్వలను పరిశుభ్రం చేశారు. వాటర్ ట్యాంక్‌ని కూడా శుభ్రపరిచారు. 48 ఇంకుడు గుంతలు తవ్వారు. మహారాష్ట్ర మోడల్ ఇంకుడు గుంతలు నిర్మాణం చేయటం జరిగింది. సర్వే నం.116 లో 3 ఎకరాల విస్తీర్ణంలో 2 ఎకరాలు డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించారు. 1 ఎకరంలో స్మశాన వాటిక నిర్మిస్తారు.

మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా 3000 మొక్కలు జామ, నిమ్మ, సపోట, బొప్పాయి, సీమతంగెడు మొదలైనవి నాటారు.

కెపిఎంజి స్వచ్ఛంద సంస్థ సహకారంతో 300 కొబ్బరి చెట్లను నాటారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ సహకారంతో అంగన్‌వాడి, స్కూలు జిపి ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు.

జడ్‌పిటిసి శ్రీ చంద్రలింగం ఆర్థిక సహాయంతో 500 చెత్తబుట్టలు ప్రజలందరికీ సరఫరా చేశారు.

అలాగే చెత్తను తొలగించటానికి ఆటోను కూడా బహుకరి స్తానన్నారు.

## ఆరోగ్యం - పోషక ఆహారం కార్యాచరణ కమిటీ

కపిల్ హోమ్స్ ఆర్థిక సహాయంతో త్రాగునీటి శుద్ధి ఆర్ఓ ప్లాంటు ఏర్పాటు చేసుకొన్నారు. ట్యాంక్‌కి సున్నం వేయించారు.

పాలిహస్‌లో మిగిలిన ఇనుప వల సహాయంతో ట్రి గార్డ్స్ తయారు చేసి 300 కొబ్బరి చెట్లకు, ఇతర మొక్కలకు ట్రీగార్డ్స్ అమర్చారు. ఆశావర్కర్, ఏఎన్ఎం, సర్పంచ్, ఇతర సభ్యులు కలిసి ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేసి, అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణలో టీచర్ లేనందున ప్రక్క గ్రామం అంగన్‌వాడి టీచర్‌కి అదనపు బాధ్యలు ఇచ్చారు. ఆమె పొరుగు గ్రామం కావటం వలన వారానికి ఒకసారి మాత్రమే వచ్చిపోయేది.



గ్రామజ్యోతి కార్యక్రమాల అమలులో భాగంగా ఆరోగ్యం పోషకాహారం కమిటీలోని సభ్యులు, అధ్యక్షులు కలసి ఈ సమస్యను గుర్తించి, గ్రామంలో ఇంటర్ చదివిన ఒక మహిళను గుర్తించి, ప్రస్తుతం టీచరుగా బాధ్యతలు చేపట్టే విధంగా ఏర్పాటు చేశారు. ఈ టీచరుకు అంగన్‌వాడి సైపర్‌వైజర్ ద్వారా అవగాహన, పనిచేసే నైపుణ్యం పెంచి పనిలో పెట్టారు.

కమిటీ వారందరూ కలసి గ్రామంలోని కిశోరబాలికలకు, గర్భిణీస్త్రీలను గుర్తించి అవగాహన కలిస్తూ అదనంగా ఐరన్ మాత్రలు వేసుకొనేటట్లు చేశారు. గర్భిణీస్త్రీలకు అదనపు పోషకాహారం తీసుకొనేటట్లు చేశారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేయించాలని, గర్భిణీలు తీసుకోవలసిన జాగ్రత్తలు, పౌష్టికాహారం గురించి ప్రచారం చేశారు.



ఏఎన్ఎం సందర్శనలో అందరు పరీక్షలు జరుపుకొని ఏఎన్ఎం సూచనలు, సలహాలు పాటించాలని తెలిపారు.

### విద్యా కమిటీ

స్కూలు పిల్లలతో ర్యాలీ చేయించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి, ఇంటింటి ప్రచారం చేయించారు. అందరు స్కూలుకు వెళ్ళేటట్లు చూశారు. మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించి నాణ్యతను పెంచే సూచనలు చేశారు.

### సామాజిక భద్రత, పేదరిక నిర్మూలన

ఐకెపి ఆధ్వర్యంలో అందర్ని పొదుపు సంఘాలలో 37–ఎస్‌హెచ్‌జిలు కలవు. విఓ కలరు. పొదుపు సంఘాల వారికి ఐకెపి ద్వారా పేదరిక నిర్మూలన కొరకు బ్యాంకు లింకేజిల ద్వారా ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు అప్పులు సిఐఎఫ్ ఇచ్చారు. సామాజిక భద్రతలో భాగంగా రేషన్ షాపు తనిఖీ చేశారు. సేవలను అందేటట్లు చూశారు.

132 ఓఏపి, 66 విడో, 25 డిస్‌బుల్డ్, 6 ఇతరులు మొత్తం 229 పెన్షన్‌లు కలవు.

### వ్యవసాయ కమిటీ

వ్యవసాయపు కమిటీ గ్రామసభలో చర్చించింది. రైతులందరినీ ఒకరోజు ప్రత్యేక సమావేశం నిర్వహించి, వారి సమస్యలను గుర్తించి వ్యవసాయంలో సమస్యలు వర్షాభావ పరిస్థితుల్లో ఆదాయాభివృద్ధి గురించి చర్చించారు. ఇందులో భాగంగా వ్యవసాయంలో ఖర్చులు తగ్గించాలని, ఆదాయం పెంచాలనే నినాదంతో పురుగుమందులు లేని వ్యవసాయ సేంద్రియ వ్యవసాయం, పాడిపరిశ్రమ, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను చేపట్టటానికి ప్రణాళికలను సిద్ధం చేశారు. ప్రత్తి వివిధ పంటలలో చీడపీడలు, తెగుళ్ళ నిర్మూలనకు వ్యవసాయ కళాశాల నుండి సైంటిస్టులను పిలిపించారు. సూచనలు చేయించారు.

బీజామృతం, జీవామృత ద్రవ, ఘన జీవామృతం నామాస్త్రం, అగ్ని అస్త్ర, పచ్చిమిర్చి, వెల్లుల్లి, కరేయం, పొగాకు కశాయం, పంచపత్ర కశాయం, రక్షణ పంటలు, ఎరపంటలు, ఫిమనాట్రాప్స్, పక్షిస్థావరాల గురించి రైతులకు వివరించారు.

### సహజవనరుల యాజమాన్యం కమిటీ

వాటర్‌షెడ్ కార్యక్రమంలో భాగంగా, ఇంకుడుగుంతలు తుంబుర్ని మహారాష్ట్ర మోడల్ నీటి ఇంకుడు గుంతలు 52 నిర్మాణం చేపట్టారు. మిషన్ కాకతీయలో భాగంగా చెరువు మట్టిని పంట పొలాలకు వేయించారు. 6000 చెట్లు నాటించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 1000 బట్ట సంచులను పంపిణీ చేశారు

### మౌళిక వసతుల కమిటీ

గ్రామంలో మౌళిక వసతుల ఏర్పాటు కోసం 4040 మీటర్ల సిసి రోడ్డు, 3405 మీటర్ల డ్రైనేజీ, 4010 మీటర్ల మంచినీటి పైపులైన్లు, 78 మరుగుదొడ్ల నిర్మాణం కోసం ప్రణాళికలు వేయించారు.

గ్రామజ్యోతిలో మరిన్ని అవసరాలు గుర్తించి ప్రణాళికలు వేసుకుని మరింత సమగ్ర గ్రామాభివృద్ధికి దారి తీస్తుందని ఆశిద్దాం.

# ఇంకుడు గుంతల నిర్మాణం

మే 2015న మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా, టెంబుర్ని, సనా గ్రామాల్లో ఉన్న (మ్యాజిక్) ఇంకుడు గుంతలు సందర్శనకై డిప్యూటి కమీషనర్ శ్రీ రామారావు, ఎంపిడిఓ, డిపిఓ, ఈఓపి ఆర్డి పంచాయతీ సర్పంచ్ మరియు పంచాయతీ కార్యదర్శులు వెళ్ళారు.

మ్యాజిక్ (ఇంకుడు) గుంతల నిర్మాణం, దాని ఉద్దేశ్యఢ ఉపయోగాలు గురించి నిర్మాణ విధానం, ఖర్చుల గురించి క్షుణ్ణంగా పరిశీలించి తెలుసుకున్నారు.

తదుపరి సందర్శన అనంతరం శ్రీరాంనగర్లో అమలు చేయటానికి ముందుగా సర్పంచ్తో ఈవో పి ఆర్డి సమాలోచన చేశారు. సర్పంచ్ సుముఖత చూపారు. కార్యక్రమం మంచిదే కదా అనుకొని గ్రామపంచాయతీ సమావేశంలో ప్రతిపాదన చేయగా ఇది అయ్యే పని కాదు, ప్రజలతో చేయలేమన్నారు. అయినా ఈవోపిఆర్డి మరియు సర్పంచ్ కార్యదర్శి పట్టు వదలకుండా ప్రజలతో వ్యక్తిగత సమాలోచన చేసి, చిన్న చిన్న గ్రూపు చర్చలు, వార్డుల వారీగా సమాలోచన చేసి ఇంకుడు గుంతల ఉపయోగాలు, పారిశుధ్యం గురించి వివరించి వారు టెంబుర్ని ఇంకుడుల విధానాలు, తయారు చేసి విధానం, వాటి ఉపయోగాలు వివరించి టెంబూర్ని సందర్శించి వారు సాధించిన ప్రగతి గురించి వివరించారు.



శ్రీరాంనగర్లోని అంశాలను దృష్టిలో ఉంచుకొని మొదట సుస్థిర పారిశుధ్యం నీటి నిర్వహణలో భాగంగా స్కూలు ఆవరణలో ఒకటి, బాగా నీరు పారుతున్న 4 చోట్ల మొదటగా గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీ సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి బాధ్యతలో 5 గుంతలు తీయించి ఆ గుంతలో పెద్ద రాళ్ళు, మధ్యస్థ రాళ్ళు కంకర, గులకరాళ్ళతో నింపిపై వరుసలో రంధ్రాలు గల సిమెంటు తొట్టిని ఏర్పరచి ఆ తొట్టిలోకి పోతున్న నీటిని పైపు ద్వారా మళ్ళించారు. ఆ నీరు ఆ మ్యాజిక్ గుంతలోకి ఇంక సాగింది.

ఇదేకాకుండా, గ్రామంలోని వీధులలో కొన్ని చోట్ల మురికి కాల్వలు లేవు, డ్రైనేజి సౌకర్యం లేనందున ఇండ్లలో మురుగునీరు రోడ్లపై పారుచున్నందున ఈ మ్యాజిక్ గుంతల నిర్మాణం చేపట్టారు.

ప్రస్తుతం అక్కడి వీధుల్లో మురుగునీరు రోడ్లపై పారటం లేదు. నీరంతా భూమిలోకి ఇంకటం జరిగింది. దీనివలన నీరంతా భూమిలోకి ఇంకిపోవటం, మురుగు ఏర్పడకపోవడం, భూమి నీటితో రీచార్జి అవటం గమనించారు. అలాగే అక్కడి బోర్‌వెల్‌లో నిరాటంకంగా నీరు సరఫరా అవుతుంది. ఈ విధానం వలన మంచి ఫలితాలను పొందారు.

గ్రామజ్యోతిలో భాగంగా పారిశుధ్యం, నీరు కార్యాచరణ కమిటీ ఏర్పడి గ్రామసభ రోజున ప్రజల్లో అవగాహన కల్పించి ఒక్కరితో ప్రారంభమై ఇప్పుడు ప్రతి ఇంటి ముందు ఇంకుగుంతలు త్రవ్వేందుకు పూనుకున్నారు. మరిన్ని చోట్ల అన్ని కలిపి 60 నుండి 70 వరకు నిర్మించారు.

నిర్మించడానికి స్థానిక సర్పంచ్ శ్రీ ప్రభాకర్‌రెడ్డి కృషి కూడా తోడైంది. మ్యాజిక్ ఇంకుడు గుంతల ఏర్పాటు వలన, ప్రకృతి వనరులైన నీరును భూమిలోకి ఇంకింపచేయటమే కాకుండా పరిసరాల శుభ్రత, రోడ్లపై మురుగునీరు పారకుండా ఉండటం దోమల బెడద తగ్గించ గల్గడం, నీటి వృథాను అరికట్టడం తదితర లాభాలు పొందుతున్నారు.

దీనికి సర్పంచ్‌గారు గ్రామాల అభివృద్ధిలో యువతపాత్ర, మహిళల పాత్ర, ప్రతి ఒక్కరి పాత్ర చాలా అవసరమని, ఇంకా యువత ముందుండి చేపడితే విజయవంతమవుతాయి.

స్ఫూర్తి నింపి చేయిచేయి కలిమి ఊరువాడ ఏకమై గ్రామ అభివృద్ధికి నడుం బిగించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామజ్యోతి కార్యక్రమాన్ని అవకాశంగా మలుచుకున్నారు. తీర్మానాలు చేశారు. తదనుగుణంగా ప్రణాళికలు వేసుకున్నారు. అభివృద్ధి సాధిస్తూ జిల్లాకే కాక, రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

సెప్టెంబర్ 4న పార్లమెంటు సభ్యులు శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సందర్శించి గ్రామంలో అమలు పరుస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రత్యేకంగా ఇంకుడుగుంతలను పరిశీలించారు. అనంతరం జిల్లాకే ఆదర్శం ఈ శ్రీరాంనగర్ అని కితాబునిచ్చారు.

***– జి. రామేశ్వర్ రావు,*** *డిటిఎం, రంగారెడ్డి జిల్లా*



# గ్రామజ్యోతి అఖండజ్యోతి

**ప్రభుత్వం చేపట్టిన గ్రామజ్యోతి పథకం గ్రామాల్లో నిరంతరం వెలుగులు నింపే అఖండజ్యోతిగా విరాజిల్లుతుందని రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి శ్రీ కే. తారక రామారావు అన్నారు. రాష్ట్రంలో ప్రతి పంచాయతీ ఓ గంగదేవిపల్లి, ప్రతీ ఊరు ఒక అంకాపూర్ కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన చెప్పారు. గ్రామజ్యోతి వేదికగా గ్రామపంచాయతీల ను సుసంపన్నం చేసే కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నదని పేర్కొన్నారు.**

హరితహారం, మిషన్ కాకతీయ, కళ్యాణలక్ష్మి వంటి పథకాలతో గ్రామాలు నిరంతరం చైతన్యవంతం కావడానికి అవకాశమేర్పడిందన్నారు. ప్రజలందరూ గ్రామజ్యోతిలో భాగస్వాములవుతున్నారని, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎమ్మెల్సీలు 2564 గ్రామపంచాయతీలను దత్తత తీసుకుని అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు.

శాసనసభలో సోలిపేట రామలింగారెడ్డి, ఎల్లనవెూని అంజయ్య, ఆరూరి రమేశ్, రసమయి బాలకిషన్, సుధీర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంపై అడిగిన ప్రశ్నలకు మంత్రి ఇచ్చిన సమాధానంలో ఈ వివరాలున్నాయి. గ్రామసభల్లో ఎంపీటీసీలు కూడా పాలుపంచుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం అవసరమైతే చట్టంలో మార్పులు తీసుకువస్తామన్నారు.

గ్రామజ్యోతి కార్యక్రమం కోసం గ్రామాలలో పారిశుద్ధ్య పరిరక్షణకు 20 వేల చెత్త తరలింపు రిక్షాలు కొనుగోలు చేశామని, వేయి జనాభా కలిగిన గ్రామానికి ఒక రిక్షా చొప్పున ఇస్తామని అన్నారు. ప్రస్తుతం 1500 గ్రామాల్లో శ్మశానవాటికల కోసం స్థలాల సేకరణ జరుగుతున్నదని, 7003 గ్రామాలలో డంపింగ్ యార్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి విశదీకరించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా పరిషత్తుల నిధులతో సమీకృత గ్రామ అభివృద్ధి ప్రణాళికలకు కార్యాచరణ రూపొందించామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రం స్థానిక సంస్థల ద్వారా గ్రామపంచాయితీలకు వచ్చే నిధులను, ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక నిధులను అనుసంధానం చేసుకోవడం ద్వారా గ్రామాలలో రోడ్లు, పారిశుద్ధ్యం, శ్మశానవాటికల నిర్మాణం, డంపింగ్ యార్డుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులన్నింటిని చేసుకునేందుకు అవకాశాలు మెరుగుపడ్డాయని మంత్రి వివరించారు.

గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 2500 కోట్లు నిధులు సమకూరనున్నాయని, ఈ నిధులను కూడా సమన్వయం చేసి గ్రామాల అభివృద్ధికి వినియోగించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. దీనికితోడు ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. గ్రామపంచాయతీలన్నీ స్వయం సమృద్ధం కావాలనే లక్ష్యంతో పనులు చేస్తున్నామని, ఫలితంగా గతంలోకన్నా పన్నుల వసూలు పెరిగిందనీ, 70 శాతం గ్రామప్రజలు స్వచ్ఛందంగా పన్నులు చెల్లిస్తున్నారని వివరించారు.




తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గ్రామ పంచాయతీ వ్యవస్థలో గొప్ప ప్రగతిని సాధించామని, 100 శాతం పన్నులు, 100 శాతం హరితహారం, ఆరోగ్యవ్యవస్థ, విద్యావ్యవస్థ, అందరికీ పోషకవిలువలు లభించడం, వ్యవసాయరంగంలో అభివృద్ధి సాధించడం వంటి లక్ష్యాలు ముందుంచుకుని పనులు చేస్తున్నామని మంత్రి చెప్పారు.

– ఎన్.పి.ఆర్.



# గ్రామజ్యోతి స్ఫూర్తితో గ్రామానికో 'శ్రీమంతుడు'

**గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చి చెదిరిపోయిన పల్లె జీవనంలో సరికొత్త జ్యోతులు వెలిగించి పంచాయితీరాజ్ ఉద్యమ స్ఫూర్తితో గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామజ్యోతి కార్యక్రమం ద్వారా సిద్ధమైయింది.**

ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంతో పల్లెలను 'దత్తత' తీసుకునే సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు, సెలబ్రెటీలు, శ్రీమంతులు, ప్రముఖులు తలా ఒక్క గ్రామాన్ని దత్తత తీసుకుని గ్రామజ్యోతి అమలులో భాగస్వాములు కావాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది.







అది అలా ఉంచితే . . .ఈ మధ్యకాలంలో 'శ్రీమంతుడు' అనే తెలుగు సినిమా విడుదల తరువాత గ్రామాలను దత్తత తీసుకునే ఆలోచన మొదలైంది. "ఊరి నుండి చాలా తీసుకున్నాం తిరిగి ఇచ్చేయ్యాలి. లేకపోతే లావైపోతాం" అనే ఆ సినిమాలోని డైలాగ్ ప్రజల్లో ఎక్కువగా నానుతుంది. యాదృచ్ఛికమో లేక శ్రీమంతుడు సినిమా వల్ల కలిగి స్ఫూర్తి ప్రభావమే తెలియదు గాని ఊరి దత్తత అనే అంశం కొంతమంది వ్యక్తులపై ప్రభావం చూపిందనడంలో ఎటువంటి సందేహం లేదనే చెప్పాలి.

ఏది ఏమైనా గ్రామజ్యోతి కార్యక్రమంలో గ్రామ దత్తత ఊపందుకుని గ్రామాలను దత్తత తీసుకునే ఆలోచన మరింతగా పెరగడం ఆహ్వానించదగ్గ విషయం. సామాజిక ధర్మంగా, సేవా సంకల్పంతో జీవితాన్ని ప్రసాదించిన సొంత ఊరు రుణం తీర్చుకునేందుకు గ్రామజ్యోతి కార్యక్రమం ద్వారా ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు కొంతమంది ప్రముఖులు గ్రామాలను దత్తత తీసుకోవడం మొదలుపెట్టారు.

జీవితంలో ఉన్నతంగా ఎదిగినా, హోదాలను అలంకరించినా సొంత ఊరిపై ఎవరికైనా చెప్పలేనంత మమకారం ఉంటుంది. చిన్ననాటి స్నేహితులు, సన్నిహితులు, బంధువులు వారితో గడిపిన క్షణాలు మధురాతి మధురం. పచ్చని పొలాలు, ప్రశాంత వాతావరణం, ఆత్మీయతను చాటే నేస్తాలను వదలి నగరబాట



పట్టి జీవితంలో ఎదిగిన ఎంతోమంది సొంత ఊరు అభివృద్ధి పథంలో పయనించాలని కోరుకుంటారు. అక్కడ అభివృద్ధి సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని అనుకుంటారు. వారు చదివిన పాఠశాలలో సౌకర్యాలు కల్పిస్తూ విద్యాభివృద్ధికి తోడ్పాటునందించాలనుకుంటారు. అయితే వారికి సరైన ప్రోత్సాహం, సరియైన ప్లాట్‌ఫామ్ దొరకక సతమతువుతుంటారు. వీరందరికీ గ్రామజ్యోతి కార్యక్రమం ఒక మంచి అవకాశంగా వారు భావించాలి.

పిల్లల్ని దత్తత తీసుకోవడం ఒకప్పటి మాట, అయితే ఊరిని దత్తత తీసుకోవడం ఇప్పటి మాట అని చెప్పాలి. గ్రామాల ను దత్తత తీసుకోవడం వల్ల ఏం జరుగుతోంది అనే సందేహాలు చాలామందికి రావచ్చు. ఎందుకంటే వెనుకటి రాజకీయ నాయకులు, వ్యక్తులు తమ తమ రాజకీయ మరియు సొంత సౌలభ్యం, ప్రయోజనాలు కోసం చాలా చాలా గ్రామాలను దత్తత తీసుకున్నారు. కాని ఆయా గ్రామాలు ఏ స్థాయిలో అభివృద్ధి చెందాయో అందరికీ తెలిసిన విషయమే.

కాని ఇప్పటి పరిస్థితి వేరు. కాలం మారింది ఇదివరకటిలా దత్తత తీసుకుని వదిలేస్తే మీడియానో, సోషల్ మీడియానో ఏకిపారేసే రోజులు వచ్చాయి. కాబట్టి అందుకు దత్తత విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుని పక్కా ప్రణాళికతో దత్తత తీసుకున్న ప్రముఖులు ముందుకెళ్ళాలి.

అయినా 'ఊరిని దత్తత తీసుకోవడమంటే నిన్ను, వాణ్ణీ, వీణ్ణీ... అందర్నీ దత్తత తీసుకోవడమే' అనే మహేష్‌బాబు డైలాగ్ గుర్తు చేసుకుంటే దీనికి సమాధానం లభిస్తుంది. దత్తత అంటే ఊర్లో రోడ్లు, బోర్లువేసి, మరుగుదొడ్లు, స్కూలు కట్టించడమే కాదు, తాము దత్తత తీసుకున్న గ్రామాల్లో ప్రజలను సంఘటిత పరిచి, చైతన్యవంతుల్ని చేసి గ్రామాభ్యున్నతిలో వారిని భాగస్వామ్యుల్ని చేయడమే కాక ఊరి అభివృద్ధికి ఆఘాతం కల్గిస్తున్న వ్యక్తుల్లో కూడా చైతన్యం తీసుకురావాలి. అందుకు ప్రముఖులు చాలా కష్టపడాల్సి వస్తుంది.

మారిన పరిస్థితులు, గ్లోబలైజేషన్ ద్వారా గ్రామాలు ఉనికిని కోల్పోతున్నాయి. దానివల్ల ప్రమాదం ఏర్పడుతుంది. గడిచిన కొన్నేళ్లుగా అనేక కారణాలతో ఊళ్లకు, ఊళ్లు ఖాళీ అవుతున్నాయి అని గణాంకాలే చెబుతున్నాయి. మౌళిక వసతులు ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో గ్రామజ్యోతిలో భాగమైన 'ఊరిదత్తత' లాంటి కార్యక్రమాలు ఊరి వైభవం తిరిగి నిలబెట్టేందుకు ఉపకరిస్తుంది. పర్యావరణ అభివృద్ధి, మానవహక్కులు పరిరక్షణ, సామాజిక భద్రత, ఆర్థికాభివృద్ధి, స్వపరిపాలన, వ్యక్తిగత ప్రగతి, మహిళాసాధికారత, వంటి కార్యక్రమాల కోసం దత్తత తీసుకున్న వ్యక్తి లేదా సంస్థ ఇదేదో డబ్బుతో నడిచే పథకంగా కాక ప్రజల స్పందన, ప్రాతినిధ్యంతో అమలు చేయాల్సిన పథకంగా గుర్తించాం.

ఈ కార్యక్రమం స్థూలంగా వ్యక్తిగత, మానవీయ, ఆర్థిక, సామాజిక అనే నాలుగు అంశాలపై నడుస్తుందని భావించాలి. వాటిలో వ్యక్తిగత అంటే పారిశుద్ధ్యం, సాంస్కృతిక వారసత్వం అలవాట్లు, ఆలోచనలు తీరులో మార్పు లాంటి పలు అంశాలు తీసుకోవాలి. మానవీయ విభాగంలో విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, సామాజిక భద్రత అంశాలు పరిగణలోనికి తీసుకోవాలి. ఇక ఆర్థిక విభాగంలో జీవనోపాధి, నైపుణ్యాలు, ఆర్థిక సమ్మిళిత ప్రాథమిక సౌకర్యాలు సేవలు ఉంటాయి. అలాగే సామాజిక విభాగంలో స్వచ్ఛంద సేవ, సామాజిక విలువలు, నైతిక సామాజిక న్యాయం సమర్థపాలన పర్యావరణ పరిరక్షణ, సామాజిక భద్రత వంటి పలు అంశాలను ప్రముఖుల పరిగణలోకి తీసుకోవాలి.



వివరాల్లోకి వెళితే మానవాభివృద్ధి విభాగంలో కనీస ఆరోగ్య సౌకర్యాలను అందరికీ అందుబాటులోకి తేవడం అంటే ఆరోగ్య కార్డులు, వైద్యపరీక్షలు, లింగ నిష్పత్తిని సమంగా ఉంచడం. నూరుశాతం ఆసుపత్రి ప్రసవాలు, అందరికీ పౌష్టిక స్థాయిని పెంచడం అంగ వైకల్యంతో ఉన్నవారికి ప్రత్యేక అవసరాలపై శ్రద్ధ వహించడం వంటి వాటికి ప్రాముఖ్యత ఇవ్వాలి.

సామాజిక అభివృద్ధి విషయంలో గ్రామంలో పెద్దలను గౌరవించడం మహిళలను స్థానిక అవసరాల పట్ల చురుకుగా ఉండేలా ప్రోత్సహించడం

సమాజాన్ని హింస, నేరాల నుండి విముక్తి చేసే యత్నాలు అంటే గ్రామశాంతి, సంఘాల స్థాపన వంటి కార్యక్రమాలతోపాటు గ్రామంలో గ్రామక్రీడలు, ఉత్సవాలు, సంబరాలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్ళాలి. ఆర్థిక అభివృద్ధిలో జీవనోపాధి మార్గాలను ప్రోత్సహించాలి యువతకు స్వయం ఉపాధి నైపుణ్యాలు పెంపుకు కృషి చేయాలి.

ముఖ్యంగా పేదరికం నుండి విముక్తం చేసి మహిళ స్వయం సహాయక బృందాలకు ప్రోత్సాహం అందించాలి. పర్యావరణ ప్రోత్సహంలో భాగంగా పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రతి కుటుంబం తప్పనిసరిగా మరుగుదొడ్లను ఏర్పాటు చేసుకునే విధంగా కృషిచేయాలి. అంతేకాక వాటిని సక్రమంగా వినియోగించుకునే విధంగా ప్రజల్ని చైతన్యం చెయ్యాలి. ఘన, ద్రవ, వ్యర్థాల సక్రమ నిర్వహణ వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.




సామాజిక భద్రత అంశంలో పెన్షన్లు అందరికి అందేలా పౌర సరఫరా అందుబాటులో అన్ని కుటుంబాలకు పక్కా ఇళ్లు, పరిశుభ్రమైన త్రాగునీరు విద్యుత్ సౌకర్యాల వంటి సౌకర్యాలన్నీ ప్రధానాంశాలుగా తీసుకోవడంతో పాటు పడడంతోపాటు, విద్యకు నోచుకోక మూఢనమ్మకాల ప్రభావంతో వెనుకబడిన గ్రామాలను దత్తత తీసుకున్న ప్రముఖులు ప్రజలకు అవగాహన కల్పించి, మూఢ నమ్మకాలను పారద్రోలాలి.


అదేవిధంగా ప్రాథమిక విద్యను ఖచ్చితంగా బాలబాలికలకు అందించాలి. కనీస వైద్య సౌకర్యాలను కల్పించాలి. దీనికి ప్రభుత్వ తోడ్పాటు తప్పనిసరిగా ఉండాలి. వ్యవసాయాధారిత రైతాంగానికి చేయూతనిచ్చే సాంకేతిక పరిజ్ఞానాన్ని, వ్యవసాయ మెళుకువలను, సాగునీటి పారుదల కాలువను లేక ప్రత్యామ్నయ పద్ధతులపై వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలతో ప్రజలు అవగాహన కల్పించాలి. వ్యవసాయ పెట్టుబడుల రుణాలను బ్యాంకు అధికారులతో సంప్రదించి సమయానికి ఇప్పించాలి. దీనికి తోడు గ్రామజ్యోతి ద్వారా ప్రజలు తమ సంపూర్ణ భాగస్వామ్యంతో తమ గ్రామాలను తామే అభివృద్ధి పరుచుకునే బాధ్యతను స్వీకరించేటట్లు చేయగలగాలి.

'మంచి జరగాలి-బాగుపడాలి' అన్న భావన ఉన్న ప్రజలను మంచి గాడిన పెట్టడమే నిజమైన దత్తతకు దార్మనిక విధానం. పొద్దున లేవగానే మనం నోరు శుభ్రం చేసుకుంటాం. కానీ, ఊరు శుభ్రత పట్ల పట్టింపు ఉండదు. ఆ పట్టింపు వాళ్లల్లో కలిగించాలి. ఆధునిక మానవ చరిత్రలో ప్రజలకు మార్గదర్శనం చేస్తే ప్రజలు సంఘటిత శక్తిగా ఉద్యమించి పట్టుదలతో తమకు వ్యతిరేకంగా ఉన్న వ్యవస్థలను మార్చుకుంటూ అవసరమైన వ్యవస్థలను నిర్మాణం చేసుకుంటారు. అలా వాళ్ళ మెదళ్ళకు పదునుపెట్టి ఆలోచింపజేయడమే గ్రామజ్యోతి లక్ష్యం.

ఇదంతా ఒక ఎత్తు అయితే నేటి గ్రామజ్యోతి కార్యక్రమంలో భాగమైన గ్రామాల దత్తత అనే అంశానికి అన్యూహస్పందన వస్తుందనే చెప్పాలి. ఇప్పటికే తెలంగాణా రాష్ట్రంలో దాదాపు 2,500 గ్రామాలను పలువురు ప్రముఖులు సామాజిక దృక్పథంతో బాధ్యత నిర్వర్తించడానికి దత్తత తీసుకున్నట్లు అంచనా. వీరిలో సినిహీరో మహేష్‌బాబు కొత్తూరు మండలంలోని సిద్ధాపూర్ గ్రామాన్ని, అదే జిల్లాలోని కేశంపేట మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామాన్ని సినీనటుడు ప్రకాష్‌రాజ్, రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం జుకల్ గ్రామాన్ని తెలంగాణ రాష్ట్ర ఏ.సి.బి డైరెక్టర్ జనరల్ ఎ.కె. ఖాన్, సైబరాబాద్ పోలీస్ కమీషనర్ సి.వి. ఆనంద్ ఖానాపూర్ గ్రామాన్ని ఇలా... రాజకీయ నాయకులు, ఉన్నతస్థాయి అధికారులు, సెలబ్రిటీలు, ఎన్.ఆర్.ఐలు, ఎన్‌జీవోలు, కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, ఉన్నత ఉద్యోగులు ముందుకొచ్చి దత్తత తీసుకుంటూ గ్రామజ్యోతి కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారు.

ఇలా ఇంకొందరు ముందుకొచ్చినా మంచి పనికి శ్రీకారం చుట్టినట్లయితే గ్రామాల పరిస్థితి మారి ఆదర్శవంతమైన గ్రామాలుగా నిలుస్తాయి. గ్రామాల్లో కుట్రలు, పగలు, మాయమై పల్లెల్లో ప్రేమలు వెల్లివిరిస్తాయి. గ్రామాల్లో మంచితనం మార్పు తెచ్చి అభివృద్ధివైపు అడుగులు వేసి 'నేటి గ్రామజ్యోతి రేపటి తెలంగాణ వెలుగు జ్యోతి'గా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహంలేదు.

*- ఎం. ప్రదీప్ కుమార్*
*రీసెర్చ్ అసోసియేట్, టిసిపార్డ్*




# గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్య దిశగా గ్రామపంచాయితీలు

**'భారతదేశాన్ని చూడాలంటే గ్రామాలకు వెళ్ళమన్నాడు' గాంధీ మహాత్ముడు. "కేంద్రంలో ఇరవై మంది కూర్చొని శాసించే పద్ధతి సిసలైన ప్రజాస్వామ్యం కాదు. ప్రతి గ్రామంలోని ప్రజలు దిగువ స్థాయి నుండి నడిపేదే అసలైన ప్రజాస్వామ్యం" అని జాతిపిత మహాత్మా గాంధీ ప్రబోధించారు.**

"ఒకరి అభిప్రాయాన్ని మరొకరు గౌరవించడం, ఒక్కరి కోసం అందరం, అందరి కోసం ఒక్కరు అన్న భావనే ప్రజాస్వామ్యానికి మూల సూత్రం. ప్రజాస్వామ్యం ఒక జీవన విధానం. దానికి కావాలసిన వ్యవస్థల్ని ఏర్పాటు చేసుకోవాలి".

"ప్రతీ గ్రామం సర్వస్వతంత్ర్యంగా నిలబడి, తన ప్రజల అవసరాలను స్వయంగా తీర్చుకోగలిగి, సాధ్యమైన మేరకు ప్రతి కార్యకలాపం సహకార విధానంలో నిర్వహించుకోగలగటమే నా ఉద్దేశ్యంలో గ్రామ స్వరాజ్యం" అని గాంధీజి చెప్పారు.

గ్రామంలోని ప్రతి బాలుడికీ, బాలికకూ విద్యనందించగలగడం, -పారిశుద్ధ్యం - వైద్యావసరాలను తీర్చడం-గ్రామంలోని బావులు, చెరువుల్ని నిరంతరం అభివృద్ధి పరచడం-అస్పృశ్యుల అవసరాలను తీర్చడం, వారిని పైకి తీసుకురావడం - స్థానిక వ్యాజ్యాలను పరిష్కరించడం.

సమాజం విచ్ఛిన్న కులాల, మతాల సంగమం, సామూహిక, సంఘటిత చర్యలు సామాజిక ఐక్యతకు, సంఘ అభివృద్ధికి, దేశాభివృద్ధికి దోహదపడతాయి. పరిపాలనలో, నిర్ణయాల్లో ప్రజల భాగస్వామ్యం కల్పించబడింది.

ఎస్.సి., ఎస్.టి లకు, వెనుకబడిన వర్గాలకు వారి జనాభా ప్రాతిపదికన, మహిళలకు మొత్తం స్థానాల్లో సగం మండల, జిల్లా పరిషత్తుల్లో మైనార్టీల ప్రాతినిధ్యం చట్టబద్ధం చేయబడింది. జిల్లా ప్రణాళికా సంఘాల్లోనూ ఈ వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించబడింది. పంచాయతీ రాజ్ చట్టం-1994 సెక్షన్ 40 లబ్ధిదారుల కమిటీలు, ఫంక్షనల్ కమిటీల ఏర్పాటును చట్టబద్ధం చేసింది.

## గ్రామీణ పారిశుద్ధ్యం - వ్యక్తిగత మరుగుదొడ్లు

ఈనాడు జాతీయ స్థాయిలో పారిశుద్ధ్యం ప్రాధాన్యత పెరిగింది. ఉద్యమ స్ఫూర్తితో, జాతీయ స్థాయిలో గ్రామీణ పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ప్రచారం చేయడం జరుగుతుంది. అంతేకాక 'పరిశుభ్రత భారత నిర్మాణం' దిశగా దేశం అడుగులు వేస్తుంది.

గాంధీజీ చెప్పినట్లు ప్రతి గ్రామం తన అవసరాలు తీర్చుకునే విధంగా వృత్తులు బలపడి, పంటలు, పరిశ్రమలు పరస్పర ఆధారితాలుగా ఎదగాలంటే పంచాయతీలు స్వయం సమృద్ధిగా ఎదగాలి.




దేశ సౌభాగ్యానికి మన దృష్టిని గ్రామ పునరుజ్జీవనం వైపునకు మళ్ళించాలి. గ్రామాలను మూఢనమ్మకాల నుంచి, సంకుచిత దృక్పథాల నుండి విముక్తి చేయాలి. మన గ్రామాలు ఆరోగ్యంతో తొణికిసలాడాలి. శుచి, శుభ్రతతో ఆదర్శ గ్రామాలుగా మార్పు చెందాలి. గ్రామ పునరుజ్జీవనానికి గ్రామం స్వశక్తిపై ఆధారపడి ఉండాలి. గ్రామం స్వయం సమృద్ధి సాధించుకోవాలి. గ్రామానికి సంబంధించిన వ్యవహారాలను గ్రామమే పాలించుకొనే సమర్థత దానికి ఉండాలి. గ్రామ స్వపరిపాలన అహింసా సూత్రాలపై ఆధారపడి ఉండాలి.

గాంధీజీ ఆశించిన గ్రామ స్వరాజ్యం స్వయం సమృద్ధి కలిగి, స్వయం శక్తిపై ఆధారపడి ఉంటుంది. ఈ గ్రామాలు తమ అవసరాలకు కావలసిన వస్తువులను తామే ఉత్పత్తి చేసుకొంటాయి. ఇతర వస్తువులకు ఒక దానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. ప్రతి గ్రామం తనకు కావలసిన ఆహారం, వస్త్రాలను, ఇతర కనీస అవసరాలను తానే ఉత్పత్తి చేసుకొంటుంది. దానికి పశు సంపదతో పాటు పెద్దలకు, పిన్నలకు ఆట స్థలాలు ఏర్పరచాలి. వినోదానికి, విశ్రాంతికి, విద్యకు, తగిన వసతులు కల్పించాలి. ఇంకా సేద్యపు భూమిలో సౌభాగ్యం పెంచే పంటలను వేయాలి.

గ్రామాలు గ్రామస్తులకు కావలసిన మంచి నీటి సరఫరాకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. ఇందుకు ఉపయోగపడే బావులు, చెరువులు పంచాయతీ ఆధీనంలో ఉండాలి. వాటి శుభ్రతకు పంచాయతీ బాధ్యత వహించాలి. గ్రామంలో ప్రాథమిక దశ పూర్తయ్యేవరకు నిర్బంధ విద్య అమలు జరపాలి. ఈ విద్య ఉచితంగా నేర్పాలి. ఈ పనులన్నీ సహకార పద్ధతిపై జరగాలి.

అంటరానితతాన్ని నిషేధించాలి. కుల, మత, వర్గ వైషమ్యాలు నశించాలి. వారిమధ్య సామరస్యం, సహనం, సహకారంపెంపొందించాలి. గ్రామాల్లో కళలు అన్ని దశల్లో అభివృద్ధి చెందుతాయి.

వండితులతోను, గాయకులతోను, కవులతోను, నిపుణత కలిగిన చేతిపనివారితోను స్వయం సమృద్ధి కలిగి స్వశక్తిపై ఆధారపడి, స్వపరిపాలనలో ప్రావీణ్యం గడించి మన గ్రామాలు నూతనోత్సాహంతో, ఆనందంతో పునరుజ్జీవనంతో తొణికిసలాడుతుంటాయి. ఇది గాంధీజీ ఆశించిన గ్రామ స్వరాజ్యం.

మొట్టమొదట పరిష్కరించవలసిన సమస్య గ్రామ పారిశుద్ధ్యం. ఇది అన్ని సమస్యలకన్నా ఎక్కువగా ప్రజలు పట్టించుకోని సమస్య. అది ప్రజలకు అర్థం కాని సమస్య. వారి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. రోగాలను పెంచుతుంది.

73వ రాజ్యాంగ సవరణ గాంధీజీ ఊహలకు, భావనలకు ప్రతి



రూపంగా నిలిచింది. స్వయం ప్రతిపత్తి గల గ్రామ ప్రభుత్వాలు ఏర్పడటానికి ఇది దోహదపడింది. అధికార వికేంద్రీకరణకు, పరిపాలన, నిర్ణయాధికారం ప్రజల చేతికి రావటానికి బాటలు వేసింది. భారత రాజ్యాంగ రూపకల్పన దశలోనే పంచాయతీ రాజ్ సంస్థలకు స్వయం ప్రతిపత్తి కల్గించాలని గాంధీజీ చెప్పారు.

స్థానిక సంస్థలు ప్రజలకు సేవలందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏజెన్సీలుగా కాక, ప్రజల భాగస్వామ్యాలతో నడిచే స్థానిక ప్రభుత్వాలుగా, గాంధీజీ ఆశించిన గ్రామ స్వరాజ్యాలుగా రూపొందాలి.

## గ్రామ స్వరాజ్య దిశగా తెలంగాణ గ్రామ పంచాయతీలు

నూతనంగా ఏర్పడిన మన తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుంది. అక్రమాలకు తావివ్వకుండా అర్హులైన నిరుపేదలకు సాయమందించే దిశగా ముందుకు సాగుతుంది. పేద ప్రజలను అభివృద్ధి పరచాలనే ఉద్దేశ్యంతో పలు సంక్షేమ పథకాలను రూపొందించి అమలు పరుస్తుంది. వాటిలో ముఖ్యంగా ప్రతి పేదవాడి మొహంలో చిరునవ్వు చూడాలని గతం కన్నా భిన్నంగా వినూత్నంగా, ఉపయుక్తంగా ఉండే ఆసరా సామాజిక భద్రత పించన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో వృద్ధులు, వితంతువులు, వికలాంగుల, చేనేత, గీత కార్మికులు, బీడీ కార్మికుల పింఛనుదారులకిచ్చే మొత్తాన్ని భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

అభివృద్ధిలో భాగంగా షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగలకు చెందిన యువతుల పెళ్లి అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా పెళ్ళి ఖర్చుల నిమిత్తం రూ. 51 వేలను ప్రభుత్వం నేరుగా యువతుల కుటుంబాలకు అందిస్తుంది. అదేవిధంగా పేద ముస్లింల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా 'షాదీ ముబారక్' పథకాన్ని ప్రారంభించింది.

ప్రతి ఇంటింటికి పైపుల ద్వారా మంచినీరు అందించే లక్ష్యంతో వాటర్‌గ్రిడ్ పథకాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ పథకం ద్వారా ప్రతి ఇంటికి పైపుల ద్వారా మంచినీరు అందించడానికి ప్రభుత్వం పూనుకుంది.

అదేవిధంగా తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడానికి ప్రభుత్వం హరితహారం పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా విరివిగా చెట్లను పెంచి, తద్వారా పచ్చదనాన్ని పెంచి వాతావరణ సమతుల్యం సాధించడం ప్రభుత్వ ధ్యేయం. తద్వారా అడవులు పెంచాలని ప్రభుత్వం భావిస్తుంది.

గ్రామాల్లో సాగునీరు, త్రాగునీరు కొరత తీర్చేందుకు మిషన్ కాకతీయ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా గ్రామాల్లో పాడుబడిన మరియు పూడికతో నిండిన చెరువులను పునరుద్ధరించి వాటిని వాడుకలోకి తెచ్చి, వాటి ద్వారా గ్రామాలను సస్యశ్యామలం చేయాలని ప్రభుత్వం దృఢనిశ్చయంతో ఉంది.

సమగ్ర కుటుంబ సర్వే పేరుతో నూతన రాష్ట్రంలో నూతన ప్రభుత్వం

బంగారు తెలంగాణ లక్ష్యంగా తొలి అడుగు వేసి రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు సంబంధించి ఒకే ఒక పటిష్టమైన గణాంక సమాచార నిధిని తయారు చేసింది. దీని ద్వారా అర్హత కలిగిన లబ్ధిదారులను గుర్తించి వారి వ్యక్తిగత అవసరాలను లక్ష్యంగా సమర్థవంతమైన అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడానికి వీలుపడుతుంది.

గ్రామప్రజలు తమ ఊరిని అభివృద్ధి చేసుకునే క్రమంలో సమస్యలను సరిగా అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి సరైన ప్రణాళికలు రూపొందించుకోవడం లక్ష్యంగా మన ఊరు-మన ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది.

ప్రముఖ నగరాల్లో ఒకటైన హైదరాబాద్‌ను అందమైన, స్వచ్ఛమైన నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో స్వచ్ఛ తెలంగాణ-స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమం చేపట్టింది.

రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత పేదరికంలో మగ్గుతున్న ఎంపిక చేయబడిన 150 మండలాల్లో 5 సంవత్సరాల పాటు నిరుపేదల జీవనాభివృద్ధి పెంపొందించడం కోసం తెలంగాణ పల్లె ప్రగతి పథకం ప్రారంభించింది.

రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మరుగుదొడ్ల నిర్మాణమే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్రాన్ని బహిరంగంగా మలవిసర్జన లేని రాష్ట్రంగా మార్చేందుకు తెలంగాణలో స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

అదేవిధంగా హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు, మధ్యాహ్న భోజనం పథకం లబ్ధిపొందుతున్న విద్యార్థులకు పుష్టికరమైన మంచి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం సన్నబియ్యం పథకం ప్రవేశపెట్టింది. అదేవిధంగా కుటుంబంలో ఎంతమంది సభ్యులు ఉన్నప్పటికీ ప్రతి మనిషికి 6 కిలోలు బియ్యం సరఫరా చేసేందుకు మనిషి 6 కిలోల బియ్యం పథకం ప్రవేశపెట్టింది.

ఆరోగ్యలక్ష్మి కార్యక్రమం ద్వారా గర్భిణులు, బిడ్డకు పాలిస్తున్న తల్లి (బాలింత) లకు పౌష్టికాహారం సమకూర్చుతుంది. 'తెలంగాణ స్టేట్ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ విమెన్' సంస్థ స్థాపించి రాష్ట్రంలోని ఉన్న మహిళలు, బాలికల కోసం రక్షణ, భద్రత, సంరక్షణ నిమిత్తమై కృషి చేస్తుంది.

దేశంలో ఉన్న ఏ రాష్ట్రానికైనా నాణ్యమైన విత్తనాలను తెలంగాణ రాష్ట్రం నుండి ఉత్పత్తి చేసే ఉద్దేశ్యంతో 'విత్తన బాండాగారం' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది.

సామాజిక అసమానతలను రూపుమాపి, సాధికారతను కల్పించే ఉద్దేశ్యంతో నిరుపేద, దళిత వ్యవసాయధారిత కుటుంబాలను మూడు ఎకరాల అసాములుగా చేయడం కోసం ప్రభుత్వం భూమి కొనుగోలు పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమం ద్వారా భూమిలేని నిరుపేద దళిత వ్యవసాయాధారిత కుటుంబాలకు మూడు ఎకరాల భూమి పంపిణీ చేస్తారు. ఈ పథకాల క్రింద మహిళా లబ్ధిదారుల పేరిట పట్టాను రూపొందించి భూములను రిజిస్ట్రేషన్ చేస్తుంది ప్రభుత్వం.

పల్లె సమగ్ర సేవాకేంద్రాలు ద్వారా తెలంగాణా రాష్ట్రంలోని గ్రామాలలో ఉన్న పౌరులందరికీ వారి ముంగిటిలో ఆర్థికమైన మరియు పౌర సేవలను ఒకే చోట అందించనుంది.

అదేవిధంగా అర్హులైన పేదవారికి సబ్సిడీ ఆహార ధాన్యాలు, నిత్యావసర సరుకులు అందించే లక్ష్యంగా ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడం.

అంతేకాక పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళను 550 చదరపు అడుగులు స్థలంలో ప్రభుత్వమే రెండు గదుల ఇళ్ళను కట్టించేందుకు ప్రణాళికలు రూపొందించడం జరుగుతుంది.

అదేవిధంగా నిరాశ్రయులకు, నిరుపేదలకు పట్టెడన్నం పెట్టడానికి జి.హెచ్.యం.సి. ద్వారా ప్రభుత్వం వినూత్న పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా 5 రూపాయలకే భోజనం అందిస్తుంది.

గ్రామ సభయే గ్రామ స్థాయిలో అత్యున్నత ఉన్నత స్థాయి పార్లమెంటు లాంటిది. దానికి పూర్తి బాధ్యతలు కట్టబెట్టడం ద్వారా పంచాయితీలు బలోపేతం అయ్యి గ్రామ స్వరాజ్యం వస్తుంది అనే గాంధీజీ మాటలు పరిగణలోకి తీసుకుని గ్రామజ్యోతి లాంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

ఈ కార్యక్రమం ద్వారా గ్రామ పంచాయితీలకు అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకతతో అమలు పంచే బాధ్యతను అప్పజెప్పేందుకు ఉద్దేశించిన కార్యక్రమమే గ్రామజ్యోతి.

ఇలాంటి పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతూ, గాంధీజీ కలగనే గ్రామ స్వరాజ్యం గ్రామాల్లో తీసుకొచ్చేందుకు పలు విధాలుగా ప్రభుత్వం కృషి చేస్తుంది.

*- **కె. యాదయ్య,** సంయుక్త సంచాలకులు (పరిపాలన), టి.సిపార్డ్*



# 'ఇబ్రహీంపూర్' ఆదర్శ గ్రామ పంచాయతీ

మెదక్ జిల్లాలోని సిద్ధిపేట మండలంలో 25కి.మీ దూరంలో గల ఒక మారుమూల గ్రామపంచాయతీ ఇబ్రహీంపూర్. ఈ గ్రామంలో అన్ని గ్రామాల్లో ఉన్న సమస్యల కంటే ఎక్కువ సమస్యలే ఉండేవి. అవి మరుగుదొడ్లు లేకపోవడం, మురుగుకాలువలు లేకపోవడం, ప్రజలు బహిరంగ మలవిసర్జన చేయటం, గ్రామస్తులు వాడిన ఇండ్ల నుండి  వచ్చిన మురికి నీరు రోడ్లపైకి వచ్చి బురదగా మారి దోమలకు నిలయాలుగా ఉండేవి.. దీనితో ఆ గ్రామంలో తరచుగా పిల్లలు మరియు పెద్దలు రోగాల బారిన పడుతూ అసుపత్రుల చూట్టు తిరిగి ఆర్థికంగా కృంగిపోవుచుండేవారు.

### విజ్ఞాన యాత్ర

ఇబ్రహీంపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీమతి యాదమ్మ మరియు మండల పరిషత్తు అభివృద్ధి అధికారి శ్రీ సమ్మిరెడ్డి జిల్లా పంచాయతీ అధికారి శ్రీ సి. సురేష్‌బాబు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో గల తుంబుర్నీ అనే ఆదర్శ గ్రామపంచాయతీని 2015 మే లో సందర్శించారు.

ఈ గ్రామపంచాయతీ ఇంకుడు గుంతల ద్వారా దోమలు లేని గ్రామపంచాయతీగా పరిశుభ్రంగా ఉన్న గ్రామ పంచాయతీగా  ఉందని గమనించారు.



సర్పంచ్‌గారి కుమారుడు శ్రీ ఎల్లారెడ్డి ఆ గ్రామాభివృద్ధిని తుంబుర్నీ గ్రామపంచాయతీ కంటే మంచిగా తీర్చిదిద్దాలని అప్పుడే మనసులో అనుకున్నారు. తమ గ్రామంలో ఉన్న సమస్యలు ఆయన మనసులో మెదిలాయి.


నీటి సమస్య పరిష్కారానికి 'తుంబుర్నీ' విధానం

'మ్యాజిక్ ఫిట్'.. మురుగు ఫట్

ఇంటింటికీ ఇంకుడు గుంతలు

ఇబ్రహీంపూర్ బృహత్తర అడుగు

ఇబ్రహీంపూర్‌ను సందర్శించిన సర్పంచులు

## సమస్యలు

- మురుగుకాలువలు లేవు
- ఇంటింటికి మరుగుదొడ్లు లేవు
- రోడ్లు బురదమయంగా ఉన్నాయి
- బహిరంగ మలవిసర్జన ఉంది
- ప్రజలు డెంగ్యూ, మలేరియా, కలరా వంటి రోగాలతో బాధపడుచున్నారు

పై సమస్యలను పరిష్కరించాలని శ్రీ ఎల్లారెడ్డి నిర్ణయించారు. వెంటనే మండల పరిషత్తు అభివృద్ధి అధికారి శ్రీ సమ్మిరెడ్డితో మరియు జిల్లా పంచాయతీ అధికారి శ్రీ సి.సురేష్‌బాబుతో సంప్రదించి ఇబ్రహీంపూర్ గ్రామంలో వాడ వాడలా తిరిగి సమస్యలను గుర్తించినారు.

## అభివృద్ధికి బాటలు

మొట్టమొదటిగా మినీవాటర్ ట్యాంకు చుట్టూ గుంతలు, మురికి నీరు, చెట్లు, గడ్డి మొదలైన వాటితో అపరిశుభ్రంగా ఉండి దోమలు అనేకంగా ఉండటం చూసి అక్కడ అధికారులు మండల పరిషత్తు అభివృద్ధి అధికారి, జిల్లా పంచాయతీ అధికారి మరియు శ్రీ ఎల్లారెడ్డి అక్కడ 6x6x6 కొలతలతో గల ఒక పెద్ద గుంత తీసి అందులో సగం వరకు కంకర నింపి ఒక సిమెంట్ కుండీనిపెట్టి ఇసుకమట్టితో నింపి కుండీని ఓపెన్‌గా పెట్టి మూసేశారు.

## గ్రామస్థుల పరిశీలన

గ్రామంలోని ఈ మినీ వాటర్‌ట్యాంక్ వద్ద బురద ఉండేది. దోమలతో నిండి ఉండేది. ఈ ఇంకుడు గుంత కట్టిన తరువాత మురికి నీరు మరియు బురదలేదు. ఈ విధానం చాలా బాగుందని ప్రజల మనస్సులో ఆలోచన వచ్చింది.



## ఆలోచన సరళిలో మార్పు

గ్రామంలోని ప్రజలు సర్పంచ్ గారి వద్దకు వచ్చి చేతి పంపుల వద్ద, మినీ ట్యాంకుల వద్ద, ఓహెచ్ఎస్ఆర్ వద్ద గ్రామస్తులు శ్రమదానంతో సాక్ పిట్ నిర్మాణం చేశారు.

## గ్రామసభ సమావేశం

గ్రామపంచాయితీ గౌరవ సర్పంచ్ మండల పరిషత్తు అభివృద్ధి అధికారి శ్రీ సమ్మిరెడ్డి గారు, గ్రామ పంచాయతీ వాలంటీరు ఎల్లారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీ సి.సురేష్‌బాబు నిర్వహించిన గ్రామసభ సమావేశంలో గ్రామస్థులందరూ ఇంటింటికి మ్యాజిక్ సోక్ పిట్స్ నిర్మించుకుంటామని తీర్మానించుకున్నారు.

ఒక్కొక్క మ్యాజిక్ సోక్‌పిట్స్‌కు పొడవు,

వెడల్పు, లోతు (5x5x6) ఖర్చు రూ.4500.00 అవుతుంది. మొత్తం సోక్‌పిట్స్ 241 కాగా ఇందుకు అయ్యే మొత్తం వ్యయం రూ.10,84,500.00 అవుతుందని, సామూహిక ఇంకుడు గుంతలకు పొడవు, వెడల్పు, లోతు (6x6x6) రూ.7,000.00 ఖర్చు అవుతుందని అంచనాలు వేశారు.

గ్రామసభలో గ్రామస్తులతో తీసుకున్న నిర్ణయాన్ని భారీనీటి పారుదల శాఖామంత్రి శ్రీ హరీష్‌రావుతో కలిసి పై విషయాన్ని విన్నవించారు. మంత్రి విన్నపాన్ని మన్నించి సానుకూలంగా స్పందించి వారు చేస్తున్న మంచి పనికి ఆయన సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.

ఈ గ్రామంలో జూన్, జూలైల్లో మొత్తం గ్రామస్తులు ఎవరింటి దగ్గర వారు మ్యాజిక్ పిట్స్ నిర్మించుకున్నారు.



## రాష్ట్రానికే ఆదర్శ గ్రామం

ఒక్కొక్క ఇంటికి మ్యాజిక్ పిట్స్ నిర్మించుకోటానికి అయ్యే ఖర్చును పొడవు, వెడల్పు, లోతు (5x5x6) రూ. 4500.00 అవుతుందని అంచనాలతో ప్రభుత్వానికి సమర్పించగా, ఈ గ్రామం చేపట్టిన ఆదర్శవంతమైన అంచనాలను తీసుకొని ప్రస్తుతం ఉపాధి హామీ పథకం ద్వారా ఈ మ్యాజిక్ పిట్స్‌కు అయ్యే ఖర్చును ఈజిఎస్ ద్వారా రూ. 4458.00 లు జనరేట్ చేస్తున్నారు.

## ఇబ్రహీంపూర్ గ్రామం వివరాలు

| | |
|---|---|
| మొత్తం ఇండ్లు :241 | మొత్తం జనాభా :1119 |
| మొత్తం పురుషులు:544 | మొత్తం స్త్రీలు :575 |
| షె.కు. :122 షె.తె., :0 | |
| వెనుకబడిన తరగతులు :703 | ఒ.సి.లు :294 |

## సందర్శించిన వారు

***అధికారులు:*** శ్రీ రోనాల్డ్ రోస్, జిల్లా కలెక్టర్, శ్రీ సి.సురేష్ బాబు, జిల్లా పంచాయతీ అధికారి, శ్రీ ఒ.జె. మధు, ముఖ్య కార్యనిర్వహణాధికారి, జిల్లా ప్రజా పరిషత్తు మెదక్, జిల్లాలోని మండల పరిషత్తు అభివృద్ధి అధికారులు సందర్శించి సాయంత్రం 8 గంటల వరకు ఉండి దోమలు ఏమైనా ఉన్నాయా అని పరిశీలించగా, అప్పటి వరకు ఒక్క దోమ కూడా కనపడలేదని ప్రశంసించారు. ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని మెదక్ జిల్లాలో చాలా గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

*మంత్రులు:* శ్రీ హరీష్‌రావు, భారీనీటి పారుదల శాఖామంత్రి; శ్రీమతి పద్మా దేవేందర్‌రెడ్డి, శాసన సభ ఉపసభాపతి; శ్రీ కొత్త ప్రభాకర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు; శ్రీమతి గొంగళి సునీత, ప్రభుత్వ విప్; శ్రీ శేఖర్ రెడ్డి, భువనగిరి శాసన సభ సభ్యులు; శ్రీ కర్నె ప్రభాకర్‌రెడ్డి, శాసన మండలి సభ్యులు.

*రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల సందర్శన:* శ్రీ రేమండ్ పీటర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, పంచాయతీరాజ్ మరియు గ్రామాభివృద్ధి, శ్రీ రామారావు, ఉప కమీషనర్, పంచాయతీరాజ్ మరియు గ్రామాభివృద్ధి.

***ఇతర జిల్లాల వారు:***

| | |
|---|---|
| కరీంనగర్ | : పిడి, డ్వామా, పిడి డిఆర్‌డిఎ |
| నల్గొండ | : పిడి, డ్వామా, సర్పంచులు |
| వరంగల్ | : బాలవికాస్ స్వచ్ఛంద సంస్థ |
| నిజామాబాద్ | : మం.ప.అ. అధికారులు, సర్పంచులు |

ఎన్ఐఆర్‌డి డైరెక్టర్, ఎన్ఐఆర్‌డి ప్రొఫెసర్ శ్రీమతి జయలక్ష్మి

## ప్రజలలో మార్పు

గ్రామస్తులందరూ భాగస్వామ్యంతో చేసిన పనికి సరైన దృక్పథంలో గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవుతున్నారు. ప్రస్తుతం మురికి కాలువలు ఎండిపోయాయి. మురికినీరు అనేదే లేదు. పిచ్చిమొక్కలు లేవు. గ్రామంలో ఎటుచూసిన పరిశుభ్రంగా కనపడుతుంది.

100 శాతం మరుగుదొడ్ల నిర్మాణం

100 శాతం సోక్‌పిట్స్ నిర్మాణం

100 శాతం టాక్స్ కలెక్షన్, 0 శాతం ఐఎంఆర్

40000 మొక్కలు నాటిన గ్రామం

వాడలో ఒక మురికి కాలువను మూసివేసి అందులో హెచ్.ఎం.డి.ఏ ద్వారా 7000 పూల మొక్కలు నాటి ఈ గ్రామాన్ని నందన వనంగా తీర్చిదిద్దుకుంటున్నారు.

*– జి. భాగయ్య, డిటీయం, మెదక్‌జిల్లా*

# గ్రామ జ్యోతి స్ఫూర్తితో గుడుంబాను తరిమికొడుతున్న వరంగల్ జిల్లా

**జిల్లాలో దాదాపు అన్ని గ్రామాల్లో గుడుంబా బారిన పడి కుటుంబ సభ్యులను పోగొట్టుకున్నవారున్నారు. మనసు బాగోలేకో, ఇతర ఇబ్బందులో కారణం ఏదైనా గుడుంబాకు అలవాటుపడి ప్రాణాలు కోల్పోయిన వారు వేల సంఖ్యల్లో వున్నారు. ఒక స్వచ్ఛంద సంస్థ వరంగల్ జిల్లాల్లో ఉన్న వితంతువులతో నిర్వహించిన సర్వేలో 70% మంది గుడుంబా కారణాల వల్లే భర్తలను పోగొట్టుకున్నట్టు తేలింది.**

గ్రామాల్లో గుడుంబా అందుబాటులో ఉండటం వల్ల, ధర కూడా తక్కువ వుండటం దాని నిషా ఎక్కువగా ఉండటం వల్ల చాలా మంది బానిసలయ్యారు. గుడుంబా అందుబాటులో లేని గ్రామాల్లో తగాదాలు, మరణాల సంఖ్య తక్కువగా ఉంది. గుడుంబా అమ్మే గ్రామాల్లో మరణాల తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు సర్వేలో తేలింది. ఆ మరణానంతరం కుటుంబాల ఆర్థిక పరిస్థితులు క్షీణించడం, పిల్లలను కూడా బడి మాన్పించడం, భర్తలను కోల్పోయిన భార్యలు ఇతరులతో సంబంధాలను పెట్టుకోవడం హెచ్.ఐ.వి., ఎయిడ్స్ లాంటి వ్యాధులకు గురవుతున్నారు.

జిల్లాలో 15 ఏండ్లు దాటిన యువత కూడా గుడుంబాకు అలవాటు పడుతున్నారు. కొన్ని చోట్ల ఇండ్లల్లో పెద్దవారు తాగుతుండడం చూసి పాఠశాల వయసులోనే తాగుడుకు అలవాటు పడే పిల్లలు జిల్లాలో ఉన్నారు. ఇలా 30, 40 ఏళ్లలోపు యువత పెద్దసంఖ్యలో త్రాగుడుకు బానిసై మృత్యువాత పడినట్టు ఆధారాలు ఉన్నాయి.

మొదట్లో ఒక గ్లాసు అంటారు. అది స్నేహితులతో కలిశాక రెండు గ్లాసులవుతుంది. అలా అలవాటయి ఐదు, ఆరు గ్లాసులకు వెళుతుంది. ఆ తరువాత గ్లాసుడు గుడుంబా లేనిదే రోజు గడవదనిపిస్తుంది. ఇలా వినాశానికి దారులు తెరుచుకొని ఆరోగ్యాలు పాడు చేసుకొని ప్రాణాలు వదిలిన కుటుంబాలు జిల్లాలో కోకొల్లలుగా ఉన్నాయి.

వంశ పారంపర్యంగా గుడుంబా మరణాలు సంభవిస్తున్నాయి. తీరా త్రాగుడు వల్ల వారు సాధించిందేమని ఆలోచిస్తే, కుటుంబాలను అనాధగా చేసి వీధిన పడేయటం తప్ప మిగిలింది ఏమి లేదు. భార్య వితంతువు అవడం, ఆర్థిక ఇబ్బందులతో ఇల్లు గడవకపోవడంతో పిల్లలు బడులు మానేయడం, జీతగాళ్ళుగా జీవితాలను ప్రారంభించడం పరిపాటిగా వస్తుంది. ఏ గ్రామానికి వెళ్ళినా గుడుంబా త్రాగి చనిపోయినవారి కుటుంబాలే తారసపడుతుంటాయి. వారి గాథ వింటే కన్నీళ్ళే వస్తుంటాయి.



ఆయా గ్రామాల్లో, తండాల్లో విక్రయదారులు పంటపొలాల్లో బట్టీలను ఏర్పాటు చేసి పెద్ద పెద్ద డ్రమ్ములను భూమిలో పాతిపెట్టి అందులో బెల్లం పానకాన్ని తయారుచేసి తదుపరి బట్టి మీద పెట్టి గుడుంబాగా తయారుచేస్తారు.






తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన గ్రామజ్యోతి కార్యక్రమం విజయవంతం కావాలన్నా, గ్రామాలు సర్వతోముఖాభివృద్ధి సాధించాలన్నా, ప్రజలు సామరస్యంగా జీవితాలు గడపాలన్నా గ్రామాలలో విలయ తాండవం చేస్తున్న సామాజిక రుగ్మత అయిన గుడుంబా తయారీ, వాడకాన్ని నిషేధించాలని వరంగల్ జిల్లా యంత్రాంగం జిల్లా కలెక్టర్ శ్రీ వాకాటి కరుణ గారి ఆధ్వర్యంలో గ్రామజ్యోతి కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో 7 కార్యాచరణ కమిటీలతో పాటు, గుడుంబా నిషేధ కమిటీ కూడా ప్రతి గ్రామంలో వేయడం జరిగింది.

గ్రామంలో ఏ సమావేశం నిర్వహించినా గుడుంబా తాగినవారు వచ్చి సమావేశం సజావుగా సాగకుండా అడ్డుపడుతున్న సందర్భంలో ప్రజలు కూడా గ్రామాల్లో మొదట గుడుంబాను నిషేధించాలని ఉత్సాహం చూపించడం జరిగింది. ఈ స్పందన ప్రతిగ్రామంలో రావడంతో ప్రతి గ్రామ పంచాయతీ స్థాయిలో గుడుంబా నిషేధ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది.

గుడుంబాను పూర్తిస్థాయిల్లో నిషేధించాలంటే దీర్ఘకాలిక ప్రణాళికను ఏర్పాటు చేయడం జరిగింది. ఇందుకుగాను గ్రామాలవారీగా ప్రణాళికను తయారుచేసి, ఒక టోల్ ఫ్రీ నెంబరును అందుబాటులోకి తేవడం జరిగింది. అంతేగాక గ్రామాలను పోలీసుశాఖ మరియు ఎక్సైజ్ శాఖ వారు కూడా దత్తత తీసుకోవడం జరిగింది.

గతంలో ఎక్సైజ్ శాఖ వారు దాడులు చేసి కేసులు పెడితే, రాజకీయ నేతలు ఫోన్లు చేసి వదిలిపెట్టమని చెప్పేవారు. కాని నేడు దానికి విరుద్ధంగా ఇప్పుడు అందరు ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తున్నారు.

ఏ గ్రామానికి వెళ్ళినా మొదట గుడుంబాను సేవించడం వలన కలిగే అనర్థాలను గురించి వివరించి గుడుంబాను నిషేధించినట్లయితే కలిగే ప్రయోజనాలను తెలియజేయడం జరుగుతుంది.

కొన్ని గ్రామాలలోని గుడుంబా తయారుదారులు వారంతట వారు వచ్చి "మేము గుడుంబాను తయారు చేసే సంస్కృతిని వదులుకుంటాం. మాకు ఉపాధిని కల్పించండి" అని జిల్లా అధికారులను అడుగుతున్నారు. వారికి ప్రభుత్వ పథకాలను వర్తింపచేస్తున్నారు.

కొన్ని గ్రామాల్లో మహిళా సర్పంచ్‌లు, యువ సర్పంచ్‌లు ఉత్సాహంగా ముందుకు వచ్చి వారి గ్రామాన్ని గుడుంబా నిషేధ గ్రామంగా తయారు చేయాలని ఉద్దేశ్యంతో ఎవరైనా గుడుంబా తయారుదారులు గాని, తాగేవారు గాని మీరు వదలివేయకుంటే ప్రభుత్వ పథకాలను వర్తింపచేయమని కూడా భయపెడుతున్నారు.

నేటికి 294 గ్రామాల్లో 100 శాతం గుడుంబాను నిషేధించడం జరిగింది. కొన్ని గ్రామాల్లో 50% మరికొన్ని గ్రామాలలో 70% గుడుంబా క్రయ విక్రయాలు తగ్గాయి. రానున్న అతికొద్ది కాలంలో అన్ని గ్రామాల్లో గుడుంబా నిషేధం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ యంత్రాంగం, యువ సర్పంచ్‌లు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు, ప్రజలు సంఘటిత శక్తిగా పాల్గొన్నారు.

గుడుంబాను వదలివేసిన గ్రామాలు ప్రశాంతంగా ఉన్నాయని గ్రామస్థులు తెలియజేస్తున్నారు. అన్ని గ్రామాలలో 100% గుడుంబా నిషేధం పట్టు సడలకుండా ఉండేందుకుగాను క్రమం తప్పకుండా గ్రామ ప్రజలతో సమీక్షలు నిర్వహించడం గ్రామకమిటీ, ఎక్సైజ్ మరియు పోలీసుశాఖల మధ్య సమన్వయాన్ని ఏర్పాటు చేసి గ్రామంలో పూర్తిస్థాయి శాశ్వత గుడుంబా నిషేధం కొనసాగే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుంది.

# వరంగల్ జిల్లా లక్నెపల్లిలో గ్రామజ్యోతి

ఆగస్టు 17 నుండి 23వ తేదీ వరకు వరంగల్ జిల్లా లక్నెపల్లి గ్రామంలో గ్రామజ్యోతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ గ్రామజ్యోతి కార్యక్రమం సందర్భంగా ఫంక్షనల్ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగింది.

### కమీటీల వివరాలు

1. పారిశుద్ధ్యం - త్రాగునీటి కమిటీ
2. ఆరోగ్యం పోషకాహారంపై పై కార్యచరణ కమిటీ
3. విద్యా కమిటీ



4. సామాజిక భద్రత పేదరిక నిర్మూలన
5. సహజ వనరుల నిర్వహన కమిటీ
6. వ్యవసాయం
7. మౌళిక సదుపాయల కమిటీ
8. గుడుంబా నిర్మూలన కమిటీ

**1. పారిశుద్ధ్యం- త్రాగునీటి కమిటీ:** ఈ కమిటీలో పాలన సౌలభ్యం కోసం, గ్రామ అభివృద్ధి కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారిని అన్ని వర్గాల వారికి ప్రాధాన్యత ఇస్తూ అన్ని హబిటేషన్లు కవరయ్యే విధంగా ఈ కమిటీ వేయడం జరిగింది. ఈ నూతన విధానంతో సర్పంచ్, వార్డు సభ్యులు కాకుండా మరియు కమిటీ సభ్యులను గ్రామానికి కావలసిన నీటి లభ్యతను బట్టి నీటి సరఫరా ఏ విధంగా అందించాలని నాణ్యతతో కూడిన నీటిని అందించేటట్లు లీకేజీలు లేకుండా గుర్తించి వెంటనే పనులను వేగవంతం చేయటానికి జవాబుదారితనంతో గుర్తించిన పనులను గ్రామసభ ముందు పెట్టి పనులు చేయడం వలన ప్రజల భాగస్వామ్యంతో చేసే విధానం పాలన పరంగా బాగుంటుంది.

**2. ఆరోగ్యం పోషకాహారంపై కార్యాచరణ కమిటీ :** ఈ కమిటీ వేయడం వలన సర్పంచ్, గ్రామాభ్యుదయ అధికారి, ఎఎన్ఎం, ఆశ వర్కర్లతో, డ్వాక్రా మహిళలతో అందరి భాగస్వామ్యంతో కమిటీ వేయడం జరిగింది. గర్భిణీలకు, బాలింతలకు పోషకాహారం తీసుకోవాలని కమిటీ సూచించడం జరిగింది.

18 సంవత్సరాల అమ్మాయి , 21 సంవత్సరాల అబ్బాయి వయస్సు వారికి మాత్రమే వివాహం చేయాలని ఈ కమిటీ ద్వారా చైతన్య పరుస్తూ, పరిసరాల పరిశుభ్రతతో పాటు నీటి ద్వారా వచ్చే వ్యాధులను ఏ విధంగా వస్తాయో సూచించటం జరిగింది. కాచిన నీటిని త్రాగాలని, ప్రసవం సమయంలో 108 సహాయంలో దవాఖాన ప్రసవించే విధంగా సూచిస్తూ ప్రభుత్వం నుండి ప్రభుత్వ దవాఖానాల ద్వారా అందించే సేవలను వినియోగించుకొనే విధంగా కమిటీ సూచించడం జరిగింది.

**3. విద్యా కమిటీ :** ఈ కమిటీలో సర్పంచ్, గ్రామాభ్యుదయం అధికారి, హెచ్.ఎం, ఎన్.జి.ఓస్, విద్యార్థుల తల్లిదండ్రులతో, ఉత్సాహవంతులతో ఈ కమిటీ వేయడం జరిగింది. ఈ కమిటీ వేయడం వలన మధ్యాహ్న భోజన పథకం పకడ్బందిగా అమలయ్యే విధంగా, ఉపాధ్యాయులు సకాలంలో హాజరయ్యే విధంగా నాణ్యతతో విద్య అందించే కోసం ఈ కమిటీ ముఖ్యపాత్ర పోషించడం జరిగింది.



ఈ కమిటీ వేయడం వలన పేద వర్గాల వారికి నాణ్యతతో కూడిన విద్యను అందించే విధంగా దోహదపడుతుంది.

పాఠశాలకు కావలసిన వసతులను, నీటి సౌకర్యాన్ని, టాయిలెట్లను ఈ కమిటీ ద్వారా గుర్తించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించే విధంగా నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. దీనితో పాటు బడి ఈడు పిల్లలు బడి బయట ఉండకుండా బడిలో చేర్పించడం జరిగింది. అక్షరాస్యత పెంచడం కోసం విద్య వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తూ డ్వాక్రా మహిళలకు సాక్షర భారత ద్వారా విద్యను అందించే విధంగా చైతన్య పర్చడం జరిగింది.

**4. సామాజిక భద్రత పేదరిక నిర్మూలన :** ఈ కమిటీలో సర్పంచ్, గ్రామాభ్యుదయ అధికారి, వి.ఓ. అధ్యక్షురాలు, గ్రామంలో ఉన్న డ్వాక్రా మహిళలను ఈ కమిటీలో వేయడం జరిగింది. ఈ కమిటీ గుర్తించిన పనులను గ్రామసభ ఆమోదంతో 150 రోజులు ప్రతి కుటుంబానికి పనులు కల్పించే విధంగా ఈ కమిటీ వేయడం వలన వేగవంతగా పనులు గుర్తించడం వలన వలసలను నివారించడం జరిగింది. డి.ఆర్.డి.ఏ ద్వారా ప్రభుత్వం నుండి వచ్చే పథకాలను పేద ఎస్.సి, ఎస్.టి. యువతి, యువకులకు మహిళలకు, మైనార్టీ వికలాంగులకు సబ్సిడీ లోన్లు అందించే విధంగా ఈ కమిటీ ప్రోత్సహించడం జరిగింది.

**5. సహజ వనరుల నిర్వహణ కమీటి:** ఈ కమిటీ వేయడం వలన ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టవలసిన పనులను గుర్తించి, గ్రామ పంచాయితీ పరిధిలో భూమి లేని నిరుపేద కుటుంబాలకు వేతన ఉపాధి కల్పించటానికి అవసరమైన పనులను గుర్తించడం జరిగింది. భూగర్భ జలాలను పెంచేందుకు ఇంకుడు గుంతలు ప్రతి ఇంట్లో తీసుకోవడానికి ప్రోత్సహించడం జరిగింది.

**6. వ్యవసాయం:** ఈ కమిటీ వేయడం వలన గ్రామంలో రైతులకు ప్రభుత్వం నుండి వచ్చే సబ్సిడి పై ఈ కమిటీ అవగాహన కల్పిస్తూ రైతులకు వచ్చే సబ్సిడిపై పనిముట్లు, ఎరువులు, తెచ్చుకోవాలని ఈ కమిటీ ప్రోత్సహిస్తున్నది. అలాగే రైతులు భూసార పరీక్షలు చేయించి నూతన వ్యవసాయ విధానం ద్వారా పంట మార్పిడీలు చేయాలని సూచించారు. ఈ కమిటీ వేయడం వలన నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేసే విధంగా మార్పులు జరిగాయి.

**7. మౌళిక సదుపాయాల కమిటీ:** ఈ కమిటీ ద్వారా 4 సంవత్సరాలకు కావలసిన పనులను గుర్తించడం జరిగింది. అన్ని విధులు కవరయ్యే విధంగా గ్రామ ప్రజల భాగస్వామ్యంతో సూచించిన పనులను చేయడం వలన ఎలాంటి రాజకీయ వ్యక్తిగత గొడవలకు తావు లేకుండా పనులు చేయటానికి మార్పు జరిగిందనిని భావిస్తున్నాం.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గారు, పంచాయతీరాజ్ ఐటి శాఖామంత్రి శ్రీ కె. తారకరామారావు గారికి ప్రజల భాగస్వామ్యంతో నూతన పంచాయతీ రాజ్ విధానాన్ని ప్రవేశపెట్టి గ్రామాలాభివృద్ధికి గ్రామజ్యోతి ద్వారా అభివృద్ధి పర్చుకునే విధంగా విధానాన్ని ప్రవేశపెట్టినందుకు కృతజ్ఞతలు తెలియపర్చుకున్నారు.

*– వి. కర్నాకర్, డిటిఎం, వరంగల్*



# గ్రామజ్యోతి స్ఫూర్తితో ప్రగతిపథంలో 'పీపుల్ పహాడ్'

**ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పథంలో నడుస్తున్న గ్రామం - చౌటుప్పల్ మండలంలోని పీపల్ పహాడు గ్రామం. ఈ గ్రామంతోపాటు రెండు ఆవాసాల కలయిక గ్రామమైన పీపల్ పహాడు గ్రామ జనాభా 2011 జనాభా లెక్కల ప్రకారం 3391 మంది.**

గ్రామంలోని ప్రజల ముఖ్యవృత్తి వ్యవసాయం అయినప్పటికి రాష్ట్ర రాజధాని దగ్గరలో ఉండటం వలన యువకులు ఎక్కువమంది హైద్రాబాద్‌లో వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. గ్రామంలో రెండు ప్రాథమిక పాఠశాలలు, ఒక ఉన్నత పాఠశాల, మూడు అంగన్‌వాడీ కేంద్రాలు, ఒక పాలసేకరణ కేంద్రం ఉన్నాయి. అన్ని గ్రామాల్లో ఉన్నట్లే ఈ గ్రామంలో అనేక సమస్యలు ఉండేవి. వాటిలో అనేక సమస్యలు ఆర్థికపరమైన అంశాలతో కూడుకున్నవి.

ఆర్థిక వనరులు లేక సమస్యలను పరిష్కరించుకోవడంలో గ్రామ పంచాయితీ తనకు ఉన్న వనరులతో చాలీ చాలని ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఈ క్రమంలో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామజ్యోతి కార్యక్రమం ఆ గ్రామానికి ఒక వరం లాగా అందివచ్చింది. ఆ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకొన్నారు.

గ్రామజ్యోతిలో భాగంగా ఆగష్టు 22న హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ రేమండ్ పీటర్ ఐ.ఎ.ఎస్, జిల్లా కలెక్టర్ శ్రీ సత్యనారాయణరెడ్డి ఐ.ఎ.ఎస్., మునుగోడు ఎం.ఎల్.ఏ శ్రీ కె.ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. వీరితోపాటు గ్రామ పంచాయితీ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామజ్యోతి ఫంక్షనల్ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

*గ్రామజ్యోతి గ్రామసభ కార్యక్రమంలో ఈ క్రింది తీర్మానాలను చేయడం జరిగింది.*

- గ్రామంలోని చెత్తను డంపింగ్ యార్డులో వేయాలని తీర్మానించారు.
- గ్రామంలోని 100% వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలి.
- స్మశాన వాటికను గ్రామ చివరన ఏర్పాటు చేయుట.
- చెత్తను ఇండ్ల నుండి సేకరించి డంపింగ్ యార్డ్‌నకు తరలించటానికి ట్రైసైకిల్స్‌ని కొనుగోలు చేయుట.

- త్రాగునీటి సమస్యను తీర్చటానికి ఎస్.సి. కాలనీ నుండి తంగడ్‌పల్లి చెరువు వద్ద ఉన్న బోరుబావికి కరెంట్ లైన్ ఏర్పాటు చేయుట.
- మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేయుట.
- గ్రామంలో ఉన్న వృద్ధులను, వికలాంగులను గుర్తించి సామాజిక భద్రతా పెన్షన్ మంజూరీ చేయుంచుట.
- అంగన్‌వాడీ, పాఠశాలల వద్ద చెట్లను విరివిగా నాటడం మరియు పోషించడం.

*తేది: 15.9.2015న గ్రామసభ నిర్వహించి గ్రామజ్యోతి కార్యాచరణ ఉప కమిటీలను ఏర్పాటు చేశారు.*



- అవగాహన పెంపుదల కమిటీ
- ముడిసరుకుల కొనుగోలు కమిటీ
- రెడిమేడ్ వస్తువుల కొనుగోలు కమిటీ
- నిధుల నిర్వహణ, పుస్తక నిర్వహణ, డాక్యుమెంటేషన్ కమిటీలను ఏర్పాటు చేసుకొన్నారు. ఒక్కొక్క కమిటీలో 5 మంది సభ్యులు ఉంటారు వీరిలో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, యువజన సంఘ సభ్యులు స్వచ్ఛంద సంస్థ సభ్యులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీల ముఖ్య ఉద్దేశ్యం గ్రామజ్యోతి కమిటీలకు సహాయ సహకారాలు అందించటం.

గ్రామజ్యోతిలో కార్యక్రమంలో భాగంగా గ్రామానికి మొత్తం గ్రాంట్లు రూ. 3,33,52,467 మంజూరీ అయ్యాయి. ఇందులో 2015-2016 సంవత్సరానికి రూ. 76,71,379.00 మంజూరీ అయ్యాయి. వీటిని గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం త్రాగునీటి పైపులైను ఏర్పాటు గుర్తించనైనది.

2016-2017సంవత్సరానికి రూ. 81,22,894.00 సిసి రోడ్లు, మిగిలిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, 2017-2018 సంవత్సరానికి రూ. 85,51,776.00 అంగన్‌వాడీ బిల్డింగ్‌ల నిర్మాణం, ఇతర గుర్తించిన పనులకు కేటాయించారు.



*గ్రామజ్యోతి కార్యక్రమంలో భాగంగా గ్రామంలో చేసిన పనులు:*

- గ్రామంలో 3 ట్రైసైకిల్స్‌ని కొనుగోలు చేసి చెత్తను ఇండ్ల నుండి సేకరిస్తున్నారు.
- సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌కు చేరవేస్తున్నారు.
- గ్రామంలో 300 మీటర్ల అంతర్గత మురుగుకాల్వలను నిర్మించారు.
- గ్రామంలో 243 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి పనులు జరుగుచున్నవి. 60% పూర్తి అయినవి.
- ఆసరా పెన్షన్ క్రింద గ్రామంలో మిగిలిన 25 మందిని గుర్తించి పెన్షన్ ఇవ్వనైనది.
- త్రాగునీటి సమస్య తీర్చటానికి ఎస్.సి. కాలనీ నుండి తంగడ్‌పల్లి చెరువు వరకు 18 కరెంట్ స్థంబాలను రూ. 4,50.000 ఏర్పాటు చేసి నీటి సరఫరా చేస్తున్నారు.
- గ్రామంలోని అన్ని కరెంట్ స్థంబాలకు వీధిదీపాలను ఏర్పాటు చేసినారు.
- ఇంటి పన్ను కోసం విధించటానికి రివిజన్ చేయడం జరిగినది.
- 80% ఇంటి పన్నులు వసూలు అవుతున్నాయి.
- హరితహారంలో భాగంగా గ్రామంలో చెట్లను నాటడం మరియు నాటిన చెట్టుకు గ్రామంలోని ఒక వ్యక్తిని బాధ్యున్ని చేయడం జరిగింది.

*– బి. లింగారెడ్డి, జిల్లా శిక్షణ మేనేజర్, నల్లగొండ*

# గ్రామ స్వరాజ్య స్ఫూర్తితో గ్రామజ్యోతి

**20వ శతాబ్ధపు మనిషిగా, ఈ సహస్రాబ్ది మహనీయునిగా అభివర్ణించబడిన మహాత్మాగాంధీ అహింసే ఆయుధంగా బ్రిటిష్ వారిపై అలుపెరుగని పోరాటం చేసి భారతదేశానికి స్వాతంత్ర్య సముపార్జన చేసి పెట్టడమే కాక , ప్రపంచ చరిత్రలో భారత స్వాతంత్రోద్యమ పోరాటానికి రక్త రహిత పోరాటంగా చోటు కల్పించారు. టైమ్స్ పత్రిక గాంధీజీని ఈ శతాబ్ధపు అత్యంత ప్రధానమైన వ్యక్తిగా గుర్తించింది.**



అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబమా "నా జీవితం అంతా నేను గాంధీ నుండి స్ఫూర్తిని పొందాను. ఎందుకంటే సామాన్యులు కలిసి అసామాన్యమైన పనులు చేస్తే సంపూర్ణ పరివర్తన సాధ్యం అనడానికి ఆయనే ప్రతీక" అన్నారు.

నా జీవితమే నా సందేశం అంటూ యావత్ మానవ జాతికే నిర్ధేశకునిగా, శాంతి ప్రభోధకునిగా ఒక మానవీయ సమాజ స్థాపనకు కృషిచేసిన ఒక మహా మనీషి మోహన్ దాస్ కరంచంద్ గాంధీ. ఆయన ప్రభోధించిన సూత్రాలు, సిద్ధాంతాలు ఉత్తమ జీవనానికి దిశానిర్ధేశాలు. నేడు మన భారత దేశమే కాకుండా యావత్ ప్రపంచం కూడా శాంతియుత సహజీవనానికి, మానవతా విలువలకు గాంధీ సిద్ధాంతాల అవసరాన్ని గుర్తించాయి. ఆర్థిక, రాజకీయ, మత, సాంస్కృతిక రంగాలలో అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్న నేటి ప్రపంచానికి గాంధీ సిద్ధాంతాలు అత్యంత విభిన్నమైన, విశిష్టమైన ఆశాకిరణాలుగా ఉన్నాయి.

శాంతి, సామరస్యాలకు, అభివృద్ధికి అభ్యున్నతికి, మానవ జాతి మనుగడకు ఉన్న ఏకైక ప్రత్యామ్నాయం గాంధీ సిద్ధాంతాలే. గాంధేయ విధానం ప్రస్తుత ప్రపంచ సమస్యలన్నింటికీ ఒక క్రొత్త ఆశ మరియు అన్నింటికీ మించి ఒక నూతన సవాలు. మానవాళి శాంతియుతంగా జీవించాలన్నా, అభివృద్ధి సాధించాలన్నా గాంధీజీ సిద్ధాంతాలు, మార్గాలు అవగాహనతో ఆచరించడమే ఏకైక మార్గం.

మానవ నాగరికత హింసాయుత పద్ధతులతో ప్రారంభమై, కాలానుగుణంగా అభివృద్ధి చెందిన కొద్ది అహింసాయుత విధానాలతో కూడిన జీవన విధానాన్ని అలవాటు చేసుకొని ఆచరణలో పెట్టడం ప్రారంభించాం. శాంతి సాధనకు అహింస ఒక్కటే మార్గమని, దానిని ఆచరణలో చూపించి శాంతిదూతగా గాంధీజీ పేరుగాంచారు. నేటి కంప్యూటర్ యుగంలో మానవ జీవన విధానం అనూహ్యమైన మార్పులకు, లెక్కలేనన్ని ఒత్తిడులకు గురై అశాంతితో కొనసాగుతున్నది.

సైన్సు, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిచెంది మానవ జీవన శైలికి అనేక సమస్యల సవాళ్ళను తీసుకువచ్చింది. అయితే అందరిపట్ల సమానంగా వ్యవహరించే సంస్థాగత అంశాలలో మాత్రం మానవులు అభివృద్ధి చెందలేక పోతున్నారు.ఫలితంగా భౌతిక అవసరాలు, సామాజిక సమానత్వం అందరికీ అందుబాటులోకి రాలేదు. ఈ పరిస్థితి ఉద్రిక్తతలను మరింతగా పెంచి హింస రోజు రోజుకూ పెరిగేందుకు దోహదపడుతున్నది.

"ప్రతి ఒక్కరి అవసరాలను తీర్చేందుకు అవసరమైన వనరులు ఈ ప్రపంచంలో ఉన్నాయి. కాని ప్రతి ఒక్కరి దురాశను తీర్చటానికి మాత్రం లేవు" అని గాంధీ వ్యాఖ్యానించారు. గాంధీజీ చేసిన ఈ వ్యాఖ్యలు సామాజిక నిర్మాతలు, భవిష్యత్ పాలకులకు ఒక హెచ్చరిక వంటిది. నేడు ప్రపంచంలో 20 శాతం మంది సంపదను అనుభవిస్తూ ప్రపంచ సంపదలోని 82 శాతం వారు కలిగి ఉన్నారు. దీనితో హింస, విద్వేషాలు మరింత పెరిగి సమాజంలో అశాంతి నెలకొంటుంది. నాడు గాంధీజీ ప్రతిపాదించిన సర్వోదయ, ధర్మకతృత్వ సిద్ధాంతం, స్వదేశీ మరియు గ్రామ స్వరాజ్ సిద్ధాంతాలు నేడు ఎంతగానో అవసరం.

శాంతి, సౌభ్రాతృత్వాలు కలిసికట్టుగా గాంధీజీ అహింసాయుత విధానాల్లో మాత్రమే మనకు కనిపిస్తుంది. భారత స్వాతంత్రోద్యమ కాలంలో గాంధీజీ ప్రబోధించి ఆచరించిన లౌకికవాద సిద్ధాంతాలు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయని చెప్పవచ్చు. నిర్మాణాత్మక రాజకీయ ఉద్యమాలు నిర్మించేందుకు లౌకికవాదం అత్యవసరం అని ఆయన అభిప్రాయపడ్డారు. లౌకికవాదం, మత సామరస్యం గురించి ఆయన దేశవ్యాప్తంగా ప్రచారం చేశారు. అందుకు భిన్నంగా గాంధీ పుట్టిన దేశంలోనే మతం, కులం, జాతి, వర్గ విభేదాలతో నాయకులు, పార్టీలు కూడా ఆవిర్భవించి మతసామరస్యానికి, సౌభ్రాతృత్వానికి గొడ్డలిపెట్టుగా మారాయి.

సంకుచిత స్వభావాలతో, స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం వివిధ కుల, మత, వర్గ, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టి హింసను ప్రోత్సహిస్తూ ప్రజా జీవితాలను అశాంతికి గురిచేస్తున్నారు. దీనికి ఏకైక పరిష్కారం లేదా ప్రత్యామ్నాయం గాంధేయవాదం.

"అహింసాయుత వాతావరణానికి మొట్టమొదటి లక్షణం అందరికీ న్యాయం కల్పించటమే. సమాజం ప్రతి విభాగంలోనూ ఈ న్యాయం కావాలి" అని గాంధీ ఉద్బోధించారు. సమాజంలో దీర్ఘ

కాలంగా కొనసాగుతున్న అంటరానితనం, కులవ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాటం చేశారాయన. అస్పృశ్యత, కులవ్యవస్థలపై గాంధీజీ సల్పిన పోరాటం వాస్తవానికి సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా జరిపిన జరిపిన పోరాటంగానే చెప్పవచ్చును.

జాతిపిత మహాత్మాగాంధీ ఆచరణాత్మక సిద్ధాంత ఆదర్శవాది మాత్రమే కాదు. ఆయన ఒక ఆదర్శవంతమైన ఉద్యమకారుడడు కూడా. మహిళల దాస్యశృంఖలాల విముక్తి కోసం జరిగిన పోరాటంలో ఆయన మూల స్తంభంగా చెప్పవచ్చును. నేడు మన రాష్ట్ర, దేశ ప్రభుత్వాలు మహిళల అభ్యున్నతికి, రక్షణకు ముఖ్యంగా మహిళా సాధికారతను అనుసరిస్తూ అమలు చేస్తున్న అనేక విధానాల గాంధీజీయే స్ఫూర్తిగా చెప్పవచ్చు. కారణం మహిళలపట్ల వివక్షతను ప్రదర్శించడాన్ని గాంధీజీ తీవ్రంగా వ్యతిరేకించేవారు. అవకాశం దొరికిన ప్రతి సందర్భంలోనూ మహిళల సమానత్వం, స్వేచ్ఛ, ఇతర హక్కుల గురించి ఆయన ప్రస్థావిస్తూ ఉండేవారు.

మహిళలకు పురుషులతో సమాన హక్కులు, స్వాతంత్ర్యాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అయితే నేడు మన ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు, విధానాలు చేసినా మహిళలపై దాడులు, వివక్షత అనేవి కొనసాగుతూనే ఉన్నాయి. ఢిల్లీ తరహా అత్యాచారాలు, దాడులు, హత్యలు వగైరాలు మహిళలపై జరుగుతున్నాయని ప్రతినిత్యం వార్తా పత్రికలు, టి.వి. ఛానళ్ళు కథనాలను ప్రసారం చేసి ప్రచురిస్తున్నాయి. ఈ స్థితిని అధిగమించి వారి హక్కుల్ని, స్వేచ్ఛను కాపాడటాన్కి గాంధీజీ పరిష్కారాన్ని చూపించారు. అదేమంటే "మహిళల పట్ల గౌరవం, సమానత్వ శాసనాల ద్వారా రావని, ప్రజలలో చైతన్యం తీసుకురావడమే ఏకైక మార్గమని" గాంధీజీ పేర్కొన్నారు.

నేడు మనం ఎదుర్కొంటున్న మరొక సమస్య భ్రూణ హత్యలు. ఒకానొక సందర్భంలో గాంధీజీ మాట్లాడుతూ "కుమారుడు పుట్టినందుకు సంతోషించటం, కూతురు పుట్టినందుకు విచారించటంలోని ఔచిత్యం ఏమిటో నాకు అర్థం కావటంలేదు" అని అన్నారు. ఆయన దృష్టిలో లింగ వివక్షత లేదు. ఇద్దరూ సమానమే. బాల్య వివాహాలు, వరకట్నం లాంటివి నైతికంగానూ, చట్టపరంగానూ కూడా దురాచారాలేనని ఆయన పేర్కొన్నారు. పరస్పర సహకారం సంప్రదింపుల ద్వారా లింగ సమానత్వం సాధించవచ్చునని గాంధీజీ సూచించారు. భార్యను కోల్పోయిన మనిషికి పునర్వివాహం చేసుకొనే హక్కు ఎంత ఉన్నదో, భర్తను కోల్పోయిన మహిళకు కూడా అంతే హక్కు ఉంటుందని ఆయన పేర్కొనటం లింగ సమానత్వం పట్ల ఆయనకున్న కృత నిశ్చయాన్ని తెలియజేస్తున్నది. వివాహాల్లో మితిమీరిన వ్యయం కూడదని చెబుతూ మహిళలకు పురుషులతో సమానంగా జీతాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్య గురించి, విద్యావ్యవస్థ గురించి గాంధీజీ వెలిబుచ్చిన అభిప్రాయాలు, సూచించిన విధానాలు నేటి మన ప్రభుత్వాది నేతలు మరియు విద్యావేత్తలను కూడా వారు అనుసరిస్తున్న విధానాలు పునరాలోచించుకునేవిగా ఉన్నాయి. కారణం నేటి విద్యావ్యవస్థ వ్యాపారధోరణి తోను, డిగ్రీలు ఇచ్చే ఉత్పత్తి యంత్రంగా మాత్రమే కొనసాగుతున్నది. నేటి కార్పోరేట్ విద్యావ్యవస్థ విద్యార్థుల మనోవికాసానికి, వ్యక్తిత్వ వికాసానికి దోహదం చెయ్యటం లేదు సరికదా వారిని ఒక మర మనుషులుగా తయారుచేస్తున్నది. గాంధీజీ అభిప్రాయంలో విద్య మానవులను పరిపూర్ణులుగా తీర్చిదిద్దేదిగాను, సమాజంలో మౌలిక విలువల్ని ప్రతిబింబించేదిగాను ఉండాలి.

"మంచికీ, చెడుకీ మధ్య వ్యత్యాసాన్ని గుర్తించి, మంచిని పాటించి చెడును పరిత్యజించే విధానాన్ని బోధించని విద్య అసలు విద్య కాదు" అని ఆయన పేర్కొన్నారు.

దోపిడీదారుల, వ్యాపారుల ఆకాంక్షలను నెరవేర్చేదిగా కాకుండా నిరుపేదల కోర్కెలను తీర్చేవిధంగా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ఆయన అభిప్రాయపడ్డారు. జాతీయ విద్య అసలు సిసలు జాతీయ దృక్పథంతో కూడుకున్నదై ఉండాలి. దేశకాలమాన పరిస్థితులకు అనుగుణంగా విద్యను రూపొందించాలి, ప్రజలకు నిజమైన సేవలు అందించే సేవకులను తయారు చెయ్యటం విద్యాసంస్థల లక్ష్యం కావాలని ఆయన ఆశించారు. నిజమైన విద్య అందరికీ అందుబాటులో ఉంటూ దైనందిత జీవితంలో అందరికీ ఉపయోగకరంగా ఉండాలి.

పాఠశాలలు వీలైనంత మేరకు సమాజ అవసరాలకు అనుగుణంగా ఉంచడానికి, పౌరులు తమ కాళ్ళపై తాము నిలబడగలిగే విధంగా తయారు చెయ్యాలని ఆయన ఆకాంక్షించారు. అంతేగాక గాంధీజీ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి విద్య అవసరాన్ని కూడా తెలియజేశారు. నిజమైన విద్య మాత్రమే ప్రజాస్వామ్య వ్యవస్థ స్థిరంగా పనిచేసేందుకు దోహదం చేస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యం సమర్థవంతంగా పని చెయ్యాలంటే కావాల్సింది గణాంకాలు లేదా వాస్తవాలు తెలుసుకోవటం కాదని, నిజమైన విద్య ఒక్కటే ముఖ్యమని వివరించారు.

మౌలికమైన విద్య విద్యార్థులను దేశంలో ఏమూల ఉన్నప్పటికీ అత్యుత్తమైన, శాశ్వతమైన ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలకు అనుబంధం చేస్తుందన్నారు. విద్యావ్యవస్థ స్వావలంబనతో పాటు స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉండాలని, వ్యక్తుల పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని రూపొందించేదిగా ఉండాలన్నదే గాంధీజీ అభిమతం. నేటి మన విద్యా వ్యవస్థను సంస్కరించి అసలు సిసలు విద్యను అందించాలంటే గాంధీ వివాదాలే శరణ్యం.

నేటి ప్రయివేటీకరణ మరియు ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచంలోని అనేక దేశాల మార్కెట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థలు ఒడుదుడుకులకు లోనౌతూ అస్థిరత్వానికి గురౌతున్నాయి. అందుకనే ప్రపంచ దేశాలన్నీ 'సుస్థిరాభివృద్ధి' అనే భావనవైపు పరుగెడుతున్నాయి.

ఈ సందర్భంగా మనం గాంధీజీ ఆర్థిక స్వావలంబన సిద్ధాంతాన్ని అర్థం చేసుకొని ఆచరించినట్లయితే సుస్థిరాభివృద్ధికి పునాదులు వెయ్యవచ్చును. ఆర్థిక స్వావలంబన వ్యక్తులకు, దేశానికి తప్పనిసరి అని, దేశం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళికలను ఆయన రూపొందించారు. ఆర్థిక కార్యకలాపాలతో ముడిపడిన మనిషి జీవితం నైతిక విలువలకు అనుగుణంగా, అహింసాయుతంగా ఉండాలన్నదే ఆయన భావన.

సర్వోదయలాంటి ఉపాధి అవకాశాలు కల్పించే ఆర్థిక వ్యవస్థ గురించి ఆయన ఆలోచించారు. దేశంలోని వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ పర్యావరణాన్ని పరిరక్షించే ఆర్థిక విధానాలు రూపొందించాలని ఆయన ఆకాంక్షించారు. పెట్టుబడిదారీ విధానం, నిరుద్యోగం, అసమానతలు లాంటివి పేదరికానికి దారితీస్తాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థే దేశ అవసరాలకు ఖచ్చితంగా సరిపోతుందని ఆయన విశ్వసించారు.

చిన్నతరహా మరియు కుటీర పరిశ్రమలు దేశ ఆర్థికాభివృద్ధిలో విశిష్టస్థానం ఆక్రమిస్తాయని, పటిష్టమైన మానవశక్తి, పశుసంపద, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలు దేశం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా అభివృద్ధి చేసేందుకు దోహదం చేస్తాయని ఆయన నమ్మారు. చైనా, ఇజ్రాయిల్ దేశాలలోని ఆర్థిక వ్యవస్థ, జపాన్‌లోని చిన్నతరహా పరిశ్రమల వ్యవస్థ గాంధీ ఆశయాలకు దగ్గరగా ఉంటాయనేది మనం గమనించాలి. అంతేగాక ప్రపంచ ఆర్థికవ్యవస్థలో చైనా, జపాన్‌లాంటి దేశాలు ఎంతటి భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయనేది కూడా అర్థం చేసుకోవాలి. కాబట్టి గాంధీజీ ఆలోచనలు ఆచరణాత్మకంగా ఉండటమే గాక, ప్రస్తుత ప్రపంచ వ్యవస్థకు సరిపోయే విధంగా ఉన్నాయనే విషయాన్ని గ్రహించాలి.

ప్రపంచీకరణపై గాంధీజీ అభిప్రాయాలు, ఆలోచనలు కూడా మనం తెలుసుకోవాల్సి ఉంటుంది. ఎందుచేతనంటే ప్రస్తుతం బహుళజాతి సంస్థల నిర్వహణలో నడుస్తున్న నేటి ప్రపంచీకరణకు, గాంధీజీ ఆశించిన ప్రపంచీకరణకు గల వ్యత్యాసాన్ని మనం గ్రహించాలి. గాంధీజీ దృష్టిలో ప్రపంచీకరణ అంటే ప్రపంచం గురించి ఆలోచించటం, స్థానిక పరిస్థితులకు, అవసరాలకు అనుగుణంగా వ్యవహరించటం అని అర్థం.

మార్కెట్ ప్రయోజనాలకు, వినియోగదారునికి పెద్దపీట వేస్తూ విలువలకు తిలోదకాలిచ్చే ప్రస్తుత ప్రపంచీకరణలో గాంధీజీ ఆశించిన 'వసుధైక కుటుంబం' మరియు 'సర్వేజనా సుఖినోభవంతు' అనే సిద్ధాంతాలకు తావులేదు. మానవాళి సంక్షేమం కోసం, భవిష్యత్ మానవ అవసరాలకు నేటి ప్రపంచీకరణలో గాంధీజీ ఆలోచనలకు స్థానం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదనేది అందరూ గుర్తించాలి.

జాతీయవాదంతోబాటు మానవత్వం, మానవ విలువలు కూడా ప్రాధాన్యత కలిగిన అంశాలుగా గాంధీజీ నమ్మారు. ప్రపంచంలోని ఏ ప్రాంతంలోనైనా వనరులను దోపిడీ చేసేందుకు స్వేచ్ఛను కల్పించే విధంగా నేటి ప్రపంచీకరణను తయారు చెయ్యటం దురదృష్టకరం. ఈ పరిస్థితి నుండి బయటపడి మానవాళి శ్రేయస్సును పెంపొందించాలంటే గాంధీజీ విలువలే మనకు దిక్కు.

గాంధీజీ మెరుగైన మానవ సమాజ రూపకల్పనకు, శాంతి భద్రతల పరిరక్షణకు, మానవుడు మానవునిగా జీవించగలిగే ఒక మానవీయ సమాజ స్థాపనకు విశేషంగా కృషి చేశారు. ఆయన కృషి ఫలితంగా భారతదేశంలో నూతన సామాజిక చైతన్యం వెల్లివిరిసింది. అయినప్పటికీ ఆయన ప్రబోధించిన మౌలిక సిద్ధాంతాల నిజమైన సారాన్ని మనం సరిగ్గా అర్థం చేసుకోలేదు. ఆయన సిద్ధాంతాలు, సరళంగాను, నిర్మాణాత్మకంగాను ఉన్నప్పటికీ సమాజం దానిని అందరికీ ప్రయోజనం కలిగించే రీతిలో అమలు చేయలేకపోయింది. అంతటా హింసా వాదం పెరిగిపోయింది. కార్పొరేట్ వలసవాదం విస్తరించి ఆర్థిక సంస్థల ప్రభావం పాత్ర అధికమైంది.

మత వ్యవస్థలు, రాజకీయ సిద్ధాంతాల మధ్య వైరుధ్యాలు చోటు చేసుకున్నాయి. పరస్పర విరుద్ధమైన రాజకీయ సిద్ధాంతాలు, నిర్వహణ సామర్థ్యాల్లో వ్యత్యాసాలు కారణంగా పోటీతత్వం పెరిగిపోయి పెట్టుబడిదారీ సంస్థలు మరియు బహుళజాతి సంస్థలు ప్రపంచాన్ని నిర్దేశిస్తున్నాయి. సమాజంలో సమానత్వం, స్వేచ్ఛా, సౌభ్రాతృత్వాలు నెలకొల్పాలంటే సామ్యవాద ప్రజా స్వామ్య వ్యవస్థ ఏర్పాటు కావాలి. అప్పుడే ప్రజలందరి మధ్య సమన్వయం, సహకారం పెంపొంది సర్వమానవ శ్రేయస్సు నెలకొల్పబడుతుంది.

సర్వమానవ శ్రేయస్సుకు, వలస పాలన నిర్మూలనకు సర్వోదయ సమాజం ఒక్కటే పరిష్కారం అని గాంధీజీ సూచించారు. నేడు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న తీవ్రవాదం లాంటి సవాళ్ళను ఎదుర్కోనడానికి గాంధీజీ అహింసా సిద్ధాంతాన్ని మించినది మరొకటి లేదు. కానీ మన పాలకులు ఆయన భావ జాలాన్ని విస్మరించటం ఎంతో దురదృష్టకరం.

"నేను మరి కొందరు విప్లవకారులం కావచ్చు కానీ మేమంతా మహాత్మాగాంధీ శిష్యులం" ప్రజల స్థితిగతులపై వాస్తవిక అంచనాలు రూపొందించటం, సామాజిక దృక్పథం గల ఆర్థిక వ్యవస్థ, ప్రజ లందరికి నిర్మాణాత్మక సహకారం, గ్రామీణ జీవనంలో సంస్కరణలు, సర్వమానవ సంక్షేమం లాంటి గాంధీజీ ఆలోచనలు మనం విశ్లేషించినట్లయితే గాంధీజీ గతం కాదని, వర్తమానం మరియు భవిష్యత్తు అని అర్థమౌతుంది.

గాంధీజీ మరణించి 65 సంవత్సరాలు గడిచినా ఆయన చరిత్ర పుటల్లో కూరుకుపోయే వ్యక్తి కాదు. ఐన్ స్టీన్ చెప్పినట్లుగా 'ఇలాంటి వ్యక్తి (గాంధీజీ) ఈ భూమి మీద రక్తమాంసాలతో నడయాడాడంటే భవిష్యత్ తరాలవారు నమ్మడం కష్టం' అంటే అతిశయోక్తి కానే కాదు.

*– డా॥ దిరిశాల వెంకటేశ్వరరావు*

# హాజిపల్లి అందరికి నచ్చింది...
# ఈ పల్లెను ప్రపంచమే మెచ్చింది....

**ప్రగతి వెలుగులతో ప్రఖ్యాతి గాంచిన ఈ గ్రామాన్ని సందర్శించేందుకు ఇక్కడి నూతన ఒరవడులను పరిశీలించి... తమ వద్ద అమలు చేసేందుకు విదేశీ బృందాలు... వివిధ రాష్ట్రాల, జిల్లాల, మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు అధ్యాయనానికి వస్తున్నారు.**

పరిపాలనా దక్షతకు, అభివృద్ధికి నిదర్శనంగా నిలిచి ప్రగతి దిశగా రాజీలేని పోరాటం చేస్తూ, ఆశించని ప్రగతిని అందుకుని దేశం, రాష్ట్ర స్థాయిలో ఉన్నత పురస్కారాలు పొంది ఆదర్శ గ్రామ పంచాయతీగా అందరి మన్ననలు పొందుతున్న హాజిపల్లి గ్రామాన్ని పరిశీలిద్దాం.

తెలంగాణ రాష్ట్రంలో విరివిగా వనరులు, అభివృద్ధికి అవకాశాలు ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాలోని ఫరూఖ్‌నగర్ మండలంలోని హాజిపల్లి అను గ్రామం షాద్‌నగర్ పట్టణానికి 3 కి.మీ.ల దూరంలో ఉంది. గతంలో కిషన్‌నగర్ గ్రామపంచాయతీలో ఆవాస గ్రామంగా ఉన్న హాజిపల్లి 1980 సంవత్సరంలో ప్రత్యేక పంచాయతీగా ఏర్పడింది. ఈ గ్రామంలో 8 వార్డులుండగా, 242 కుటుంబాలున్నాయి. ఇందులో స్త్రీలు 446, పురుషులు 430 మొత్తం 875 మంది జనాభా కలిగిన ఈ గ్రామంలో 656 మంది ఓటర్లు ఉన్నారు. బలహీన వర్గాలకు చెందిన గౌడలు, మున్నూరుకాపులు, ముదిరాజ్‌లు, కమ్మర్లు, షెడ్యూల్డ్ కులాల వారు కొద్దిమంది ఉంటారు.

1980 సంవత్సరంలో ప్రత్యేక పంచాయతీగా ఏర్పడిన ఈ గ్రామానికి మొదటి సర్పంచ్‌గా మరియు రెండవ సర్పంచ్‌గా ఇస్నాతి మల్లయ్యను పాలకవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. 3వ సారి ఎన్నికల్లో ఇస్నాతి లింగయ్యను వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 4వ సర్పంచ్‌గా శ్రీమతి సింగారం యాదమ్మను సర్పంచ్‌గా ఎన్నుకున్నారు.

ఈ ప్రకారంగా ప్రత్యేక పంచాయతీగా ఏర్పడిన నాటి నుండి 2001 సంవత్సరం వరకు ఆ ఊరి గురించి ఎవరికి తెలియదు, గ్రామానికి సరైన రోడ్డు కూడా ఉండేది కాదు. గ్రామస్థులు తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొనేవారు, బహిర్భూమిలోనే కాలకృత్యాలు తీర్చుకునేవారు, వీటికితోడు మలేరియా, డయేరియా, వ్యాధుల వల్ల వారి ఆరోగ్యం బాగా క్షీణించిపోయేది. ఫలితంగా వారి జీవితాలు గాలిలో దీపాల్లా తయారయ్యేవి. ఈ క్రమంలో గ్రామస్థులు వారి సమస్యలన్నింటిని షాద్‌నగర్ పట్టణంలో క్వారీ రాళ్ళ దుకాణం నిర్వహిస్తున్న యువకుడు సింగారం శ్రీనివాస్‌కు చెబుతుండేవారు.

'యువతరం శిరమెత్తితే, నవతరం గలమెత్తితే లోకమే మారిపోదా... ఈ చీకటి మాసిపోదా....' అన్న వివేకానందుడి స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని స్పందించే మనస్తత్వంతో మానవత్వం ఉన్న మంచి మనిషిగా పరుల సంతోషమే తన సంతోషంగా సాటి మనిషికి సహాయం చేయనివాడు, భగవంతుడిని బంగారు పూలతో పూజించిన వ్యర్థమే అని ఆలోచించిన సింగారం శ్రీనివాస్ గ్రామస్తుల శ్రేయోభిలాషిగా తన సొంత ఖర్చులతో గ్రామ ప్రజల దాహార్తిని, నీటి సమస్యను తీర్చడానికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తూ, వీధి లైట్లు ఏర్పాటు చేస్తూ అతనికి తోచిన సహాయం చేస్తూ ప్రజల చిన్న చిన్న అవసరాలను తీర్చుతూ తలలో నాలుకలా ఉండేవారు.

### హాజిపల్లి ప్రగతికి నాంది...
### సింగారం శ్రీనివాస్ సర్పంచ్‌గా ఎన్నిక

గ్రామంలో ఇంకా ముఖ్యమైన సమస్యలు పరిష్కారానికి నోచుకోని సమయంలో 2001 సంవత్సరంలో గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగాయి. గ్రామస్థలందరూ సామాజిక సేవాదృక్పథం కలిగిన సింగారం శ్రీనివాసులును సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. గ్రామ చరిత్రలో ఇదొక మలుపుగా మారింది. గ్రామ సర్పంచ్‌గా సింగారం శ్రీనివాస్ గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన సమయంలో మంచినీటి సమస్యను పరిష్కరించడానికి గ్రామంలో ఉన్న 30 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న నీటి ట్యాంకును విస్తరించడానికి వరల్డ్ విజన్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సహాయం చేసింది.

ఎస్.జి.ఆర్.వై. పథకం ద్వారా గ్రామంలోకి రావడానికి మట్టిరోడ్లు, మురుగునీరు పోవడానికి రోడ్డుకిరువైపులా కాలువలు కట్టించాలని సర్పంచ్ శ్రీనివాసులు నిర్ణయించారు. పారిశుద్ధ కార్యక్రమాలు అమలులో బహిరంగ మలవిసర్జనను నిషేధించడానికి ఇంటింటికి వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి వాటిని వినియోగించడానికి గ్రామస్తులను ఒప్పించడానికి 6 సంవత్సరాల సమయం పట్టింది.

ప్రధాన మురుగునీటి వ్యవస్థను ఏర్పరచి మరుగుదొడ్లను వాటికి కలిపి గ్రామ వీధుల్లో మురుగునీరు లేకుండా చేశారు. ప్రజలను సంపూర్ణ పారిశుద్ధ్యం పట్ల చైతన్యం చేయడానికి వివిధ పద్ధతులు అనగా ఇంటింటి ప్రచారం, గ్రామ సభల ఏర్పాటు, మహిళా సంఘాల సమావేశాలు, కళాజాత బృందాల ద్వారా నాటికలు, పాటలు, అధికారులతో సమావేశాలు, వైద్య శిబిరాల నిర్వహణ,

తెల్లవారుజామున, రాత్రివేళల్లో నిఘా వేసి ఉంచడానికి బృందాలను ఏర్పాటు చేయడం, బహిర్భూమికి వెళ్లిన వారినుంచి జరిమానాలు వసూలు చేయడం వంటి ఎన్నో కార్యక్రమాలను చేపట్టవలసి వచ్చింది.

రాను, రాను ప్రజల ఆలోచనల్లో మార్పు వచ్చింది. ఈ లోగా రియల్ వ్యాపారం అభివృద్ధి చెందినందున గ్రామ పంచాయతీకి స్టాంపు డ్యూటీ రూపంలో నిధులు సమకూరాయి. ఇంటి పన్ను, నీటి పన్ను, పశుసంపదపై పన్ను రూపంలో గ్రామానికి ఆదాయం వచ్చింది. ఈ ఆదాయంతో భూగర్భ మురికినీటి పారుదల వ్యవస్థను ఏర్పాటు చేయాలని కొందరి గ్రామస్థుల పట్టుదలతో దాదాపు రూ. 25 లక్షల విలువతో 1982 మీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించారు. మరి ముఖ్యమైన కూడళ్లలో ఐమాస్ట్ విద్యుత్ దీపాలను కూడా ఏర్పాటు చేసుకున్నారు.

ఈ ప్రకారంగా ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కార మార్గాలను వారిచేతనే కనుగొని గ్రామ ప్రజల సహకారం మరియు భాగస్వామ్యంతో గ్రామంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను అభివృద్ధి పనులను చేశారు. ఆదర్శ గ్రామంగా అభివృద్ధి పరచాలని కలలు గన్న శ్రీనివాస్ తాను ఎంచుకున్న మార్గాన్ని విజయపథంగా పూర్తిచేసి 2006 సంవత్సరం నాటికల్ల గ్రామస్తులకు మౌళిక సదుపాయాలు ప్రాథమిక వసతులు కల్పించడానికి ఎంతో శ్రమించారు, బ్రహ్మాండమైన మార్పు తీసుకువచ్చారు. ఎంతోమందిచేత ప్రశంసలు పొందారు.

### జంగమ్మా... ప్రగతికి పట్టుగొమ్మ



2006 సంవత్సరంలో గ్రామ పంచాయతీ ఎస్సీ మహిళకు రిజర్వ్‌డ్ కాబడింది. ఈ ఎన్నికల్లో మాజీ సర్పంచ్ సింగారం శ్రీనివాస్ నిరక్షరాస్యురాలైన చెదురువల్లి జంగమ్మ అనే దళిత మహిళను ప్రోత్సహించి వెన్నుదన్నుగా నిలిచి ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలిపించుకున్నాడు.

సర్పంచ్‌గా ఎన్నికైన జంగమ్మ, శ్రీనివాసులు నుంచి పదవీ బాధ్యతలు తీసుకున్నది. గ్రామ ప్రజలు జంగమ్మను సాదరంగా ఆహ్వానించి, గ్రామ సమస్యలపై పనిచేయడానికి గౌరవ ప్రదమైన జీవితం గడపడానికి కావలసిన మద్దతు ఇచ్చారు.



మాజీ సర్పంచ్ సింగారం శ్రీనివాస్ సలహాలు, సూచనలు మరియు సహకారం సమన్వయంతో గ్రామ దళిత మహిళా సర్పంచ్‌గా జంగమ్మకు అక్షరం తెలియకపోయినా, తాము అంకిత భావంతో గ్రామాన్ని ఆదర్శం... అభివృద్ధి అనే లక్ష్యంవైపు నడిపించింది. పాలనలో ప్రజాదరణలో అందరిని జయించింది. పల్లెను ప్రగతివైపు నడిపించింది. జంగమ్మ ఆధ్వర్యంలో ఇళ్లలో చెత్త చెదారాన్ని సేకరించి వీధుల్లో, ఆరుబయట వేయకుండా కుండీల్లోనే వేసేలా చైతన్యం కలిగించారు.

గ్రామస్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి చర్యలు తీసుకున్నారు. ప్లాస్టిక్ సంచులను నిషేధించడం, గ్రామంలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించడం, గ్రామంలో సంపూర్ణ పారిశుద్ధ్యాన్ని అమలు చేయడం వంటి చర్యలు తీసుకున్నందుకు ఈ గ్రామం జిల్లా, రాష్ట్ర స్థాయి శుభ్రం అవార్డును, జాతీయ స్థాయి నిర్మల్ పురస్కార్ అవార్డులు అందుకునే స్థాయికి తీసుకెళ్లడానికి జంగమ్మ కృషి అభినందనీయం. ఇలా జంగమ్మ 2006 సంవత్సరం నుంచి 2011 సంవత్సరం వరకు సర్పంచ్‌గా తనదైన శైలిలో గ్రామానికి వన్నె తెచ్చారు. అనంతరం గ్రామ పంచాయతీ 5 సంవత్సరాల కాలపరిమితి ముగిసిన తరువాత దాదాపు 2 సంవత్సరాల పాటు ప్రత్యేక అధికారుల పరిపాలనా కొనసాగింది.

### గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు

- 100% సంపూర్ణ పారిశుద్ధ్యం అమలు
- 100% నీటి కులాయిల ఏర్పాటు
- గ్రామంలోని వీధులన్ని సిమెంట్, కాంక్రీటుతో 1807 మీటర్లు రోడ్ల నిర్మాణం
- 1982 మీటర్ల భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు
- చెత్తసేకరణకు రిక్షాల ఏర్పాటు మరియు చెత్తకుండీల ఏర్పాటు
- వీధి వీధిలో సి.ఎఫ్.ఎల్. లైట్ల ఏర్పాటు
- డ్వాక్రా భవనం మరియు కాంపౌండ్ వాలు నిర్మాణం
- 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఉపరితల జలభాండాగారం (నీటి ట్యాంకు) ఏర్పాటు

ఈ విధంగా సర్పంచ్ జంగమ్మ గారి ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి పనుల ద్వారా గ్రామానికి పేరు ప్రఖ్యాతులు రావడం జరిగింది.

గ్రామ సర్పంచ్ జంగమ్మ పదవీకాలం 2006 నుండి 22-8-2011 వరకు పూర్తైన తరువాత మండల స్థాయి తహశీల్దారుగా బాధ్యతలు నిర్వహించిన వి. లక్ష్మినారాయణ, ఆర్. వెంకటలక్ష్మి, పి. సుబ్రహ్మణ్యం గార్లు 23-8-2011 నుండి 1-8-2013 వరకు హాజిపల్లి గ్రామానికి ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు నిర్వహించారు.

2013 సంవత్సరం 4వ సాధారణ ఎన్నికల్లో గ్రామ ప్రజలందరూ హాజిపల్లి గ్రామ అభివృద్ధి రథసారథి సింగారం శ్రీనివాస్‌ను సర్పంచ్‌గా మరియు 8 మంది వార్డు సభ్యును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తేది 2-8-2013 నాడు సింగారం శ్రీనివాస్ రెండవసారి సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. తదనంతరం పట్టువీడని విక్రమార్కుడిలా సామాజిక స్పృహతో గతంలో ఉన్న స్ఫూర్తితో తిరిగి గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను అలుపులేకుండా ప్రజలభాగస్వామ్యంతో అమలు చేయుచున్నాడు.

హాజిపల్లి నుండి చౌదమ్మ గుట్ట వరకు మట్టిరోడ్ల నిర్మాణం 2 కి॥మీ.లు, చటాన్‌పల్లి నుండి హాజిపల్లి వరకు 583 మీ.ల పైపులైన్ ఏర్పాటు చేసి తద్వారా మెట్రో నీటి సరఫరా చేయుచున్నారు.

## గ్రామజ్యోతి

పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ప్రజలే సారథులు కావాలని, గ్రామాభివృద్ధి ప్రజల భాగస్వామంతోనే సాధ్యమవుతుందని, ప్రభుత్వం ఇచ్చే నిధులు మరియు ప్రజల సంఘటిత శక్తి తోడైతే మార్పు సాధ్యమవుతుందని తద్వారా ప్రగతి సాధించాలనే దృఢ సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామజ్యోతి అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగింది.

దేశాభివృద్ధికి పల్లెలే పట్టుకొమ్మలు కావాలన్న మహనీయుని మాటలే గ్రామజ్యోతి కార్యక్రమానికి పునాది. అభివృద్ధి ప్రక్రియలో ప్రజలను సంపూర్ణ భాగస్వాములను చేయడమే గ్రామజ్యోతి ముఖ్య ఉద్దేశం. పంచాయతీ ఉద్యమం, సహకార ఉద్యమం, భూదాన ఉద్యమం వీటన్నింటికి స్ఫూర్తి చాటేలా ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలన్నదే గ్రామజ్యోతి కార్యక్రమ లక్ష్యం.

పల్లెసీమల్లో కొత్తవెలుగు నింపడం, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కాంతులు ప్రసరింపజేయడం, గ్రామంలోని సామాజిక సమస్యలను అక్కడి వారి సహాయంతో రూపుమాపడం తెలంగాణ ప్రభుత్వం కొత్తగా రూపొందించిన గ్రామ జ్యోతి లక్ష్యాలు. ప్రతి పనిలో స్థానికులనే భాగస్వాములుగా చేస్తూ పల్లెల అభివృద్ధికి బాటలు వేయడం గ్రామ జ్యోతి ప్రధాన ఉద్దేశ్యం.

ఇలాంటి విప్లవాత్మకమైన కార్యక్రమం వారోత్సవాలలో భాగంగా రాష్ట్ర గవర్నర్ శ్రీ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ 24-8-2015 నాడు హాజిపల్లిని సందర్శించినారు.

## హాజిపల్లి సందర్శనలో భాగంగా గవర్నర్

గ్రామ జ్యోతి కార్యక్రమం ప్రభుత్వానిది కాదు ప్రజలది. అది అందించే ఫలాలు అందుకునేది కూడా ప్రజలే. అందుకే కలిసికట్టుగా ముందుకు సాగండి... లక్ష్యసాధన తర్వాతే ఆగండి.. అని రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ప్రజలకు పిలుపునిచ్చారు.

గ్రామానికి చేరుకున్న గవర్నర్ నేరుగా గ్రామపంచాయతీని సందర్శించారు, అభివృద్ధిపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అక్కడి నుండి గ్రామాన్ని చూసుకుంటూ వెళ్లి గ్రామ పంచాయతీ నూతన భవనానికి మరియు డంపింగ్ యార్డుకు, నీటి సంపు నిర్మాణపు పనులకు శంకుస్థాపన చేశారు. తదనంతరం పాఠశాల దగ్గర సర్పంచ్ సింగారం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామజ్యోతి గ్రామసభకు ముఖ్య అతిథిగా గవర్నర్ హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి టి.కె. శ్రీదేవి ఐ.ఎ.ఎస్. గారు సభావేదికపైకి ముఖ్య అతిథులను, గౌరవ ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి గవర్నర్ చేత జ్యోతి ప్రజ్వలన చేయించారు.

ఈ సభలో గవర్నర్ మరియు పంచాయతీరాజ్ శాఖా మంత్రి తారక రామారావు గారు గ్రామస్థులతో, వివిధ కమిటీ సభ్యులతో వారు చేస్తున్న పనితీరు మరియు ప్రధానోపాధ్యాయుడి ద్వారా పాఠశాల పనితీరు, మహిళా సంఘాల ద్వారా వారి పనితీరు, విద్యార్థుల ద్వారా మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, అంగన్‌వాడి టీచర్ ద్వారా అంగన్‌వాడి సేవలు మొదలగు పథకాలపై ఆరా తీశారు, అమలు తీరు తెలుసుకున్నారు.

## గవర్నర్ ప్రసంగం

అభివృద్ధిలో మాడల్‌గా నిలిచిన హాజిపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని పాలమూరు జిల్లాలోని ప్రతి గ్రామం ప్రగతిని సాధించాలని అన్నారు. పంచాయతీ రాజ్ శాఖామంత్రి కె.తారకరామారావు గారి కోరిక మేరకు హాజిపల్లి గ్రామానికి వచ్చానన్నారు.

హాజిపల్లి గ్రామాన్ని ఇతర గ్రామస్థులు అధ్యయనం చేసి ఐకమత్యంతో అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వమే చేయదని, గ్రామస్థులు సైతం ముందుకు వచ్చి ప్రభుత్వ పథకాలను సరైన పద్ధతిలో నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ జిల్లాకు పరిశ్రమలు రాబోతున్నాయని రెండు మూడు సంవత్సరాల్లో నిరుద్యోగు లందరికి పరిశ్రమల ద్వారా ఉపాధి లభిస్తుందని వెల్లడించారు. 100% పన్నులను వసూలు చేస్తూ గ్రామపంచాయతీ నిధులను అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యానికి, ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని చెప్పారు.

గ్రామాభివృద్ధికి చేపట్టే ప్రతి కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు

కావాలన్నారు. ప్రజలందరిని ఒక వేదికమీదకు తీసుకువచ్చి గ్రామాలను అభివృద్ధి చేసుకోవడం చాలా అవసరం అన్నారు.

## నూటికి నూరు శాతం సాధించాలి

"అక్షరాస్యతలో ముందుండాలి, పరిశుభ్రతతో ముందడుగువేయాలి, ఆరోగ్య రక్షణ చర్యలు చేపట్టాలి, ఉపాధి అవకాశాలు రాణించాలి, అన్నింటా ప్రగతి సాధించాలి మీ ఊరు" అని ఈ సదస్సుకు షాద్‌నగర్ మరియు ఇతర నియోజకవర్గాలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన సర్పంచ్‌లను ఉద్దేశించి ఉత్సాహపరిచారు.



హాజిపల్లి గ్రామ సర్పంచ్, మాజీ సర్పంచ్ మరియు వార్డు సభ్యులను, గ్రామ ప్రజలను గవర్నర్ ఈ సందర్భంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న పంచాయతీరాజ్, ఐటి శాఖామాత్యులు శ్రీ కె. తారకరామారావు గారు మాట్లాడుతూ, గ్రామజ్యోతి కార్యక్రమం ఆచరణలో ఎలా ఉందో చూద్దామన్నా గవర్నర్ కోరిక మేరకు హాజిపల్లి గ్రామాన్ని ఎంపికచేశామన్నారు. అభివృద్ధి అవకాశాలు / వనరులు మెండుగా ఉన్నా జిల్లా మహబూబ్‌నగర్‌లో అభివృద్ధిని సాధించి చూపడం ద్వారా ప్రగతిలో ముందడుగు వేసిన ఈ హాజిపల్లి ఆదర్శమన్నారు. పారిశుధ్య కార్యక్రమాల కోసం ప్రతి గ్రామానికి చెత్త సేకరించే రిక్షాలను పంపిణీ చేయనున్నామని రాష్ట్రవ్యాప్తంగా 25 వేల రిక్షాలను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

వచ్చే 4 సంవత్సరాలలో గ్రామజ్యోతి ద్వారా గ్రామాలకు వచ్చే నిధులను ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులకు వినియోగించాలని సూచించారు. మహిళా సంఘాలకు ఇస్తున్న ఋణాన్ని రూ.5 లక్షల నుండి రూ॥ 10 లక్షల వరకు పెంచనున్నట్లు వెల్లడించారు.

## హాజిపల్లిలో మహిళా శిక్షణా కేంద్రం: మంత్రి జూపల్లి కృష్ణారావు

గవర్నర్‌తో పాటు హాజిపల్లి గ్రామాన్ని సందర్శించిన భారీ పరిశ్రమల శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, మహిళలు ఉపాధిలో రాణించడానికి వీలుగా మహిళలకు వివిధ రంగాలలో శిక్షణ ఇవ్వడానికి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి కృష్ణారావు గ్రామసభలో గవర్నర్ సమక్షంలో వెల్లడించారు. గ్రామాల్లో వెలుగులు నింపడానికి గ్రామజ్యోతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రజలు సంఘటితమై గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడానికి కొత్తూరు మండల కేంద్రంలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు.

## గ్రామజ్యోతి కార్యక్రమాలు

- రూ॥ 1.60 వేలతో డంపింగ్ యార్డు మంజూరు
- రూ॥ 13 లక్షలతో గ్రామపంచాయతీకి నూతన భవన మంజూరు
- త్రాగునీటికి భూగర్భట్యాంకు నిర్మాణం మంజూరు
- గ్రామంలోని మురికి నీరంతా ఊరి బయట చేర్చి భూగర్భంలో ఇంకింపజేయడానికి ఇంకుడుగుంత మంజూరు
- రూ॥ 30 లక్షలతో నూతన సి.సి. రోడ్లు, మరియు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ మంజూరు
- గ్రామస్థాయిలో 13 కార్యనిర్వాహక కమిటీలు ఏర్పాటు

## గ్రామంలో ప్రస్తుతం ఉన్న మొత్తం కార్యనిర్వాహక కమిటీలు

- త్రాగునీరు మరియు పారిశుద్ధ కమిటీ
- ఆరోగ్యం మరియు పౌష్టికాహార కమిటీ
- స్త్రీ మరియు శిశు సంక్షేమ కమిటీ
- విద్యా కమిటీ
- రోడ్డు మరియు భవనాల కమిటీ
- వ్యవసాయం మరియు నీటిపారుదల కమిటీ
- వీధి దీపాల నిర్వహణ మరియు విద్యుత్ ఆదా కమిటీ
- లబ్ధి దారుల ఎంపిక కమిటీ
- హరిత హారం కమిటీ మొక్కల పెంపకం సంరక్షణ
- బహిరంగ మలవిసర్జన మరియు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణ కమిటీ
- పింఛన్‌దారుల కమిటీ
- వికలాంగుల కమిటీ
- గ్రామైక్య సంఘం
- యువజన సంఘాల కమిటీ
- దేవాలయ కమిటీ
- మద్యపాన నిషేద కమిటీ
- కులవృత్తుల సంక్షేమ కమిటీ
- పన్ను వసూలు మరియు పర్యవేక్షణ కమిటీ
- సందర్శకులకు గ్రామం గురించి వివరించే కమిటీ
- పౌరసరఫరాల కమిటీ
- జీవనోపాధుల కమిటీ
- పాడి ఉత్పత్తుల కమిటీ

## అవార్డులు / పురస్కారాలు

- ❖ మాజీ సర్పంచ్ జంగమ్మ, ప్రస్తుత సర్పంచ్ సింగారం శ్రీనివాసులు కల నెరవేరి శ్రమ ఫలితం అవార్డుల రూపంలో దక్కింది.
- ❖ 2008 సంవత్సరం జనవరిలో రాష్ట్ర శుభ్రం అవార్డును నాటి ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా నాటి సర్పంచ్ శ్రీమతి జంగమ్మ గారు అందుకున్నారు.
- ❖ 2008 సంవత్సరం జిల్లా స్థాయి శుభ్రం అవార్డు నాటి జిల్లా కలెక్టర్ శ్రీ పురుషోత్తం రెడ్డి ఐ.ఎస్. చేతుల మీదుగా శ్రీమతి జంగమ్మ గారు అందుకున్నారు.
- ❖ 2014 సం॥ జాతీయ పురస్కారం : నిర్మల్ గ్రామ్ పురస్కార్ అవార్డును గౌ॥ శ్రీమతి ప్రతిభా పాటిల్ రాష్ట్రపతి గారిచేత పూణె లో జరిగిన జాతీయ సదస్సులో జంగమ్మగారు అందుకున్నారు. అంతేకాదు వేలమంది సర్పంచుల్లో జంగమ్మ గారికి ఆ వేదిక మీద మాట్లాడే అవకాశం రావడం రాష్ట్రానికే గర్వకారణం.
- ❖ 2014 జనవరిలో పాఠశాలకు నంది అవార్డు.
- ❖ 2014 ఫిబ్రవరి పాఠశాలకు జ్యూరీ అవార్డు (జానపద నృత్య పోటీలు) తిరుపతిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎం.పి. శివప్రసాద్ గారి చేతుల మీదుగా పాఠశాల విద్యార్థులు అవార్డు పొందారు.
- ❖ 2015 ఏప్రిల్ 24 జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం రోజు జాతీయ పురస్కారంగా పంచాయతీ స్వశక్తికరణ్ పురస్కారాన్ని భారతప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖామాత్యులు శ్రీ సి.హెచ్. బీరేందర్ సింగ్ మరియు సహాయమంత్రి నిహాల్ చాంద్ గార్ల చేతుల మీదుగా ప్రస్తుత సర్పంచ్ సింగారం శ్రీనివాస్ ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు.

జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ 2010 సంవత్సరం మార్చి 8న జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ హైద్రాబాద్ నందు నిర్వహించిన సదస్సులో జంగమ్మను సన్మానించారు. ఇంకా అనేక ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు జంగమ్మను సన్మానించారు.

## సందర్శనీయ గ్రామంగా.........

జిల్లా, రాష్ట్ర మరియు దేశ స్థాయిలో అవార్డులు పొందిన హాజిపల్లి గ్రామం సందర్శనీయ గ్రామంగా మారింది. ఇప్పటికి సందర్శించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి టి.కె. శ్రీదేవి ఐ.ఎ.ఎస్, గిరి జాశంకర్ ఐ.ఎ.ఎస్.పురుషోత్తం రెడ్డి ఐ.ఎ.ఎస్. గారు, శ్రీమతి దమయంతి ఐ.ఎ.ఎస్., శ్రీమతి ఉషారాణి ఐ.ఎ.ఎస్. గార్లు మరియు వీరితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు గ్రామాన్ని సందర్శించిన వారిలో ఉన్నారు. స్థానిక శాసనసభ్యులు, జిల్లా మంత్రులే కాకుండా, దేశ విదేశాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు జిల్లాలోని వివిధ మండలాల నుండి ప్రజాప్రతినిధులు మరియు అధికారులే కాకుండా గ్రామ ప్రజలు కూడా సందర్శకులుగా వచ్చి ఇక్కడి అభివృద్ధిని అధ్యయనం చేసి అభినందిస్తున్నారు.

తేది : 14-8-2013 నాడు ప్రత్యేకంగా పరిశ్రమల శాఖామంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు, 18-8-2015 నాడు ప్రత్యేకంగా పంచాయతీ శాఖా మంత్రి శ్రీ కె. తారకరామారావుతో పాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి 24-8-2015 న రాష్ట్ర గవర్నర్ శ్రీ నరసింహన్ సందర్శించారు.

తేది : 4-10-2015 నాడు రాష్ట్ర గ్రేహౌండ్స్ ఎస్.పి. రమేష్ రెడ్డి వారి సతీమణితో పాటు వారి స్వగ్రామమైన మస్తీపూర్ గ్రామ ప్రజలతో పాటు గ్రామాన్ని సందర్శించి ఇక్కడి అభివృద్ధిని అధ్యయనం చేశారు. మరియు తేది 17-9-2015 జాతీయ పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రొఫెసర్లు శివరాం గారు, గంగిరెడ్డి గారు, రమేష్ గార్ల నేతృత్వంలో 9 దేశాల ప్రతినిధులు 14 మంది సందర్శించి ఆ రోజు ప్రత్యేకంగా హాజిపల్లి గ్రామ పంచాయతీలో హాజిపల్లి గ్రామ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.

ఇప్పటి వరకు మొత్తం హాజిపల్లి గ్రామాన్ని 59 దేశాల ప్రతినిధులు సందర్శించారు.

## పంచాయతీ రికార్డుల నిర్వహణ

హాజిపల్లి పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మధుసూధన్ రెడ్డి గారు, పంచాయతీని స్థానిక ప్రభుత్వం పరిపాలనగా తీర్చిదిద్ది ప్రజలకు, పంచాయతీకి నిరంతరం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పంచాయతీరాజ్ చట్టం 1994 ప్రకారం జీవో 30 తేది 20-1-1995, జీవోఎంఎస్ నెం. 227 తేది 13-4-1995, జీవోఎంఎస్ నెం. 496 తేది 11-6-1996, జీవోఎంఎస్ నెం. 162 తేది 4-4-1997 ప్రకారం పంచాయతీస్థాయిలో నిర్వహించవలసిన వివిధ రకాల రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ ఇంకా అదనంగా ప్రత్యేకమైన రికార్డులతో పాటు మొత్తం 46 రకాల రికార్డులను నిర్వహించడం ఆశ్చర్యకరం. అంతేకాకుండా గ్రామానికి సందర్శన కొరకు వస్తున్న సందర్శకులకు ఒక గైడుగా గ్రామాభివృద్ధి గురించి ఇక్కడ ఆచరిస్తున్న ఉత్తమ ఆచరణల గురించి ప్రజల భాగస్వామ్యం గురించి ఇక్కడి ప్రగతి గురించి సందర్శకులకు వివరించడంలో మంచి బాధ్యతాయుతమైన పాత్రను నిర్వహిస్తున్నారు.

## సహపంక్తి భోజనంలో గవర్నర్

ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖామంత్రి సి. లక్ష్మారెడ్డి, శ్రీమతి టి.కె. శ్రీదేవి ఐ.ఎ.ఎస్., డి.ఐ.జి. గంగాధర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు నిరంజన్ రెడ్డి, జడ్.పి. ఛైర్మన్ బండారి భాస్కర్, ఎం.పి. జితేందర్ రెడ్డి, యం.ఎల్.సి. రాంచందర్ రావు, ఎమ్మెల్యేలు శ్రీ శ్రీనివాస్ గౌడ్, శ్రీ ఆల వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీ అంజయ్య యాదవ్,





శ్రీ గువ్వల బాల్‌రాజ్, పంచాయతీ రాజ్ కమీషనర్ శ్రీమతిఅనితా రామచంద్రన్, జాయింట్ కలెక్టర్ శ్రీ రాంకిషన్, జడ్.పి. సి.ఇ.ఓ. శ్రీ వి. లక్ష్మినారాయణ, డి.పి.ఓ. శ్రీ వెంకటేశ్వర్లు, పి.డి. శ్రీ డ్వామా దామోదర్ రెడ్డి, డి.ఎఫ్.ఓ. పద్మజ, పి.డి. డి.ఆర్.డి.ఎ. శ్రీ వెంకటయ్య, వ్యవసాయ జె.డి. ఉష, నీటి పారుదల ఎస్.సి. లింగరాజు, వైద్య ఆరోగ్య శాఖాధికారి గోవింద్ వాగ్మోరే, ఆర్.డి.ఓ. హన్మంత్ రెడ్డి గారు, ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఇ. ప్రసాద్ రెడ్డి, జడ్.పి.టి.సి. సభ్యురాలు అరుణ గోవింద్, యం.పి.పి. బుజ్జిబాబు, యం.పి.డి.ఓ. రాజేశ్వరి గారు, సర్పంచుల సంఘం రాష్ట్ర కన్వీనర్ పురుషోత్తం రెడ్డి, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్ధార్థ, డి.ఎల్.పి.ఓలు కృష్ణ గారు, వెంకటేశ్వర్లు, నారాయణ, ఎన్.ఐ.ఆర్.డి.ప్రొఫెసర్లు గంగిరెడ్డి, శివరాం తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శగ్రామంగా గంట్లవెల్లి గ్రామం

**మహబూబ్‌నగర్ జిల్లాలో 1959 లో నాటి ప్రధాని నెహ్రూ ప్రజాస్వామ్య పరిపాలనా వికేంద్రీకరణకు అంకురార్పణగా ప్రారంభోత్సవం చేసిన షాద్‌నగర్ పంచాయతీయే నేటి ఫరూఖ్‌నగర్ మండలం. ఈ మండలంలో గంట్లవెల్లి అనే ఒక కుగ్రామం ఉంది.**

ఈ గ్రామం జిల్లా కేంద్రానికి 58 కి.మీ.ల దూరం, రాజేంద్రనగర్‌లోని రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి సంస్థకు 50 కి.మీ.ల దూరంలో మండల కేంద్రానికి 8 కి.మీ. మరియు 44వ జాతీయ రహదారికి 7 కి.మీ.ల దూరంలో ఉన్నది. ఈ గ్రామానికి తూర్పున పాపిరెడ్డిగూడెం, పడమర చిల్కమర్రి, ఉత్తరాన కమ్మదానం, దక్షిణాన బూర్గుల గ్రామ సరిహద్దులు ఉన్నాయి.

గంట్లవెల్లి గ్రామం, కమ్మదనం అను గ్రామ పంచాయతీ పరిధిలో హ్యాబిటేషన్ గ్రామంగా ఉండేది. 1959లో గంట్లవెల్లి గ్రామ నివాసి సందడి జనార్ధన్ రెడ్డి గారు కమ్మదనం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు, 2వ సారి బి.సి. జనరల్ కోటాలో ఇదే గ్రామ నివాసి చక్కటి చెన్నయ్య యాదవ్ సర్పంచ్‌గా ఎన్నికైనారు. గంట్లవెల్లి గ్రామం 1981 లో కమ్మదనం నుండి విడిపోయి ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడింది.

ప్రస్తుతం గంట్లవెల్లి గ్రామానికి దేవుని బండతాండ, సోనితాండ వెంకటం బాయి తాండాలు ఆవాస గ్రామాలు, గ్రామంలో ప్రస్తుతం 10 వార్డులు ఉండగా, 387 కుటుంబాలున్నాయి. ఇందులో ఎస్సీ లవి 97, ఎస్టీలవి 182, బి.సి.లవి 84, మైనార్టీలవి 20 మరియు ఓ.సి.లవి 4 మొత్తం 387 కుటుంబాలు కలవు. జనాభా స్త్రీలు 993, పురుషులు 1049, మొత్తం 2042 మంది జనాభా వుండగా, 1127 మంది ఓటర్లు ఉన్నారు.





కమ్మదనం గ్రామ పంచాయతీ నుండి విడిపోయి ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడిన గంట్లవెల్లికి తొలి సర్పంచ్‌గా ఎస్టీ జనరల్ కోటాలో శ్రీ ముడావత్ నర్సింగ్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండవ సర్పంచ్‌గా శ్రీ లక్ష్మారెడ్డి గారిని, 3వ సర్పంచ్‌గా ఎస్టీ మహిళా రిజర్వ్‌డ్ కోటాలో శ్రీమతి బాదావత్ చాందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, 4వ సర్పంచ్‌గా ఎస్సీ జనరల్ కోటాలో శ్రీ బాదేపల్లి సిద్ధార్థ గారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, 5వ సర్పంచ్‌గా జనరల్‌లో సి. వెంకటేశ్ యాదవ్‌ను ఎన్నుకున్నారు,

2013 పంచాయతీ బి.సి. మహిళకు రిజర్వ్ కాగా 6వ సర్పంచ్‌గా బి.సి. మహిళా రిజర్వేషన్ కోటాలో శ్రీమతి కావలి లలితను సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. గంట్లవెల్లి గ్రామ నివాసురాలు అయిన అరుణా గోవింద్ గారు ఫరూఖ్‌నగర్ ప్రాదేశిక నియోజకవర్గం నుండి జిల్లా పరిషత్ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ప్రస్తుతం గంట్లవెల్లి గ్రామానికి ప్రథమ పౌరురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీమతి కావలి లలిత భాస్కర్, ఉపసర్పంచ్ వార్డు సభ్యులతో పాటు గ్రామ ప్రజలందరినీ ఒక తాటిపైకి తీసుకువచ్చి, ప్రజలను వివిధ సమావేశాల ద్వారా చైతన్య పరుస్తూ, ప్రజల భాగస్వామ్యం లేనిదే అభివృద్ధి సాధించలేమని, గట్టి పట్టుదల, కృషితో ప్రజలను ప్రతి కార్యక్రమంలో భాగస్వాములను చేస్తూ, జవాబుదారితనంతో, పారదర్శకమైన పరిపాలనను కొనసాగిస్తున్నారు.

మండలంలోని హాజీపల్లి, కిషన్‌నగర్ మరియు దూసకల్ గ్రామాలు ఆదర్శగ్రామాలుగా వివిధ పురస్కారాలు అందుకుని అందరి ప్రశంసలు పొందుతున్నందున, గంట్లవెల్లి సర్పంచ్ లలితాభాస్కర్, గంట్లవెల్లి గ్రామంలో అన్ని పథకాలను సక్రమంగా అమలు పరుస్తూ, గ్రామ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, గ్రామ అభివృద్ధే లక్ష్యంగా, అన్ని రంగాలలో గ్రామాన్ని అగ్రగామిగా తీర్చిదిద్ది ఆదర్శ గ్రామంగా నిలపాలన్నది తన ఆశయం అని, ఆ ఆశయం కోసం పరితపిస్తున్నానని సర్పంచ్ అన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలు

మహిళా సర్పంచ్‌గా సాటి మహిళల ఆత్మగౌరవం కాపాడుకోవటమే లక్ష్యంగా గ్రామంలో బహిరంగ మలవిసర్జన నిషేధిస్తూ ఇంటింటికి వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకునే విధంగా మహిళా సంఘాల సభ్యులను చైతన్యపరిచి, మరుగుదొడ్లు నిర్మించుకునే విధంగా ప్రేరేపించారు. ఇందుకుగాను చాలా కుటుంబాల వారు మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. వీధులన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటున్నారు.

'వరల్డ్ విజన్ ఇండియా' అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో నీటి శుద్ధి యంత్రాన్ని ఏర్పాటుచేసి ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన త్రాగునీరు అందిస్తున్నారు.

- వీధి వీధిలో సి.ఎఫ్.ఎల్. లైట్లు అమర్చి గ్రామాన్ని మరియు హ్యాబిటేషన్ గ్రామాలను కాంతిమయం చేశారు.
- గ్రామ వీధుల్లో 1928 మీటర్ల అంతర్గత సిమెంటు రోడ్లు నిర్మాణం చేశారు.
- 1816 మీటర్ల భూగర్భ డ్రైనేజి వ్యవస్థ ఏర్పరచి, గ్రామంలో మురికి నీరు పారకుండా చేశారు.
- 80% పన్ను వసూలుచేస్తూ, తద్వారా అభివృద్ధి పనులు చేస్తున్నారు.
- 75% అక్షరాస్యత ఉంది. 25% అక్షరాస్యత కోసం ప్రయత్నిస్తున్నారు.
- బడిఈడు పిల్లలందరూ బడిలో ఉన్నారు. బాలకార్మికులే లేరు.
- హరితహారం కార్యక్రమంలో 9300 మొక్కలు గ్రామంలో నాటి వాటిని సంరక్షిస్తున్నారు.
- మాతా శిశు మరణాలు గత 2 సంవత్సరాల నుండి జరగలేదు.
- నూటికి నూరు శాతం సంస్థాగత కాన్పులు జరుగుతాయి.
- మద్యపాన నిషేధం విధించారు.

## మౌళిక సదుపాయాలు

- గ్రామ పంచాయతీ భవనం చాలా విశాలంగా, అనుకూలంగా ఉంది.
- అప్పర్ ప్రైమరీ స్కూల్ ఉంది. సరిపడు గదులు మరియు విశాలమైన ఆటస్థలం ఉన్నాయి.
- ఇక్కడ విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం నేర్పటానికి 4 కంప్యూటర్లను ఇన్ఫోసిస్ వారు సహాయం చేశారు.
- మూడు అంగన్‌వాడి కేంద్రాలున్నాయి. ఇందులో 2 పక్కా భవనాలు ఉన్నాయి.
- 3 కమ్యూనిటీ హాల్స్ అనగా ఎస్సీలకు, బిసిలకు, ఎస్టీలకు భవనాలున్నాయి.
- సాక్షరభారత్ కేంద్రం
- వృత్తి విద్యా కుట్టు శిక్షణ కేంద్రం
- మినరల్ వాటర్ ప్లాంట్ గది

❑ ఓవర్ హెడ్ స్టోరేజ్ రిజర్వాయర్స్ 2

❑ గ్రౌండ్ లెవల్ స్టోరేజ్ రిజర్వాయర్స్ 6

❑ పౌర సరఫరాల కేంద్రం 1

❑ 146 మంచినీటి కనెక్షన్స్ ఉన్నాయి.

## స్వచ్ఛంద సంస్థల దాతృత్వం

1. వరల్డ్ విజన్ ఇండియా 2. లయన్స్‌క్లబ్ షాద్‌నగర్ వారు అనేక చేయూత కార్యక్రమాలు చేపట్టారు.

## విలేజ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్

1996 నుండి వరల్డ్ విజన్ ఇండియా సంస్థ దత్తత తీసుకుని గ్రామంలో విలేజ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. ఈ అసోసియేషన్‌కు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కావలి భాస్కర్ కూడా ఒక చురుకైన కార్యకర్తగా గంట్లవెల్లి గ్రామాభివృద్ధికి విశేషమైన కృషిచేస్తూ వారి ఆధ్వర్యంలో వరల్డ్ విజన్ ఇండియా సహకారంతో గ్రామంలో దాదాపు రూ॥ 25 లక్షల విలువైన అభివృద్ధి పనులు నిర్వహించారు.

యువజన సంఘాల సమన్వయంతో రాబోయే రోజుల్లో ఇంకా అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించి తమ గ్రామాన్ని కూడా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకుంటామని భాస్కర్ అన్నారు.

***ఈ దిగువ తెలిపిన ప్రకారం వరల్డ్ విజన్ ఇండియా సహకారంతో భాస్కర్ గారి నేతృత్వంలో జరిగిన పనులు :***

❑ రూ. 5.50 లక్షల విలువతో పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణం

❑ రూ. 2.50 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు

❑ రూ. 23 వేలతో పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల బహుమతులు

❑ రూ. 2.50 లక్షలతో 5000 లీటర్ల సామర్థ్యం కలిగిన 6 సింటెక్స్ వాటర్ ట్యాంకుల ఏర్పాటు

❑ రూ. 69 వేలతో చిరు వ్యాపారం చేసుకొనుటకు అనగా హోటల్, ఇస్త్రీ డబ్బా, చికెన్ సెంటర్ ఏర్పాటుకు ఆర్థిక సహాయం

❑ రూ. 6.40 లక్షల విలువతో 19 మందికి 19 గేదెలు మరియు 10 మందికి 10 ఆవులు

❑ రూ. 4 లక్షలతో ఒక్కొక్కరికి 5 మేకల చొప్పున 20 మందికి 100 మేకలు

❑ రూ. 75 వేలతో నలుగురికి వృత్తి విద్యా చదువుకోటానికి ఫీజులు చెల్లింపు

❑ రూ. 35 వేలతో 5 గురికి కానిస్టేబుల్స్ ఉద్యోగ కోచింగ్‌కు ఆర్థిక సహాయం

❑ రూ. 20 వేలతో 2 అంగన్‌వాడి కేంద్రాలకు ఫర్నీచర్ సదుపాయం

❑ రూ. 15 వేలతో సాక్షర భారత్ కేంద్రానికి పుస్తకాలు మరియు ఫర్నీచర్

❑ రూ. 40 వేలతో విలేజ్ మాడల్ అంగన్‌వాడి కేంద్రానికి బొమ్మలతో కూడిన పేయింటింగ్ చేయించారు.

***1996 నుండి 2012 వరకు వరల్డ్ విజన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన పనులు :***

❑ రూ. 7 లక్షల విలువతో పాఠశాలకు 2 అదనపు తరగతి గదుల నిర్మాణం

❑ రూ. 2.47 లక్షల విలువతో మాడల్ హౌజింగ్ కాలనీకి ఆర్థిక సహాయం

❑ రూ. 2 లక్షల విలువతో 2 చెక్‌డ్యాంల నిర్మాణం

❑ రైతులకు వ్యవసాయ విద్యుత్ పంపుసెట్ల సహాయం

❑ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగులు, ప్లేట్లు, గ్లాసుల పంపిణీ మరియు ఫర్నీచర్ సహాయం

❑ హెచ్.ఐ.వి. వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం సరఫరా

❑ రూ. 25 వేలతో గంటోనికుంట పూడికతీత పనులు



లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ చైర్మన్ రమేష్ యు.పి.ఎస్. పాఠశాలకు 4 కంప్యూటర్ టేబుల్స్ , 4 కుర్చీలు ఫ్లోర్ మ్యాట్ సహాయం చేశారు.

## మాడల్ వయోజన విద్యా కేంద్రం

రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ ఆర్థిక సహకారంతో, రాష్ట్ర వనరుల కేంద్రం, జాతీయ సాక్షరతా మిషన్ వారు దత్తత తీసుకుని, జిల్లా లోక్ శిక్ష సమితి ప్రోత్సాహంతో మాడల్ వయోజన విద్యాకేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రం ద్వారా గ్రామంలో నిరక్షరాస్యులైన వయోజనులందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం మరియు వృత్తి విద్యా నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలు జరుగుచున్నాయి. ప్రస్తుతం 20 మంది మహిళలు కుట్టు శిక్షణ పొందుతున్నారు.

ఈ కేంద్రం ద్వారా 3 కంప్యూటర్స్, 20 కుర్చీలు, 2 బీరువాలు, మైక్ సిస్టమ్, హార్మోనియం, ఎల్.సి.డి. కలర్ టి.వి., ఆట వస్తువులు మొదలగు వస్తువులు సమకూర్చారు.




## గంట్లవెల్లి అభివృద్ధికి వెన్నుదన్ను: బాదేపల్లి సిద్ధార్థ

గంట్లవెల్లి నివాసి, దళిత వర్గానికి చెందిన బాదేపల్లి సిద్ధార్థ ఈ గ్రామానికి 2001 నుండి 2006 వరకు ఏకగ్రీవ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించారు. నిరాడంబరులు, నిస్వార్థ సేవాపరులు, నిరంతర శ్రమజీవిగా నీతి, నిజాయితీతో గ్రామ అభివృద్దే తన ఆశయంగా నాటి నుండి నేటి వరకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్న, సామాజిక స్పృహ కలిగిన సమర్థ నాయకులు శ్రీ సిద్ధార్థ.

మాజీ ఎం.పి.టి.సి. సభ్యునిగా, భారత్ నిర్మాణ్ వాలంటీర్‌గా, గ్రామ స్వరాజ్ అను గ్రామాభివృద్ధి సంస్థకు చైర్మన్‌గా బాధ్యత నిర్వహిస్తూ, స్థానిక ప్రభుత్వాల పట్ల అపారమైన జ్ఞానం కలిగిన విజ్ఞాన వంతుడు. బి. సిద్ధార్థ తను సర్పంచ్‌గా ఉన్న కాలంలో గంట్లవెల్లి గ్రామానికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు, రూ. 2 కోట్లతో కమ్మదనం నుండి వయా గంట్లవెల్లి, శేరిగూడ వరకు బి.టి. రోడ్డు మంజూరు చేయించి దాన్ని నిర్మాణం చేయించడంలో కీలక పాత్ర పోషించారు.

గ్రామ ప్రజలు మరియు గౌడ సంఘం ఆర్థిక సహాయంతో రూ. 45 వేలతో గ్రామంలోని పాఠశాలకు 1 ఎకరా స్థలాన్ని కొనుగోలు చేశారు.

తదనంతరం గ్రామంలో ప్రజలందరు బొడ్డురాయి లేకపోవడం మనందరికి అరిష్టమని భావిస్తున్న తరుణంలో సిద్ధార్థ చొరవ తీసుకుని ప్రజలందరిని ఒక తాటిపైకి తీసుకువచ్చి ఐక్యపరచి సమిష్టి నిర్ణయంతో అందరి ఆలోచన భాగస్వామ్యంతో ఆర్థిక వనరులు సమకూర్చి తేది : 9-12-2012 నాడు గ్రామంలో బొడ్రాయి ఏర్పాటు చేయడం జరిగింది. నాటి నుండి నేటి వరకు గ్రామంలో ఎలాంటి కక్షలు, కార్పణ్యాలు, తగాదాలు, గొడవలు, కేసులు లేని గ్రామంగా గంట్లవెల్లి అని చెప్పుకోవచ్చు.

గ్రామ ప్రజల సమిష్టితత్వం ముందుచూపుతో సిద్ధార్థ భారతదేశంలోని ఆదర్శ గ్రామాల సమాచారం సేకరించి, వాటిని పూర్తిగా అధ్యయనం చేసి, తన జన్మభూమి రుణం తీర్చు కోవాలనే, తపన, సంకల్పం కృత నిశ్చయంతో గంట్లవెల్లి గ్రామాన్ని కూడా ఒక ఆదర్శ గ్రామంగా, రాష్ట్రంలోనే ఒక మంచి గ్రామంగా తీర్చిదిద్దాలనే తలంపుతో ప్రస్తుత సర్పంచ్ కావలి లలిత భాస్కర్ పాలకవర్గానికి వెన్నుదన్నుగా ఉంటూ అనేక సలహాలు, సూచనలు ఇస్తూ స్వయంగా ఒక సామాన్య కార్యకర్తగా గ్రామంలో అనేక పనులు నిర్వహిస్తూ ఉంటారు.

*'నీ కోసం బతికితే నీవు నీవుగానే మిగిలిపోతావ్ జనం కోసం బతికి చూడు వారి గుండెల్లో ఉండిపోతావ్'* అన్న మన రాజ్యాంగ నిర్మాత డా॥ బాబా సాహెబ్ అంబేడ్కర్ గారి సూక్తిని నిజం చెయ్యడానికి, ఇతరుల సంతోషమే తన సంతోషంగా భావిస్తూ, గ్రామ ప్రజలందరు, సుఖశాంతులతో ఉండాలంటే, గ్రామ పంచాయతీ పాలక వర్గం ప్రజల సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలు చూపినపుడే ప్రజలు సంతోషంగా ఉంటారు.

కాబట్టి లలిత సర్పంచ్ గారు సమర్థనాయకురాలిగా ఎదగాలని ప్రోత్సహిస్తూ, ప్రజల్లో కలుపుగోరుతనంతో ఉంటూ అభివృద్ధి ఆశాకిరణంగా ఒక కీలకమైన పాత్ర నిర్వహిస్తున్నారు బాదేపల్లి సిద్ధార్థ. ఇబ్బందుల్లో ఉన్నవారిని ఆదుకోవడం, సహాయం కోరిన వారికి సహాయం చేయడం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి సానుకూలంగా స్పందించే మనస్తత్వం ఈయన నైజం. అతి త్వరలో గ్రామం నిర్మల్ పురస్కార్ అవార్డు అందుకోవాలని అందుకు మేమంతా గట్టి పట్టుదలతో నిరంతర కృషి చేస్తున్నామని అన్నారు. సామాజిక సంస్కర్తగా, చైతన్యదీప్తిగా యువతకు స్ఫూర్తిగా నిలవాలన్నారు.

## పంచాయతీ రికార్డుల నిర్వహణ

పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గారు గ్రామ పంచాయతీలో నిర్వహించవలసిన వివిధ రకాల రికార్డులను సక్రమంగా నిర్వహిస్తు గ్రామ పంచాయతీకి, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ జవాబుదారీతనంతో పారదర్శకంగా పనిచేస్తూ తను కూడా ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దడానికి ప్రజలను ఎంతో చైతన్యం చేస్తున్నాడు.

## గ్రామాన్ని సందర్శించిన ప్రముఖులు

1. తేది : 10-9-2015 నాడు ప్రస్తుత జిల్లా కలెక్టర్ శ్రీమతి టి.కె. శ్రీదేవి ఐ.ఎ.ఎస్. గారు
2. తేది: 21-8-2015 నాడు ఎస్.ఎన్.డి.టి. మహిళా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రభాకర్ చౌహాన్ గారు వీరితో పాటు ఎన్.ఐ.ఆర్.డి. లో శిక్షణ పొందుతున్న వివిధ రాష్ట్రాలు ప్రతినిధులు, గుజరాత్, తమిళనాడు, రాజస్థాన్, కర్ణాటక, మధ్యప్రదేశ్.
3. తేది : 17-8-2015 నాడు శ్రీ వి. లక్ష్మినారాయణ గారు ముఖ్య కార్యనిర్వాహణాధికారి జిల్లా పరిషత్
4. తేది : 7-7-2015 నాడు ఆనంద్ దాసు గారు రాష్ట్ర డైరెక్టర్ వయోజన విద్యా – తెలంగాణ రాష్ట్రం
5. తేది : 17-1-2015 నాడు అదనపు జాయింట్ కలెక్టర్ శ్రీ పి. రాజారాం గారు
6. గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన పురుషోత్తం రెడ్డి ఐ.ఎ.ఎస్. గారు మొదలైన ప్రముఖులు ఈ గ్రామాన్ని సందర్శించిన వారిలో ఉన్నారు.

*– బి. వెంకటయ్య,* *డిటిఎం,*
*మహబూబ్‌నగర్*

# తెలంగాణ రాష్ట్రంలో "గ్రామజ్యోతి" కార్యక్రమం అమలు - పూర్వాపరాలు

**భారతదేశంలోని గ్రామాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను గత 68 సంవత్సరాల నుండి అమలు చేస్తున్నాయి. కాని పథకాలు అమలు వలన ఆశించిన ఫలితాలు పొందలేకపోతున్నారు. కారణం ఇంతపెద్ద దేశంలో కేటాయించిన బడ్జెట్‌కు లోబడి అభివృద్ధి రావడం లేదు. కేటాయించిన నిధులు సిబ్బంది జీతాలకు, ఆఫీసు ఖర్చులకు సరిపోవడం లేదు. పేద మధ్యవర్తులు, అమలు చేసేవారికి పోయి అసలు చేరవలసిన వారికి చేరడం లేదు. అందుకే ఆనాటి మన ప్రధాని రాజీవ్‌గాంధీ గ్రామ పంచాయతీలకు కేటాయించిన నిధులలో కేవలం రూపాయికి 15 పైసలే చేరుతున్నాయి. మిగతావి కాంట్రాక్టర్లు, బ్రోకర్లు, దళారులు, మధ్యవర్తులకు రాజకీయపార్టీలకు చేరుతూ ఉన్నాయి.**

ఈ నేపథ్యంలో గ్రామాలకు / పంచాయతీలకు చేరువ అయ్యేలా ప్రత్యక్షంగా గ్రామ సర్పంచులకు నిధులు చేరునట్లు రాజ్యాంగంలోని 40వ ప్రకరణను మార్చారు. నూతనంగా 73,74 వ రాజ్యాంగ సవరణలు తెచ్చి గ్రామాలకు నిధులు కొరత తీర్చేలా చేశారు. వాటిని తూ.చ. తప్పకుండా అమలు చేసిన కర్నాటక, కేరళ, గుజరాత్, పశ్చిమబెంగాల్ లాంటి రాష్ట్రాలలో అమలు చేసి అభివృద్ధితో ముందుకు వెళుతున్నాయి.

మిగతా రాష్ట్రాలు కూడా అదే బాటలో నడవాలని ప్రయత్నిస్తున్నాయి. ఆ నేపథ్యంలో నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్‌రావు, మంత్రి శ్రీ కె. తారకరామారావులు గ్రామాభివృద్ధిని సాధించేందుకు ప్రతి గ్రామం తమ పనులను తాము చేసుకొని ముందుకు నడిచేందుకు ఒక పథకం / కార్యక్రమాన్ని ప్రజల ముందుకు తెచ్చారు. అదే 'గ్రామజ్యోతి' కార్యక్రమం.

ఈ కార్యక్రమం లక్ష్యాలు ఏమిటి? ఎవరికోసం అమలు చేయబడుతుంది? అనే అంశాలతోపాటు ఆ కార్యక్రమాన్ని ఎవరు అమలు చేస్తారు? ప్రశ్నలకు సమాధానం లభిస్తుంది. ఈ గ్రామ జ్యోతి కార్యక్రమాన్ని ప్రజల కోసం అమలు జరిపేది. గ్రామజ్యోతి అనగా రాష్ట్రంలోని అన్ని గ్రామాలు తమ గ్రామాభివృద్ధికి కావలసిన పనుల ప్రణాళికలను రూపొందించుకొని గ్రామసభ అనుమతితో వరుసగా పథకాలను అమలు చేయటానికి నిర్దేశించిన విధంగా ప్రణాళికలను తయారు చేసుకొని అమలు చేసి అభివృద్ధి పథంలోకి నడిపించడం జరుగుతుంది.

తెలంగాణ రాష్ట్ర కుటుంబాలను ఆర్థిక రేఖ ఎగువకు తీసుకొని రావడం. యువతను 'గ్రామసభ'లో అనుబంధంగా పనిచేసి వాటి పురోభివృద్ధికి కృషి చేయడం అని చెప్పారు. గ్రామజ్యోతి కార్యక్రమాన్ని అమలు చేసే సిబ్బంది, ప్రజలు ఎన్నికైన ప్రతినిధులు గ్రామజ్యోతి కార్యక్రమాన్ని అమలు చేయాలి. తద్వారా గ్రామాభివృద్ధి జరగాలి. గ్రామజ్యోతి కార్యక్రమం ద్వారా గ్రామాభివృద్ధికి ఏడు లక్ష్యాలను నిర్ణయించారు.

అవి- గ్రామ పారిశుద్ధ్యం మరియు త్రాగునీటి కమిటీ, ఆరోగ్యం మరియు పోషకాహార కార్యచరణ కమిటి, విద్యా కార్యచరణ కమిటి, సామాజిక భద్రత మరియు పేదరిక నిర్మూలనా కార్యచరణ కమిటి, వ్యవసాయ కార్యచరణ కమిటి, సహజవనరుల యాజమాన్య కార్యచరణ కమిటి, మౌళిక వసతుల కార్యచరణ కమిటీల ద్వారా పనులు నెరవేర్చడం. ఈ పద్ధతిని వరంగల్ జిల్లాలోని గంగదేవినిపల్లి గ్రామం చేసి విజయాన్ని చవిచూపించింది.

గంగదేవిపల్లిలో సర్పంచ్ ఆధ్వర్యంలో 24 కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది అవి: 1. నీటిసరఫరా కమిటీ 2. మార్కెటింగ్ కమిటీ 3. ఆరోగ్య కమిటీ 4. పారిశుద్ధ్యపు కమిటీ 5. పౌష్టికాహార సరఫరా 6. అంగన్‌వాడి 7. విద్యాకమిటీ 8. సాక్షరత కమిటీ 8. స్వచ్ఛ భారత్ కమిటీ 12. వాటర్‌షెడ్ కమిటీ 13. త్రాగునీరు కమిటీ 14. చెఱువుల అభివృద్ధి కమిటీ 15. చెత్త తొలగింపు 16. మహిళా సంఘాల కమిటీ 17. స్మశాన వాటిక నిర్వహణ 18. రోడ్ల నిర్మాణం 19. మురుగు కాలువ నిర్వాహణ కమిటీ 20. మరుగురోడ్ల నిర్మాణం 21. అక్షరాస్యత పెంపుదల సంఘం 22. పనుల సంఘం 23. ఆహార కమిటీ 24. ధరలు నిర్ణయం కమిటీ. ఆ గ్రామంలో జరుగుతున్న ప్రతి కార్యక్రమం పారదర్శకంగా గ్రామసర్పంచ్ ఆధ్వర్యంలో జరిగాయి. జరపాలి.

73వ రాజ్యాంగ సవరణ 'గ్రామసభకు' ప్రాధాన్యతనిచ్చింది. ప్రతి ఏడాది నాలుగుసార్లు సమావేశాలు నిర్ణయించి, నిర్వహించి అందులో సమస్యలపై చర్యలు తీసుకోవాలి. వాటిని కమిటీలు తప్పకుండా అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి.

ఈ రీతిలో కేరళ ప్రభుత్వ పంచాయతీశాఖ గ్రామాభివృద్ధిని 1995 నుండి 73వ రాజ్యాంగ సవరణను అనుసరించి 29 అధికారాలు గ్రామపంచాయతీలకు కట్టబెట్టారు. ప్రాథమిక స్థాయిలో

గ్రామపంచాయతీలు బ్లాక్ స్థాయి, జిల్లా స్థాయిలలో స్థానిక పాలనను అమలు చేసి గ్రామాలను సర్వతోముఖాభివృద్ధిగా కృషి చేశారు.

73వ రాజ్యాంగ సవరణ ప్రకారం పంచాయతీలకు కేంద్రం నిధులు పొందాలంటే – పంచాయతీలకు కాలానుగుణంగా నిధుల అందాలంటే 1. ఎన్నికలు సకాలంలో నిర్వహించాలి. 2. రాష్ట్రంలో ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేసుకోవాలి. 3. ఆర్థిక సంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవాలి. అప్పుడే గ్రామపంచాయతీలకు నిధులు కేంద్రం విడుదల చేస్తుంది. కనుక ఈ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తేనే కేంద్రం నిధులను కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ నుండి గ్రామపంచాయతీలకు నిధులను అందించడం జరుగుతుంది. ఆ నిధులను కేంద్రం కేటాయిస్తే ఖర్చు చేసేది మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలే. కేంద్రం విధించిన నిబంధనలు పూర్తి చేసి నిధులు పొంది తమ శాఖకు కావలసిన విధంగా ఖర్చు చేయడం పథకాలు అమలు చేసుకోవడం జరుగుతుంది.

తెలంగాణ రాష్ట్రంలోని తెలంగాణ రాష్ట్రీయ సమితి (టిఆర్ఎస్) ప్రభుత్వం నెలకొల్పి సంవత్సర కాలం అయిన తరువాత గ్రామజ్యోతి కార్యక్రమాన్ని పెద్దఎత్తున రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. అది అభివృద్ధి చెందిన గంగదేవినిపల్లిలో ప్రారంభించడం జరిగింది. ఆగస్టు 17 నుండి 26 వరకు గ్రామజ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించగా, గ్రామప్రజలు అధికంగా పాల్గొన్నారు. గ్రామాలలో పర్యటించి మంత్రులు, సిఇఓలు, తదితరులు పాల్గొని ప్రజలలో గ్రామజ్యోతిని గూర్చి ప్రచారం చేస్తూ వారిలో ఒక స్పార్క్ / చైతన్యం లభించి మరి కొన్ని మంచి అభివృద్ధి పనులను నిర్వహించడం జరుగుతుంది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు – మన ప్రణాళిక, చెఱువుల అభివృద్ధి, కాకతీయ మిషన్ క్రింద పనులు చేపట్టి 9600 చెఱువులకు పూడికలు తీసి గ్రామాలలో సాగునీరు (లేదా) త్రాగునీరు ఇబ్బందుల ను తొగించగలిగారు. త్రాగునీరు కుళాయిల ద్వారా గ్రామాలకు ఇంటింటికి పంపు పథకాన్ని అమలు చేయటం కొనసాగుతూ ఉంది. వాటివల్ల గ్రామజ్యోతి కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ఈ అవగాహన సదస్సులను నిర్వహించారు. గ్రామజ్యోతి ఇందులో అన్ని శాఖలు భాగస్వాములే. దీన్ని గ్రామసభ నిర్వహించి అన్ని శాఖల సమన్వయంతో ఆయా పనులు ఏడు కార్యక్రమాలు అమలయ్యేట్లు చేయడమే గ్రామజ్యోతి కార్యక్రమ లక్ష్యం.

'గ్రామాభివృద్ధికి ప్రజల చేత ప్రజల కొరకు ప్రజలచే' అమలు చేసే కార్యక్రమమే గ్రామజ్యోతి అని వివరించవచ్చు. ఈ గ్రామాభివృద్ధి కార్యక్రమాలు సర్పంచుల ఆధ్వర్యం గ్రామసభను సమావేశం చేసి ఆ గ్రామంలో ప్రధాన సమస్య ఏమిటి? ఆరోగ్య సమస్యలను తొలగించడం, ఆరోగ్య సమస్యలు రావడానికి తగిన త్రాగునీరు లేకపోవడం, బహిరంగ మలవిసర్జన చేయడం, మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టాలి. ఇట్లా ఒకదానితో ఒకటి ముడిపడి ఉండే తీరులో సర్పంచ్ ఆలోచన, గ్రామసభ తీరు. ఇవి అన్ని ఆ ఊరి సమస్య పరిష్కారానికి దారి తీస్తుంది.

ఆ గ్రామంలో నిరక్షరాస్యులు అధికంగా ఉండడం వలన వారికి తగిన ఉపాధి లేకపోవడం లాంటి సమస్యలు త్వరితగతి పరీక్షించాలని నిర్ణయించడం ఆ కమిటీలు – గ్రామసభ నియమించిన కమిటీలుగా పనిచేస్తాయి.

ముఖ్యంగా ప్రజా పంపిణీ వ్యవస్థ క్రింద బియ్యం పంపిణీ జరిగేట్లు చూడడం. వృద్ధాప్య పింఛనులు పంచడం అవసరాలకు ప్రజలను ఆదుకోవడం గ్రామ సమన్వయ కమిటీ చూస్తుంది. ప్రభుత్వ పథకాలు గ్రామంలో అమలౌతున్నాయా? లేదా అనే విషయాలను ఆయా గ్రామాల అంతర్ కమిటీలు చూసే చేసేట్లు చేస్తారు. గంగదేవినిపల్లి, రామచంద్రపురం, అంకాపూర్‌లలో జరిగేట్లు అన్ని గ్రామాలలో పని చేయించడం గ్రామజ్యోతి కార్యక్రమ ఉద్దేశ్యం.

ప్రతిగ్రామం, గ్రామసర్పంచ్ నేతృత్వంలో ప్రభుత్వ కార్యక్రమాలు అందరికి అందేలా చేసి నిరక్షరాస్యతను పాలద్రోలాలి. తెలంగాణ రాష్ట్రంలో అక్షరాస్యత 58% గానే ఉంది. దాని 72% పైగా పెంచడం. అధిక జనాభా పెరుగుదలను అరికట్టడం– పిల్లలకు పౌష్టికాహారం లభించేట్లు, వైద్యసహాయం అందేట్లు చేయడానికి గ్రామపంచాయతీలు, మండల, జిల్లా అధికారుల సహాయంతో తమ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి. ఈ లక్ష్యాలను సాధించిలే ఉత్తేజాన్ని రేకెత్తించేందుకు గ్రామజ్యోతి కార్యక్రమం అవగాహన సమావేశాలు ఎంతగానో తోడ్పడుతాయి.

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న సహజవనరులు, ఖనిజ సంపదను ఉపయోగించుకొని గ్రామాలు ముందుకు నడవాలనే లక్ష్యంతో టిఆర్ఎస్ ముఖ్యమంత్రి, పిఆర్&ఆర్‌డి మంత్రి పలు విధాలుగా గ్రామాభివృద్ధిని ముందుకు నడిపేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో ప్రజలు అధికంగా పాల్గొని లబ్ధిని పొందాలని ఆశిస్తున్నారు.

తెలంగాణ ప్రాంతంలోని వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి దేశానికి విత్తనాలు సరఫరా చేసే రాష్ట్రంగా పేరు పొందాలని ఇప్పటికే ఆదిలాబాద్‌లోని జొన్న, మొక్కజొన్న విత్తనాల ద్వారా ఇతర రాష్ట్రాలు పండించుకొని లబ్ధి పొందుతున్నాయి. రాజస్థాన్, పంజాబ్, ఢిల్లీలు మన రాష్ట్ర జొన్నవిత్తనాలు, మొక్కజొన్న విత్తనాలు వాడి అధిక లాభాలు పొందుతున్నారని నివేదికలు తెలుపుతున్నాయి.

'ఇల్లు బాగుపడితే – గ్రామం బాగుపడుతుంది' తద్వారా మండలం బాగు పడుతుంది – జిల్లా, రాష్ట్రాలు కూడా అభివృద్ధి చెందుతుందనే భావనతో రాష్ట్ర అధికారులు నడుస్తున్నారు. వచ్చే ఐదేళ్ళలో ఆ మార్పు స్పష్టంగా కన్పిస్తుందని, గ్రామజ్యోతి కార్యక్రమం విజయవంతం అవుతుందని ఆశిద్దాం.

*– డాక్టర్ ఆసయ్య, టి.సిపార్డ్*



# ఈ పల్లెలను చూసి నేర్చుకుందాం...

**దేశ అభివృద్ధి పల్లెనుంచే ప్రారంభమవ్వాలి. గ్రామస్వరాజ్యం వర్ధిల్లినప్పుడే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి వైపు పయనిస్తుంది. 60 ఏండ్ల నిర్లక్ష్యం, స్తబ్ధత తరువాత ప్రతి పల్లె ఇప్పుడు కొత్త చిగురులు వేయాల్సి ఉన్నది. అమాసచీకటిగా మారిన ప్రగతి ఆనవాళ్లకు కొత్త వెన్నెల పూయించాలె. బీటలు వారిన చెరువులను నీటి చెలిమలు చేసి ఒక్కో నీటి చుక్కను ఒడిసిపట్టుకోవవాలె. క్రిమి సంహారకాలతో విషతుల్యమైన భూముల్లో సహజ ఎరువులు వేసి 'ఎర్ర' లను ఎదగనియ్యాలె.**

గ్రామం ఒక యూనిట్‌గా అభివృద్ధి నమూనాను ప్రవేశపెడితే విజయం తప్పకుండా వరిస్తుందనేది అక్షరసత్యం. తెలంగాణ ప్రభుత్వం పల్లె బాగుకోసం ప్రవేశపెట్టిన 'మిషన్ కాకతీయ', 'వాటర్‌గ్రిడ్', 'గ్రామజ్యోతి', 'గుడుంబా నియంత్రణ' 'ఇంటి పన్నులు చెల్లించడం', 'విత్తనోత్పత్తి' వంటి కార్యక్రమాలన్నీ గ్రామాల అభివృద్ధి కోసం ఉపయోగపడేవే. ఇవన్నీ విజయవంతం కావాలంటే ప్రతి పల్లె కదలాలి. ప్రగతిని ఆహ్వానించాలి. ఇదంతా ఒక్కరోజులో కాకపోవచ్చు. కానీ అసాధ్యమేమి కాదు. ప్రగతి బాట పయనించిన గందేవిపల్లె, అంకాపూర్ గ్రామాలే దీనికి మంచి ఉదాహరణ.

గంగదేవిపల్లి... వరంగల్ జిల్లా, గీసుకొండ మండలంలోని గ్రామం. 1994 సెప్టెంబర్‌లో గ్రామ పంచాయతీగా ఏర్పడింది. ఆనాటి నుంచి గ్రామస్తులంతా సంఘటితమై గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేశారు. దాని ఫలితంగా 2007లో ఈ గ్రామ నిర్మల్ జాతీయ పురస్కారం అవార్డు పొందింది. ఒకప్పుడు ఈ గ్రామంలో నాటుసారా ఏరులై పారేది. దీనికి జీవితాలు బలయ్యాయి. గ్రామస్తుల్లో ఆలోచన మొదలైంది. నాటుసారా విక్రయాలు నిషేధించారు. అక్షరాస్యత, మధ్య నిషేధం, ఇంటింటికి పారిశుద్ధ్య సదుపాయం, కుటుంబ నియంత్రణ, రూపాయికే ఫ్లోరైడ్ రహిత నీరు ఆ గ్రామం సాధించిన ప్రగతి సూచికలు.




నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ జాతీయస్థాయిలో ఉత్తమ గ్రామంగా పేరు తెచ్చుకుంది. శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, పంట మార్పిడి, సస్యరక్షణ వంటి పద్ధతులతో వీరంతా ఇక్కడ ఒక రకంగా బంగారమే పండిస్తున్నారు. గ్రామస్తులంతా గ్రామాభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసుకుని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గ్రామపంచాయతీ కార్యాలయం, రైతు సంఘం భవనం, పశు వైద్యశాల, పాఠశాల ఆధునికీకరణ, సెంట్రల్

లైటింగ్ విధానం, ఆధునిక ఇండ్ల నిర్మాణం, మార్కెట్ యార్డ్ వంటివన్ని స్వయం కృషితో ఏర్పాటు చేసుకున్నారు. గ్రామ పంచాయతీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం, నూటికి నూరుశాతం పన్నులు చెల్లించడం, ఆధునిక వ్యవసాయ విధానం వీరి విజయంలో భాగం. రెండుసార్లు ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైన అంకాపూర్ స్వయం సమృద్ధికి నిదర్శనం.

నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలో ఉన్నది ముత్యంపల్లి. ఆ గ్రామంలోని సగం మంది ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లారు. మిగతావారు మాత్రం వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. 320 కుటుంబాలున్న ఈ గ్రామం  నూటికి నూరుశాతం ఇంటి పన్నులు చెల్లిస్తూ జిల్లాకే కాక, రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నది. ఒకప్పుడు ఆర్థిక సమస్యలతో గడిపిన ఆ గ్రామస్తులు ఇప్పుడిప్పుడే తమ కాళ్లమీద నిలబడ గలుగుతున్నారు.




మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్ మరో ఆదర్శగ్రామం. గ్రామ వికాసమే దేశ వికాసమన్న గాంధీ మాటలను అక్షరాల నిజం చేస్తూ పాడిపంటలకు నిలయంగా అభివృద్ధికి కేంద్ర బిందువుగా మార్చుకున్నారు. ఆహారధాన్యాల ఉత్పత్తిలో ముందుంటూ గ్రామాభివృద్ధే లక్ష్యంగా ఇక్కడి ప్రజలు పనిచేస్తున్నారు. నలభై సంవత్సరాలుగా గ్రామ సర్పంచ్‌ను, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ ఆదర్శంగా నిలిచారు. 20 ఏళ్లుగా ఇదే గ్రామం ఉత్తమ పంచాయతీగా అవార్డు అందుకుంటున్నది.

వేల్పూర్ మండలంలోని అంకాపూర్ మరో ఆదర్శ గ్రామం. ఇక్కడి రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఒకప్పుడు జిల్లా వ్యాప్తంగా పసుపును అధికంగా పండించేవారు. గ్రామస్తులంతా ఏకతాటిపై నిలబడి 1.93 కోట్లతో సంతమల్లన్న ఎత్తిపోతల పథకాన్ని సాధించుకున్నారు. దీంతో నీటి కరువు లేకుండా పంటలకు నీరందుతుంది. సకాలంలో పన్నులు చెల్లిస్తూ సొంత నిధులు రూ. 10 లక్షలు వెచ్చించి వాణిజ్య సముదాయాన్ని, 7 లక్షలతో సంఘ భవనం, 1.50 లక్షలతో తాగునీటి ప్లాంటు ఏర్పాటు చేసుకున్నారు. తమ ఇష్టదైవమైన సంతమల్లన్నకు ప్రతి ఏడాది రూ. 2 లక్షలు వెచ్చించి పెద్దఎత్తున జాతర నిర్వహిస్తున్నారు.

సిద్ధాపూర్.. ఒకప్పుడు ఈ గ్రామం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కింద ముంపునకు గురైంది. గ్రామపంచాయతీగా ఏర్పడినా నాటినుంచి కూడా ఇక్కడ ఎలాంటి ఎన్నికలు లేకుండా అందర్నీ ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నారు. అంతేకాక అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ అందరూ ఒకరికే ఓటు వేస్తూ తమ ఐక్యతను చాటుకుంటున్నారు. 1995లోనే రాష్ట్రంలోనే తొలి ఇంటర్నెట్ గ్రామంగా చరిత్రకెక్కింది. విశాలమైన రోడ్లు, కళాతోరణాలు, కళ్యాణమండపం ఇలా అన్ని సౌకర్యాలు కల్పించుకున్నారు. ఈ గ్రామంలో 95 వరకు డాబాలే కనిపిస్తాయి. అంతేకాదు ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉంటుంది.

నిజామాబాద్ జిల్లాలోనే మరికొన్ని గ్రామాలు సంపూర్ణ మద్యనిషేధాన్ని పాటిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. కామారెడ్డి డివిజన్‌లోని ఏడు గ్రామాల్లో భిక్కునూరు, మాచారెడ్డి మండలాల్లోని రెండేసి గ్రామాల్లో మద్యం అమ్మకాలు లేవు. భిక్కునూరు మండలం అంతంపల్లిలో, ర్యాగట్లపల్లిలో సంపూర్ణ మద్యనిసేధాన్ని అమలు చేస్తున్నారు. అట్లే సదాశివనగర్ మండలం భూంపల్లి, లింగంపేట మండలం సురాయిపల్లి, నాగిరెడ్డిపేట మండలం వెంకంపల్లి, మాచారెడ్డి మండలం బందరామేశ్వర్‌పల్లి, ఫరీద్‌పేటలోనూ మద్యనిషేధం అమల్లో ఉన్నది.

కరీంనగర్ జిల్లా పెద్దపల్లి నియోజకవర్గంలో నిట్టూరు, నిమ్మనపల్లి, బొంటకుంటపల్లి గ్రామాలు మద్యాన్ని నిషేధించి ఆదర్శంగా నిలిచాయి. ఈ పోరాటం 2006 నుంచి ప్రారంభమైంది. ఇక చిట్టూరుతో పాటు అనుబంధ గ్రామం నిమ్మనపల్లిలో కూడా మద్యం విక్రయాలు జరగకుండా మహిళలు పైచేయి సాధించారు. ఈ బాటలోనే చిన్నకల్వల గ్రామంలోనూ తొమ్మిదేళ్లుగా మద్యనిషేధం అమలవుతోంది. ఈ రెండు గ్రామాలను ఆదర్శంగా తీసుకొని, బొంతకుంటపల్లి గ్రామంలో కూడా మహిళలు ఉద్యమించారు.

ఆదిలాబాద్ జిల్లా జైనాథ్ మండలంలోని పెందలవాడ గ్రామం శానిటేషన్ రంగంలో ఆదర్శంగా నిలుస్తోంది. ఇక్కడి గ్రామాభివృద్ధి కమిటీ గ్రామ ప్రజల్లో తీసుకువచ్చిన చైతన్యంతో గ్రామస్తులు ఎవరికీ వారే తమ ఇంటి ఆవరణలో మరుగుదొడ్డిని నిర్మించుకున్నారు. గ్రామాభివృద్ధి నిధుల కింద ప్రభుత్వం ప్రతి ఇంటికి రెండు విడతలుగా ఏడు వేలను కేటాయించి మరుగుదొడ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించింది. ఇవన్నీ మచ్చుకు కొన్ని మాత్రమే.

అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలంటే పాలించే ప్రభుత్వం పారదర్శకంగా ఉండాలి. ఒక వ్యవస్థ అభివృద్ధి చెందాలంటే అందులోని వ్యక్తులు పూనుకోవాలి. అభివృద్ధి సంస్థాగతంగా జరిగితేనే సత్ఫలితాలిస్తుంది. అంటే పల్లె నుంచే ప్రగతి ప్రారంభమవ్వాలి. పల్లెలు మెట్లెక్కితేనే రాష్ట్రమైనా, దేశమైనా పురోగమిస్తుంది. వ్యక్తులు, సమాజం సమిష్టిగా శ్రమిస్తే మనం కలలు కంటున్న 'బంగారు తెలంగాణ సాధ్యమే'.

**– ఎన్.పి.ఆర్.**




# 72 గంటల్లో సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా 'నవాబ్‌పేట్'

**ఇది మెదక్ జిల్లా హత్నూరు మండలం నవాబుపేట గ్రామం. అదొక మారుమూల కుగ్రామం. ఒక వేయి నాలుగు వందల జనాభా కలిగిన ఈ గ్రామం మిగతా అన్ని గ్రామాలలాగానే ఆ గ్రామం కూడా పేదరికం, అపరిశుభ్రం, అనారోగ్యం లాంటి అనేక రుగ్మతలతో సతమతమవుతున్న గ్రామం. గ్రామంలో మురుగునీటి వ్యవస్థ సరిగాలేక, రోడ్లమీద, ఇండ్ల మధ్య చెత్తా చెదారం, పిచ్చి మొక్కలతో పూర్తిగా అపరిశుభ్ర వాతావరణంలో ఆ గ్రామ ప్రజలు హానికారక దోమలు, ఈగలు, క్రిములు, కీటకాలతో సహ జీవనం చేస్తుండడం వలన వారు అనేక రోగాలబారిన పడి దుర్భరమయిన జీవితాలను గడుపుతుండేవారు.**



ముఖ్యంగా మరుగుదొడ్ల సౌకర్యం లేక మహిళలు, పిల్లలు, వృద్ధులు, రోగులు నానా అవస్థలు పడేవారు. బహిర్భూమి కోసం గ్రామానికి చాలా దూరంలో చెట్లచాటున, పొదల మాటున కూర్చోవడం వల్ల పాముకాటు వంటి క్రిమి కీటకాల ప్రమాదాలకు గురయ్యేవారు. మహిళలు స్నానం చేయాలన్నా పొరక, తడకల మాటున చేయడం వల్ల వారి ఆత్మగౌరవానికి భంగం కలిగే సంఘటనలు చోటుచేసుకునేవి.

**"స్వాతంత్య్రం కన్నా పారిశుద్ధ్యం మిన్నా" అన్నారు మహాత్మాగాంధీ.**

ఇటువంటి అయోమయ, దయనీయ పరిస్థితులలో ఉన్న నవాబుపేట గ్రామం కేవలం 72 గంటల్లో సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా, గ్రామ రూపురేఖలే మారి నయా నవాబుపేట గ్రామంగా మారింది.

అనేక రుగ్మతలతో సతమతమవుతున్న నవాబుపేట గ్రామాన్ని మెదక్ జిల్లా కలెక్టర్ శ్రీ రొనాల్డ్ రాస్ సందర్శించి గ్రామ పరిస్థితులను కళ్ళారా చూసి ఆ గ్రామ రూపురేఖల్ని మార్చాలి, గ్రామాన్ని సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా తీర్చిదిద్దాలి. గ్రామ ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చూడాలనే సత్ సంకల్పంతో, గ్రామజ్యోతి కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామాన్ని దత్తత తీసుకోవడం జరిగింది.

అనుకున్నదే తడవుగా ఆ గ్రామస్థులను కొంతమందిని సిద్దపేట మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి ఆ గ్రామ ప్రజలు



గ్రామంలో ఇంకుడు గుంతలు (మ్యాజిక్ పిట్లను) నిర్మించుకుని, సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా ఏర్పాటు చేసుకున్న విధానాన్ని చూడడానికి క్షేత్ర సందర్శనకు పంపడం జరిగింది. జిల్లాలోని అన్ని మండల పరిషత్ అధికారులు మరియు జిల్లాలో గల 46 మండలాల్లోని మండల స్థాయి అధికారులందరితో 46 కమిటీలను ఏర్పాటు చేసి వారికి వ్యక్తిగత మరుగుదొడ్లు మరియు ఇంకుడు గుంతల (మాజిక్ పిట్ల) నిర్మాణం, నిర్వహణలపై అవగాహన కల్పించడంతో పాటు వాటి నిర్మాణానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవడం జరిగింది.

> **'ఏ రోజయితే దేశంలోని ప్రజలందరూ మరుగుదొడ్లు వినియోగించుకుంటారో ఆ రోజే దేశం సమున్నతమయిన విజయం సాధించినట్లవుతుంది"**
>
> **- జవహర్‌లాల్ నెహ్రూ**

ఆ గ్రామంలో మొత్తం 332 ఇండ్లకుగాను 79 కుటుంబాలకు మాత్రమే గతంలో మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. ఇంకా 253 ఇండ్లకు మరుగుదొడ్లు నిర్మించాలని కమిటీలు సర్వే ద్వారా తెలుసుకున్నారు. అంతేకాకుండా గ్రామంలో ఇంకుడు గుంతలు కూడా నిర్మించాలని నిర్ణయించుకున్నారు. జిల్లాలో గుర్తించిన 180 మంది మేస్త్రీల సేవలను ఆ గ్రామంలోని మరుగుదొడ్ల నిర్మాణానికి వాడుకున్నారు. లక్ష్యాన్ని పూర్తి చేశారు.

మరుగుదొడ్ల నిర్మాణ కార్యక్రమాన్ని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి శ్రీ టి. హరీష్‌రావు గారు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నవాబ్‌పేట గ్రామస్థులు ఎంతో సంకల్పంతో గ్రామజ్యోతి కార్యక్రమాన్ని ఉపయోగించుకుని ఈ బృహత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఎంతో అభినందించదగ్గ విషయమని అన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు నిర్మించుకుని వాటిని సక్రమంగా ఉపయోగించగలిగినప్పుడే ప్రతి గ్రామంలో ఆరోగ్యం వెల్లివిరుస్తుందని తెలియజేశారు.

గ్రామజ్యోతి కార్యక్రమంలో భాగంగా ఈ గ్రామాన్ని దత్తత తీసుకుని ఈ కార్యక్రమనంతటిని ఎంతో చొరవతో ముందుండి నడిపిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీ రోనాల్డరోస్‌ను అభినందించారు. స్థానిక గౌరవ శాసన సభ్యులు, జెడ్‌పిటిసి, మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లాలోని అన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఎంపిటిసి స్థానిక సర్పంచ్, ఇతర నాయకులు అధికారులు ఈ బృహత్తర కార్యక్రమంలో పాలుపంచుకుని వారి వంతు సహకారాన్ని అందించారు.



ఈ విధంగా కేవలం 72 గంటల వ్యవధిలోనే ఆ గ్రామ రూపురేఖల్ని మార్చివేసి, సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా **'నయా నవాబ్‌పేట్'**గా మార్చడం జరిగింది. గ్రామ ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారు.

సంకల్ప సిద్ధి ఉంటే ఎంతటి జటిల కార్యక్రమాన్నయినా విజయవంతం చేయవచ్చని మెదక్ జిల్లా కలెక్టరు నిరూపించారు.

*- కె. యాదయ్య, సంయుక్త సంచాలకులు (పరిపాలన), టి.సిపార్డ్*

# పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు



**ఖమ్మం జిల్లాలోని ముదిగొండ మండల మేడేపల్లి గ్రామపంచాయితీ ఓ ఆదర్శ గ్రామ పంచాయితీ. ఓ మహానీయుని స్ఫూర్తితో గ్రామానికి అంకిత భావంతో ఆయన చేసిన సేవలతో గ్రామం వెలుగులోకి వచ్చింది. గ్రామంలో అందరిది ఒకే మాట. పార్టీలకు, రాజకీయలకు అతీతంగా ఊరి అభివృద్దే ధ్యేయంగా నడుం బిగించి బాపూజీ కన్న కలలకు ప్రతిరూపంగా గ్రామాన్ని నిలిపారు.**

## గ్రామ పంచాయితీలకే ఆదర్శంగా నిలిచిన మేడేపల్లి గ్రామ పంచాయితీ

కేవలం 1 రూపాయికే 20 లీటర్లు నీటి సరఫరా, గ్రామంలో పిల్లలందరూ బడి బాట, మరుగుదొడ్డి సౌకర్యం, సేంద్రీయ ఎరువులతో వ్యవసాయం, పారిశుద్ధ్యం, గ్రామానికీ ఓ జాతీయ బ్యాంకు, నూరుశాతం మహిళా గ్రామపంచాయితీ, ఇంకా ఎన్నో ఈ గ్రామంలో విశిష్టతలు.

గ్రామానికి సంబంధించిన అభివృద్ధి, పాలన విధానంలో సమిష్టి నిర్ణయాలు తీసుకుంటారు. నీటి సరఫరా గత ఐదు సంవత్సరాల నుంచి ఒక్కరోజు కూడా ఆగలేదు అంటే అతిశయోక్తి కాదు.

సమిష్టి కృషితో పాఠశాల, పశువుల ఆసుపత్రి, ఆరోగ్య సబ్





సెంటర్, అంగన్‌వాడి, కల్యాణమండపం మొదలైన భవనాలు నిర్మించుకున్నారు.

పారిశుద్ధ్యం, వీధి దీపాలు, త్రాగునీరు అంతర్గత రహదారులు మురుగు కాల్వలు, విద్య, శాంతి భద్రతలు – ప్రతి పనికి ఒక కమిటీ ఈ ఆదర్శ గ్రామ విశిష్టం.

ఈ గ్రామ పంచాయితీ మహిళా గ్రామపంచాయితీ. ఈ విషయంలో కూడా ప్రజల సమిష్టి నిర్ణయమే మహిళలకు పెద్ద పీట వేసింది. ప్రస్తుత సర్పంచ్ విద్యాధికురాలు. వీరి స్ఫూర్తితో గ్రామంలోని ప్రతి మహిళ ఏదో ఒక పొదుపు గ్రూపులో సభ్యురాలిగా ఉంటుంది. అన్ని గ్రూపులు పని చేస్తూ ఉండటమే ఈ మేడేపల్లి గ్రామ విశేషం.

అతి క్లిష్టమైన సమస్య పారిశుద్ధ్యం. ఇక్కడి డ్వాక్రా సభ్యులు వీధులను దత్తత తీసుకుని పారిశుద్ధ్యానికై పాటు పడుతున్నారు.

తడిపొడి చెత్తలను చేరవేయటానికి జిల్లాలోనే మొదటి డంపిగ్ యాడ్‌ను ఈ గ్రామంలో నిర్వహించటం వారి ఆరోగ్య పరిరక్షణపై ఉన్న అవగాహనపై తార్కాణం.

తడిచెత్తను కంపోస్టుగా మార్చేందుకు గ్రామజ్యోతి కార్యక్రమంలో చర్యలు చేపట్టింది.

పదిహేనేళ్ళ క్రితమే అభివృద్ధి జ్యోతికి రోల్ మోడల్‌గా మారిన ఈ గ్రామానికి నేటి గ్రామజ్యోతి మరింత మెరుగుదిద్దుతుందనడంలో అతిశయోక్తి లేదు.

ఈ గ్రామ రైతు పొదుపు సహకార సంస్థ. ప్రస్తుతం రూ. 1.5 కోట్ల నిధులతో నడుస్తున్నది. దేశ చట్ట సభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ల విషయంలో ఇప్పటికి అతిగతి లేదు. కాని మేడేపల్లి గ్రామంలో పాలకులు 100% మహిళలే వారి అజెండా అభివృద్దే!

సంసద్ ఆదర్శ గ్రామయోజన సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికైన 12 మందిలో మేడేపల్లి గ్రామ సర్పంచ్ కూడా ఒకరు. మేడేపల్లి గ్రామ ప్రజలు గర్వించే విషయమిది. ఇది సమిష్టి కృషి వల్లనే సాధ్యమైంది.

1996 సంవత్సరంలో ఉత్తమ గ్రామ పంచాయితీగా మొదలైన ఈ ప్రస్థానం ఎన్నో అవార్డులు, పురస్కారాలు పొందుతూ మహా ప్రస్థాన దిశగా వడివడిగా అడుగులు వేస్తూ ప్రస్తుత తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావుచే 2015 ఉత్తమ పంచాయితీగా అవార్డు అందుకున్నది.

2433 జనాభా కలిగిన మేడేపల్లి గ్రామస్థుల సమిష్టి కృషిని ఈ గ్రామాన్ని దర్శించిన విదేశీయుల సైతం అభినందించకుండా ఉండలేక పోయారు.

గ్రామజ్యోతి కార్యక్రమంలో పేదరిక నిర్మూలనకు "నడుం కట్టుకుంది. సబ్‌ప్లాన్ నిధుల నుండి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రాబోయే ఐదు సంవత్సరాలలో వారినిపై స్థాయికి తీసుకురావడానికి గ్రామజ్యోతి ఉపయోగపడుతుంది. గ్రామజ్యోతిలో ఇచ్చిన కార్యచరణ కమిటీ ద్వారా పేదరిక నిధులకు ప్రణాళికలకు తయారు చేసుకొని రాబోయే 5 సంవత్సరాలలో మేడేపల్లి ఆదర్శ గ్రామంగా ఇంక అభివృద్ధి చేయటానికి గ్రామజ్యోతి ఆయుధంగా ఉపయోగపడుతుంది.

*– యం. సురేష్, జిల్లా శిక్షణాధికారి, ఖమ్మం*




# గ్రామజ్యోతి స్ఫూర్తితో గ్రామాలకు సమాచార సాంకేతికత అనుసంధానం

## భవిష్యత్తు డిజిటల్ రంగానిదే

**ఆధునిక మనిషి ఆలోచనా విధానాన్ని ఆవిష్కరిస్తూ అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం నేటి మనిషి జీవనశైలిపై చాలావరకూ ప్రభావం చూపుతోంది. దీనితో మనిషి జీవనంలో పెనుమార్పులు సంభవిస్తున్నాయి. ఫలితంగా ప్రపంచాన్నే సమాచార సాంకేతిక రంగం (ఐ.టి) రంగం శాసిస్తోంది. దీనితో రోజురోజుకీ సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోంది. అన్ని వివరాలు అంతర్జాలంలో చూసుకునే వీలుంది. టికెట్ల నుండి తిండి వరకు అన్నీ ఆన్‌లైన్‌లోనే ఆర్డర్ చేస్తే అలా వచ్చి గుమ్మంలో వాలిపోతున్నాయి.**

పూర్వకాలంలో పావురాలతో కబుర్లు పంపే ఆనవాయితీ వుండేది. తరువాత ఎలాంటి వర్తమానాలయినా ఉత్తరాలతో సమాచారాన్ని పంపించేవారు. ఆ తరువాత టెలిగ్రామ్స్‌లు, ల్యాండ్ ఫోన్లు, ఎస్‌టిడి బూతులు, కాయిన్ బాక్సులతో సమాచారాన్ని తెలియజేసేవారు.

ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అడ్వాన్స్ కావడంతో ఇంటర్‌నెట్, ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సప్, స్కైప్, వైఫర్, చాటింగ్ వంటి వాటితో సమాచార వ్యవస్థ ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పుకోవాలి.

సెల్ ఇలా అందరి చేతుల్లోకి వస్తుందని దశాబ్దంన్నర క్రితం కనీసం ఊహకైనా మనకు అందలేదు. ఈ రోజు సెల్ లేని వ్యక్తిని ఊహించలేకపోతున్నాం. ఈ మొత్తం వ్యవహారాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే సమాచార రంగంలో సాంకేతికంగా జరిగిన పురోగతిగా అంతకు మించి విప్లవంగా వర్ణించాలి. అతి పెద్ద మలుపుగానూ భావించవచ్చు.





సాధారణంగా సాంకేతిక ప్రగతి ముందు సంపన్నుల వద్దకు చేరుతుంది. చాలాకాలం వారి ఆధీనంలోనే ఉండింది. అయితే, ఏదో ఒకరోజు నిక్కచ్చిగా పేదవాడి పంచకు వస్తుంది. వంటగ్యాస్ ఒకప్పుడు మధ్యతరగతి, కాదంటే వేతన జీవుల వస్తువు. ఈనాడు అది వివిధ పథకాల కింద పేదవాడి గుడిసెలకు చేరింది.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) ఒకప్పుడు కార్పొరేట్ అవసరాలను మాత్రమే తీర్చేది. ఇప్పుడు అది మధ్య తరగతికి అత్యవసరమైనదిగా మారి పేదవాడి చెంతకు చేరేందుకు ఉరుకులు, పరుగులు తీస్తోంది. ఒకప్పుడు కరెంటు మాదిరిగానే ఇప్పుడు ఐటి ప్రయోజనాలు లేకుంటే పొద్దుగడవని పరిస్థితి నెలకొంది.

మన రాష్ట్రాన్నే చూసుకుంటే, వివిధ రుసుములు, పన్నులను ఆన్‌లైన్‌లో చెల్లించుకునే పరిస్థితి వచ్చింది. ఈ సేవ మన రాష్ట్రంలో నిజంగా ఒక సాంకేతిక విప్లవం. రాను రాను మరిన్ని సర్వీసులు ఈ సేవ పరిధిలోకి వస్తుండటంతో అది పేదవాడికి మరింత మేలైన సదుపాయాలు, సౌకర్యాలను అందించే స్థితికి చేరుకుంటోంది. వివిధ పరీక్షలు, ఎంట్రెన్స్ టెస్టుల ఫీజులు మొదలుకొని విద్యుత్తు ఛార్జీలు, నీటి బిల్లులు, సెల్‌ఫోన్‌లకు సంబంధించి ప్రీపెయిడ్, పోస్ట్ పెయిడ్ రుసుములను నేరుగా ఆన్‌లైన్‌లో చెల్లించుకునే వెసులుబాటు నేడు లభిస్తోంది.

ఇది ఐటి సాధించిన ఘనత. వివిధ కార్యాలయాల ముందు బారులు కట్టి నిలుచునే అవస్థ తప్పిందని సామాన్యుడు భావిస్తున్నాడు. ఐటి విద్యలో పేరెన్నికగన్న ఒక సంస్థ అధిపతి ఒక సందర్భంలో చెప్పినట్టు – తనకు తానుగా కంటే, ఉన్న వ్యవస్థ ఉన్నతీకరణకు తద్వారా మరిన్ని ప్రయోజనాలు పొందేందుకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ తోడ్పడుతుంది. ప్రయోజనం పదింతలైనా ఆశ్చర్యపోనవసరం లేదని ఆయన అంటారు.

ఇంటర్నెట్ సౌలభ్యం ఉంటే ఇంట్లోనే కూర్చుని రిజర్వేషన్ కార్యకలాపాన్ని సాగించవచ్చు. దేశంలో ఎక్కడి నుంచి మరెక్కడికైనా రిజర్వేషన్ చేయించుకునే సౌకర్యం ప్రస్తుతం ఉంది. ఐటి ప్రయోజనాలు దూరమైతే జనజీవనం ఎలా స్తంభిస్తుందో అవగతమైంది. అంతెందుకు, సర్వర్ డౌన్ అయిందంటే చాలు వివిధ కౌంటర్ల దగ్గర ఉన్న జనంలోని అసంతృప్తిని ప్రత్యక్షంగా పరిశీలించవచ్చు. ప్రింటర్ సరిగ్గా లేదని చెప్పి, మరో బ్యాంకులో డీడీ కట్టుకోండి అని చెబితే కష్టమర్లు కనబరిచే అసహనం చెప్పనలవికానిది.

మన రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారాలను కంప్యూటరీకరించిన నేపథ్యంలో అవకతవకలకు ఒకమేర అడ్డుకట్ట పడిందనే చెప్పవచ్చు. ఆన్‌లైన్‌లో వ్యవహారాలు నమోదవుతున్నాయి. దాంతో అక్రమాలకు చెక్ పెట్టినట్లయింది. భూమిని కొన్న వ్యక్తుల ఫొటోలను స్కానింగ్ చేసి రికార్డులో భద్రపరుస్తుండటం ఇటీవలే మొదలైంది.

దీని ద్వారా ఒకరి భూమిని మరొకరు కబ్జా పెట్టేందుకు వీలుండదు. కోర్టులు మొదలుకొని ఇతర చట్టబద్ధ సంస్థల వరకు అక్రమాలను అరికట్టేందుకు అన్ని వ్యవస్థలకు చక్కటి వెసులుబాటు లభిస్తుంది. బ్యాంకుల దగ్గర కుదవబెట్టుకుని రుణాలు మంజూరు చేయించుకోవడం చాలా తేలికవుతుంది. ఫొటోలతో ఆధారాలు ఉన్నందున రుణ మంజూరులో జాప్యం తగ్గుతుంది. రికార్డులు పక్కాగా ఉంటాయి.



అలాగే వివిధ సంక్షేమ పథకాలను ఉపయోగించుకునే అట్టడుగు వర్గాలకు సంబంధిత కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు చాలా అవసరం. వీటిని కూడా ఈ సేవ ద్వారా పొందే సౌలభ్యం అందుబాటులోకి వస్తోంది. దళారుల ప్రమేయం లేకుండా సర్టిఫికెట్లను పొందేందుకు ఐటి ఎంతగానో సహకరిస్తోంది.

ఉపాధిహామీ పథకం, వృద్ధులు, వితంతువులకు ఇచ్చే పింఛను తదితర సంక్షేమ పథకాల లబ్ధిదారులకు నేడు బ్యాంకు ద్వారానే చెల్లింపులు జరుగుతున్నాయి. కంప్యూటరీకరణ త్వరితగతిన పూర్తయిన నేపథ్యంలో తమ సదుపాయాలన్నింటినీ పేదవాడి ముంగిట వద్దకు తీసుకువెళ్ళగలిగే సత్తా నేడు బ్యాంకులకు లభించింది. ఐటి పుణ్యాన నేడు బ్యాంకు గడప ఎక్కని వ్యక్తి అంటూ లేడు.

ప్రపంచంలోనే వ్యక్తులను గుర్తించడంలో అత్యంత భద్రత కూడిన ఆధార్ 12 అంకెల గుర్తింపు వ్యవస్థకు డిజిటలైజేషన్ ప్రక్రియలో

భాగంగా భారతదేశం నిర్వహించడం జరిగింది. దీనిద్వారా అత్యంత సులభంగాను అవినీతికి, అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది.

ఆన్‌లైన్ ట్రాన్స్‌మిటింగ్ పద్ధతిలో అతని వ్యక్తిగత ఖాతాకు డబ్బు వచ్చి చేరుతోంది. ఈ సిస్టమ్‌తో ముఖ్యంగా దళారుల ఆగడాలకు అడ్డుకట్టపడింది. సంబంధిత అధికారుల్లో కొందరు మొదలుకొని అడుగడుగున దళారులు చేసే మోసాలు తగ్గాయనే చెప్పవచ్చు. ఐటి ప్రయోజన ఫలితంగా బ్యాంకులు నేడు ఎటిఎం కేంద్రాలను ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేయగలిగాయి. ఆన్‌లైన్ నగదు బదిలీకి ఇవి కేంద్రాలు. వీటి ఏర్పాటుతో విరామం లేకుండా రోజులో ఇరవై నాలుగు గంటలూ డబ్బులు తీసుకునే సదుపాయం కస్టమర్లకు లభించింది. ఎటిఎంల రాకతో డబ్బుకు భద్రత తోడు ఎప్పుడంటే అప్పుడు సొమ్ము తీసుకునే సదుపాయం చిక్కింది. నెట్ అందుబాటులో ఉంటే కూర్చున్న చోటు నుంచి కాలు కదపకుండా సమస్త బ్యాంకింగ్ సదుపాయాలను ఎంచక్కా వినియోగించుకోవచ్చు.

ప్రాయోజిత వర్గాలను ఒక సముదాయం కిందకు చేర్చే క్రమంలో ఐటి సహకారం ఎనలేనిది. రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, వివిధ సంక్షేమ పథకాలకు ప్రయోజనదారులు ఇలా ఒకటనేమిటి వివిధ



వర్గాలను నేడు ఐటి సహాయంతో రూపకల్పన చేసిన ఒకానొక ఎలక్ట్రానిక్ వ్యవస్థలోకి చేర్చక తప్పటం లేదు. ఐటీ సర్వీసులు లేని వ్యవస్థను కనీసం ఊహించుకోవడం కూడా నేడు సాధ్యం కావటం లేదు. మరో మాటలో చెప్పాలంటే ఐటి అంతగా సమాజంతో పెనవేసుకుంది. ఐటి విస్తృతి శరవేగంతో కొనసాగుతోంది.

రాష్ట్రంలో అభివృద్ధిని అతివేగంగా నడిపించడానికి, వైఫై కనెక్టివిటీ ఆవశ్యకత ఎంతో ఉంది. పేదలు, లక్షిత వర్గాలు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను అందుకోలేని ఐ.టి. ద్వారా వారికి చేరువ కావడంతో వారి జీవన గమనంతో పాటు వారి జీవన ప్రమాణాలను సమూలంగా మార్చివేసే అవకాశం ఉంది.

అన్ని గ్రామాలను అంతర్జాల సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చి గ్రామాలను టెక్నాలజీతో అనుసంధానం చేసి అన్ని ప్రభుత్వ కార్యకలాపాలను వాటి ద్వారా అమలు చేయడం ద్వారా అందరికి




అందుబాటులో ఉండటంతో పాటు ఎంతో సౌకర్యంగా, పారదర్శకంగా ఉంటుంది.

అన్ని ప్రభుత్వ శాఖల సేవలను ఈ సర్వీసెస్ ద్వారా అందుబాటులోకి తేవడం ద్వారా ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. సుస్థిర, సమర్థత, పారదర్శకత ఇవన్నీ కూడా ఆధునిక టెక్నాలజీతోనే ఆచరణ సాధ్యం. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత అందుబాటులోకి వచ్చే వీలుంటుంది.

చెప్పాలంటే ఈ సాంకేతిక పరిజ్ఞానం పూర్తిగా గ్రామాలు వరకూ వెళ్ళాలి. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని గతాన్ని మరువకుండా అదే సమయంలో భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని, విజ్ఞానాన్ని గ్రామస్థాయి వరకూ తీసుకెళ్ళగలగాలి.

భవిష్యత్‌లో టెక్నాలజీ వాడకం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ సాంకేతిక వినియోగంతో ప్రజలు జీవన శైలి మరింత మెరుగు పడుతుంది. కావున ప్రతి పౌరుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చుకోవాలి. అలా జరిగిన రోజు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలు కూడా ప్రజలకు సకాలంలో అందుతాయి.

అవినీతి, అక్రమాలు పూర్తిగా నిరోధించడానికి వీలుంటుంది. సమాచార, సాంకేతిక రంగం (ఐటి), సాంకేతికతలో గ్రామీణ ప్రజల స్థితిగతులు మరింత మెరుగయ్యేలా అభివృద్ధి కార్యక్రమాలు అమలు పారదర్శకంగా జరుగుతాయి.

*– కె. యాదయ్య, సంయుక్త సంచాలకులు (పరిపాలన), టి.సిపార్డ్*

# సమిష్టిగా పనిచేద్దాం



మెదక్ మండలం శివ్వాయిపల్లిలో మంత్రి హరీశ్‌రావు, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డికి బోనాలు, బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న మహిళలు



కరీంనగర్: కమాన్‌పూర్ మండలం సుందిళ్లలో గ్రామజ్యోతిలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్



నల్లగొండ: సూర్యాపేట మండలం పిల్లలమర్రిలో మొక్క నాటుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



ఖమ్మం: టేకులపల్లిలో మోరీని శుభ్రం చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- సమస్యలను పరిష్కరించుకుందాం
- పల్లెల సమగ్రాభివృద్ధికి పాటుపడుదాం
- నాలుగోరోజు గ్రామజ్యోతిలో ప్రజాప్రతినిధులు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** 'రాజకీయాలకు అతీతంగా సమిష్టిగా పనిచేసి పల్లెల్లో సమస్యలను పరిష్కరించుకుందాం. గ్రామాల సమగ్రాభివృద్ధికి పాటుపడుతూ గంగదేవిపల్లిలా తీర్చిదిద్దుదాం. గ్రామాల అభివృద్ధితో నే దేశాభివృద్ధి సాధ్యం. సకల సమస్యల పరిష్కారం కో సమే ప్రభుత్వం గ్రామజ్యోతి ప్రవేశపెట్టింది. ఇం డ్లను, పరిసరాలను, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రజలు గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తేవాలి. గ్రామజ్యోతిలో గుర్తించిన సమస్యలకు తప్పకుండా పరిష్కారం లభిస్తుంది. నాలుగేండ్లలో గ్రామాల్లో రూ.25 వేల కోట్లు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రజలు దీనికి సహకరించాలి' అని ప్రజాప్రతినిధులు సూచించారు. గ్రామజ్యోతిలో నాలుగోరోజైన గురువారం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, అధికారులు తాము దత్తత తీసుకున్న గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు.

గ్రామజ్యోతి

**గ్రామాల అభివృద్ధే లక్ష్యం:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే తన జీవిత లక్ష్యమని, ఇందుకోసం నిరంతరం కృషిచేస్తానని అసెంబ్లీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి పేర్కొన్నారు. వరంగల్ జిల్లా మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామజ్యోతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని దత్తత తీసుకున్నానని తెలిపారు. అభివృద్ధికి అందరూ సహకరిస్తే మరో గంగాదేవిపల్లిలా మొట్లపల్లిని తయారు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని పిడిసిల్ల పాఠశాల హెడ్‌మాస్టర్ నాగేశ్వర్‌రావు గ్రామజ్యోతికి రూ.5116 విరాళంగా స్పీకర్ సమక్షంలో అందజేశారు. ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ కరీంనగర్ జిల్లా కమాన్‌పూర్ మండలం సుందిళ్లలో ఎమ్మెల్యే పుట్ట మధు, ధర్మారం మండలం చామన్‌పల్లిలో చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్, ఎంపీ బాల్క సుమన్‌తో కలిసి పాల్గొన్నారు. మెదక్ మండలం శివ్వాయిపల్లిలో భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు అభివృద్ధి చెందాలంటే జీవన విధానంలో మార్పురావాలన్నారు. ఖమ్మం జిల్లా టేకులపల్లిలో ఆర్‌అండ్‌బీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని, సమస్యల పరిష్కా రం కోసమే గ్రామజ్యోతిని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. మంత్రి స్వయంగా పారపట్టి డ్రైనేజీలో చెత్తను తొలగించారు. నల్లగొండ జిల్లా సూర్యాపేట మండలంలో దత్తత తీసుకున్న పిల్లలమర్రి గ్రామంలో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పర్యటించారు. సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం గ్రామజ్యోతిని ప్రవేశపెట్టిందన్నా రు. రంగారెడ్డి జిల్లా శం షాబాద్ మండలం తొండుపల్లిలో రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పర్యటిం చారు. మహబూబ్‌నగర్ జిల్లా కొడంగల్‌లో భారీ పరిశ్రమలశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దత్తత తీసుకున్న పెబ్బేరు మండలం కంబాళాపూర్‌లో పర్యటించారు. ఆదిలాబాద్ మండలం వాఘాపూర్, రాజుగూడ, పోతగూడ, ఖండాల, దార్‌లొద్ది(కే), లోహరా గ్రామాల్లో అటవీశాఖ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. సారంగాపూర్ మం డలం అలూర్, కౌట్ల(బీ) గ్రామాల్లో దేవాదాయ, గృహనిర్మాణశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పర్యటించారు.



మహబూబ్‌నగర్: కంబాళాపూర్ పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న నిరంజన్‌రెడ్డి



ఆదిలాబాద్: సారంగాపూర్ మండలం అలూర్ గ్రామజ్యోతిలో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



ఆదిలాబాద్ మండలంలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న మంత్రి రామన్న



వరంగల్: మొట్లపల్లి సభలో మాట్లాడుతున్న స్పీకర్ సిరికొండ



రంగారెడ్డి: తొండుపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

Printed & Published by: Anita Ramachandran, Commissioner, on behalf of TSIPARD, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. Telangana, Published at TSIPARD, Rajendranagar, Hyderabad-500 030 **Editor : Anita Ramachandran**